అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం 09-04-2025

సంపుటి : 11 | సంచిక : 98 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50


ప్రజలపై భారం వేయొద్దు

వంటగ్యాస్ ధరల పెంపుపై నేడు, రేపు రాష్ట్రవ్యాప్త నిరసనలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచడం దారుణమని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. పేద, మధ్యతరగతి ప్రజలపై భారం వేయొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని... 13లో



చట్ట విరుద్ధం... ఏకపక్షం

తమిళనాడు గవర్నర్ చర్యపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

- గవర్నర్ ఆర్.ఎన్. రవి తీరు ఆక్షేపణీయం
- ఆ పది బిల్లులూ ఆమోదం పొందినట్లేనని స్పష్టీకరణ
- కాలపరిమితికి కట్టుబడి ఉండాల్సిందేనని నిర్దేశం
- రాజకీయ ప్రయోజనాలు తగవని చురక

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టులో మంగళవారం తమిళనాడు ప్రభుత్వానికి పెద్ద ఊరట లభించింది. రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి శాసనసభ పంపిన పది బిల్లులను ఆమోదించకుండా రాష్ట్రపతి పరిశీలన కోసం పంపడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుపట్టింది. గవర్నర్ నిర్ణయం చట్ట విరుద్ధంగా, ఏకపక్షంగా ఉన్నదని వ్యాఖ్యానించింది. అంతేకాక తమకు పంపిన బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్ర గవర్నర్లకు కాలపరిమితి నిర్ణయించింది. రాజ్యాంగంలోని 142వ అధికరణ కల్పించిన అధికారాలను ఉపయోగించు కున్న సుప్రీంకోర్టు... గవర్నర్ తన వద్ద అట్టే పెట్టుకున్న పది బిల్లులు ఆమోదం పొందినట్లు అసాధారణ రీతిలో ప్రకటించింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ ఈ మేరకు చారిత్రక తీర్పును వెలువరించింది. ఈ పరిణామం నేపథ్యంలో రాష్ట్రపతి తీసుకోబోయే చర్యలకు ఉనికి ఉండదని తేల్చి చెప్పింది.

తక్కువ చేయడం లేదు కానీ...

'బిల్లులను ఆమోదించడం లేదని ప్రకటించడానికి ముందు రాష్ట్ర గవర్నర్ వాటిని అనవసరంగా తన వద్ద సుదీర్ఘ కాలం అట్టే పెట్టుకున్నారు. బిల్లులను గవర్నర్ పెండింగులో ఉంచిన సమయాన్ని, గతంలో ఇలాంటి విషయాలలో కోర్టు నిర్ణయాన్ని గవర్నర్ సరిగా గౌరవించని విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్టికల్ 142ను ఉపయోగించుకుంటున్నాం' అని న్యాయమూర్తులు తెలిపారు. 'మేము గవర్నర్ కార్యాలయాన్ని తక్కువ చేయడం లేదు. శాసనసభ ద్వారా వ్యక్తమవుతున్న ప్రజాభీష్టాన్ని, అలాగే ప్రజలకు బాధ్యత వహించే ప్రభుత్వాన్ని గౌర వించాలని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంప్రదాయాల విషయంలో గౌరవంగా వ్యవహరించాలని మాత్రమే ...13లో

ఇది చారిత్రాత్మకం

రాష్ట్రాల హక్కులను కాపాడింది

సుప్రీం తీర్పుపై సీపీఐ (ఎం) హర్షం



న్యూఢిల్లీ : తమిళనాడు శాసనసభ పంపిన బిల్లులకు ఆమోదం తెలపకుండా వాటిని తన వద్దే ఉంచుకున్న గవర్నర్ చర్యను తప్పుపడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సీపీఐ (ఎం) స్వాగతించింది. గవర్నర్ పెండింగులో ఉంచిన పది బిల్లు లకు చట్ట రూపం లభించిందని సుప్రీంకోర్టు ప్రకటించడం పట్ల హర్షం వెలిబు చ్చింది. 'గవర్నర్ చర్యలు చట్టవిరుద్ధం, ఏకపక్షం అని సుప్రీంకోర్టు అభివర్ణించింది. ఒకసారి శాసన సభ బిల్లులను ఆమోదించిన తర్వాత వాటిపై నిర్ణయం తీసుకోవడానికి న్యాయస్థానం కాల పరిమి తిని కూడా నిర్దేశించింది. ఇది చారిత్రక తీర్పు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రా లకు చెందిన చాలా మంది గవర్నర్ల చర్యలను కూడా ఈ తీర్పు తప్పుపట్టింది. వారు రాజ్యాంగంలోని సమాఖ్య సూత్రాలకు ...13లో

టారిఫ్‌లపై మోడీ మౌనం


ట్రంప్ వాణిజ్య యుద్ధంపై పెదవి విప్పని కేంద్రం | దీటుగా స్పందిస్తున్న చైనా | మేము సైతం అంటున్న ప్రపంచ దేశాలు

ఉలుకూపలుకూ లేని భారత్

అమెరికాకు విధేయతేనంటున్న ఆర్థికవేత్తలు

వాణిజ్య భాగస్వాములపై ట్రంప్ ప్రారంభించిన సుంకాల యుద్ధం విషయంలో చైనా, కెనడా, మెక్సికో లాంటి దేశాలు అమెరికా అధ్యక్షుడి దూకుడుకు బెదిరేదిలేదంటున్నారు. కానీ మన దేశ ప్రధాని మోడీతో సహా ప్రధాన స్రవంతి మీడియా మాత్రం మౌనం వహిస్తోంది. విధానపరమైన చర్చలూ జరగడం లేదు.

న్యూఢిల్లీ : అమెరికా విధించిన ప్రతీకార సుంకాల కారణంగా మన దేశం అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉన్నప్పటికీ వాటిపై పెద్దగా ఎవరూ చర్చించడం లేదు. అదే సమయంలో చైనా స్పందన చాలా తీవ్రంగా ఉంటోంది. అమెరికాకు తలొగ్గేది లేదంటూ దీటుగా స్పందిస్తోంది. అమెరికా ఉత్పత్తులపై సుంకాలు విధించడం, ఎగుమతులపై నియంత్రణలు, ప్రపంచ వాణిజ్య సంస్థకు ఫిర్యాదులు, తన భూభాగంలో అమెరికా సంస్థలను లక్ష్యంగా చేసుకొని దర్యాప్తులు వంటి చర్యలకు దిగుతోంది. దారికి రాకుంటే మరిన్ని సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ బేఖాతరు చేస్తోంది. కానీ మన దేశం అనుసరిస్తున్న మెతక వైఖరి దాని సైద్ధాంతిక, సంస్థాగత, భౌగోళిక, రాజకీయ పరిమితులకు అద్దం పడుతోందని పరిశీలకులు అభిప్రాయపడు తున్నారు. ట్రంప్ సుంకాల యుద్ధానికి భారత్ స్పందన నిశ్శబ్దంగా ఉంది. అమెరికా అధ్యక్షుడితో ఇటీవల ప్రధాని మోడీ జరిపిన సమావేశం భారత్ విధేయతను ప్రతిబింబించింది. అమెరికా ప్రభుత్వం మన పౌరులను బలవంతంగా దేశం నుంచి బహిష్కరిస్తున్నా, సంకెళ్లు వేసి కండ్లకు గంతలు కట్టి అమానవీయంగా సైనిక విమానాలలో పంపుతున్నా కిమ్మనడం లేదు. పైగా వారి పట్ల అమానుషంగా వ్యవహరించలేదంటూ కితాబు ఇచ్చింది. ఈ అవమానాలపై ప్రభుత్వ మౌనాన్ని ఎత్తిచూపుతూ తమిళ పత్రిక వ్యంగ్య కార్టూన్ ప్రచురించినప్పుడు మాత్రం క్రూరమైన సమాచార సాంకేతిక చట్టం కింద ...6లో



అమెరికా మార్కెట్‌పై ఆధారపడే వైఖరినా..?


నిర్దిష్ట ఎగుమతుల కోసం అమెరికా మార్కెట్‌పై ఆధారపడే వైఖరిని భారత్ విడనాడాల్సి ఉంటుంది. భౌగోళికంగా భారత్ అనుసరించే ఎగుమతి వ్యూహం ప్రపంచ మార్కెట్లలో మన బేరసారాల శక్తిని పెంచుతుంది. దీనితో పాటు అమెరికా, చైనా నుండి విదేశీ ...6లో

తక్షణమే వెళ్లిపోండి..

అమెరికాలో వలసవాదులకు ట్రంప్ హెచ్చరిక

లేదంటే రోజుకు రూ.86వేల జరిమానా : యూఎస్ డీహెచ్ఎస్

వివరాలు 6లో..



5గురికి ఉరే సరి

దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో కీలక తీర్పు

- ఎన్ఐఏ కోర్టు తీర్పును ఆమోదించిన హైకోర్టు

నవతెలంగాణ -హైదరాబాద్

హైదరాబాద్ నగరం దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన జంట బాంబు పేలుళ్లకు పాల్పడిన కేసులో ఐదుగురికి ఉరిశిక్షను సమర్థిస్తూ హైకోర్టు తీర్పు వెల్లడించింది. గతంలో ఎన్ఐఏ స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ మేరకు మంగళవారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, శ్రీసుధలతో కూడిన డివిజన్ బెంచ్ 357 పేజీల సంచనల తీర్పు చెప్పింది. 2013, ఫిబ్రవరి 21న రాత్రి 7 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ 107 నెంబర్ బస్టాప్ వద్ద, అక్కడే ఉన్న ఏ1 మిర్చి సెంటర్ వద్ద వెంటవెంటనే బాంబులను పేల్చిన దోషుల విషయంలో కనికరం అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ ఘటనలపై అప్పటి ఉమ్మడి ఏపీ సర్కార్ సిట్ ఏర్పాటు చేయగా, కేంద్ర హెూం శాఖ ఎన్ఐఏను రంగంలోకి దింపింది. బాంబు ...13లో

తెలుగు రాష్ట్రాల

వివాదానికి తెర

234వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఆధీనంలోకి సాగర్ డ్యాం

తెలంగాణ వైపు నుంచి వైదొలిగిన 39వ బెటాలియన్



నవతెలంగాణ - నాగర్జునసాగర్

నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ డ్యాం భద్రత విషయంలో వారం రోజులుగా నడుస్తున్న హై డ్రామాకు మంగళవారం తెర పడింది. 2023లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాగార్జున సాగర్ డ్యాంపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఏర్పడిన వివాదం కారణంగా డ్యాం భద్రతా విధులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక పోలీసు దళాల నుంచి సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాల ఆధీనంలోకి వెళ్లిపోయింది. డ్యాంపై 13వ గేటు వరకు తెలంగాణ వైపు 39వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ బలగాలు, 13వ గేటు నుంచి 234వ ...5లో

లేబర్ కోడ్‌లు మరణ శాసనం

- కార్మికుల హక్కులను కేంద్రం హరించే కుట్ర
- వాటి అమలును వెంటనే నిలిపేయాలి

మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి : కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల రాష్ట్ర సదస్సులో వక్తలు

మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"లేబర్ కోడ్‌లు కార్మికుల పాలిట మరణ శాసనాలు. అవి అమల్లోకి వస్తే ఈ దేశంలో ఉండే కార్మిక వర్గం యాజమాన్యాలకు బానిసలుగా మారే ప్రమాదం ఉంది. వాటిని అమలు జరపకుండా మోడీ సర్కార్‌పై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాల్సిన తరుణం ఆసన్నమైంది. ఈ క్రమంలో మే20న తల పెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి" అని వక్తలు పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్ల ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ వక్తలను వేదికపైకి ఆహ్వానించగా, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ సదస్సు ముసాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ కార్మికవర్గాన్ని తుడిచి పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికవర్గాన్ని కాదని కేంద్రానికి మద్దతు పలుకుతున్న బీఎంఎస్ వైఖరిని క్షేత్రస్థాయిలో ఎండ గట్టాలని కోరారు. "లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే కార్మికులు యాజమాన్యాలకు బానిసలుగా మారే ప్రమాదముంది. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు, కార్మిక సంఘాలు కనుమరుగవుతాయి. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు హరించుకు పోతాయి. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే లేబర్ కోడ్లను అమల్లోకి తెస్తున్నారు. 12 గంటల పనిని చట్టబద్ధం చేస్తున్నారు. సామాజిక భద్రతా పథకాలకు నిధులు తగ్గిస్తున్నారు. ఈ దేశంలో సంపదను సృష్టించే కార్మిక వర్గ ప్రయోజనాలను కాదని కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్పొరేట్లకు, పెట్టుబడి దారులకు వత్తాసు పలుకుతోంది. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను చరిత్రలో నిలిచి పోయేలా చేపట్టాలి. సింగరేణి, ఎన్టీపీసీ నుంచి మొదలుకుని కింది స్థాయి వరకు సంఘటిత, అసంఘటిత రంగంలోని కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి. కార్మిక సంఘాలు ఐక్యంగా సమ్మెను విజయవంతం చేయాలి" అని సాయిబాబు పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ. యూసఫ్ మాట్లాడుతూ లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న 1936 ట్రేడ్‌యూనియన్ చట్టం, 1936 వేతన చట్టం, 1946 ఇండస్ట్రీయల్ చట్టం మొదలగు అనేక చట్టాలు కనుమరుగై పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలు పెంచాలని ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి లాంటి వారు మాట్లాడటం కార్మికులకు ద్రోహం చేయడమేనని ...13లో



మాట్లాడుతున్న సాయిబాబా



దేశం కోసం పోరాడిన నేతలపై

బీజేపీ..ఆర్ఎస్ఎస్ కుట్ర

సంఘ్ సిద్ధాంతాలు పటేల్ భావజాలానికి వ్యతిరేకం : కాంగ్రెస్ చీఫ్ ఖర్గే

అహ్మదాబాద్: బీజేపీ- ఆర్ఎస్ఎస్‌లపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. దేశం కోసం పోరాడిన జాతీయ నాయకులపై కుట్ర పన్నుతున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు సర్దార్ వల్లభాయ్ పటేల్ భావజాలానికి వ్యతిరేకమంటూ విమర్శించారు. మంగళవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"సర్దార్ వల్లభాయ్ పటేల్ భావజాలానికి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు వ్యతిరేకంగా ఉన్నాయి. స్వాతంత్ర్య సమరంలో ఏ మాత్రం పాలు పంచుకోని వాళ్లు.. ఇప్పుడు పటేల్ వారసులంటూ ...13లో

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అమాంతం పడిపోయాయి. గతేడాది 2024 నుంచి తగ్గుముఖం పట్టిన చమురు ధరలు ఇటీవల మరింత దిగివచ్చాయి. 2025 ప్రారంభంలో బ్యారెల్ 70 డాలర్ల దిగువకు పడిపోయింది. తాజాగా వాణిజ్య యుద్ధం ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో సోమవారం బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారల్ ధర 64 డాలర్లకు క్షీణించింది. అటు టెక్సాస్ క్రూడ్ ధర 60 డాలర్లకు దిగొచ్చింది. ఇది నాలుగేండ్ల కనిష్ట స్థాయి కావడం విశేషం. వాణిజ్య యుద్ధం ఇతర పరిణామాలతో రష్యా ఉరల్స్ ఆయిల్ ధర ఏకంగా 50 డాలర్లకు క్షీణించింది.


భారీగా తగ్గిన చమురు ధరలు

నాలుగేండ్ల కనిష్టానికి పతనం ● అయినా తగ్గని పెట్రోల్, డీజిల్ ధరలు

సుంకాలు పెంచిన కేంద్రం



ముంబయి : డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధం ఒత్తిడి, అమెరికాలో పెరుగుతున్న మాంద్యం భయాలు, ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ లేక పోవడం ఇవన్నీ చమురు ధరలు పడిపోవడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒపెక్ దేశాలు ఉత్పత్తి అంచనాలకు కోత పెట్టాయి. ఇది బలహీనమైన ప్రపంచ వినియోగాన్ని ప్రతిబిం బిస్తుంది. మరోవైపు చైనా వంటి మార్కెట్లలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెరగడం క్రూడ్ ధరలు మరింత తగ్గేలా చేశాయి. వారంలో రెండుసార్లు చమురు ధరల అంచనాలను తగ్గించిన బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ మంగళవారం మరింత కోత పెట్టింది. బ్యారెల్ ధర 40 డాలర్లకు పడిపోయినా ఆశ్చర్య పోవాల్సిందేమీ లేదని విశ్లేషించింది.



20 శాతం తగ్గినా..

2024 నుంచి ముడి చమురు ధరలు 20 శాతానికి పైగా పడిపోయినప్పటికీ ఇంధన ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు రాలేదు. ముడి చమురు అవసరాల్లో 87శాతానికి పైగా దిగుమతి చేసుకుంటున్న భారత్.. గ్లోబల్ చమురు ధరల్లో తగ్గుదలకు అనుగుణంగా ఇంధన ధరలను సైతం తగ్గించాలి. కానీ అందుకు భిన్నంగా ఎక్సైజ్ సుంకాన్ని పెంచడం గమనార్హం. భారత్‌లో పెట్రోల్, డీజిల్‌పై బేస్ ధర, ఎక్సైజ్ సుంకం, విలువ ఆధారిత పన్ను (వ్యాట్), డీలర్ కమిషన్లను కలుపుకుని ఇంధన ధరలను నిర్ణయిస్తారు. ఇంధనం రిటైల్ ధరలో పన్నులే సుమారు 50-60 శాతం వాటాను కలిగి ఉండటంతో ప్రజలను ఎలా ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నారో స్పష్టం అవుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.107.66గా, డీజిల్ ధర రూ.95.82గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ అధిక పన్నులతో వినియోగదారులకు పెద్దగా ఫలితం లేకుండా పోతుందని స్పష్టం అవుతోంది.

ఖజానాపైనే కేంద్రం దృష్టి


గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలు అమాంతం తగ్గుతుంటే దేశీయంగా మోడీ సర్కార్ ఎప్పటిలాగే తన ఖజానాను నింపుకునే పనిలో ఉంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైస్ సుంకాన్ని లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ సోమవారం నిర్ణయం తీసుకుంది. ఈ మొత్తాన్ని ఇంధన కంపెనీలు భరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తాజా పెంపు తర్వాత లీటర్ పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై రూ.10 ఎక్సైస్ సుంకం అమల్లోకి రానుంది. 2014 నుంచి 2016 మధ్య మోడీ సర్కార్ ఇంధనాలపై 9 సార్లు ఎక్సైస్ సుంకాన్ని పెంచింది. దీంతో ఆ సమయంలో కేంద్రానికి రూ.99,000 కోట్ల ఆదాయం సమకూరింది. అంటే ఆ మొత్తం ప్రజలపై భారం పడింది. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినప్పుడల్లా ఆ ప్రతిఫలాలను ప్రజలకు అందకుండా బిజెపి సర్కార్ ఎక్సైస్ సుంకాన్ని బాదుతోందనే విమర్శలు ఉన్నాయి.

10 నుంచి రిజిస్ట్రేషన్లకు

స్లాట్ బుకింగ్

ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు

చట్టసవరణతో డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్: రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఈ నెల 10 నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకురాబోతున్నామని రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్టు తెలిపారు. మిగతా 122సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దశలవారీగా అమలు చేయనున్నట్టు తెలిపారు. స్లాట్ బుకింగ్ ...5లో

బార్ అండ్ రెస్టారెంట్లు నిబంధనలు పాటించాలి

వాటికీ లైసెన్స్ జారీ చేయాలి

తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రామచంద్రారెడ్డి



నవతెలంగాణ-బంజారాహిల్స్

బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులు నిబంధనలు పాటిస్తూ వ్యాపారం చేసుకోవాలని తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రామచంద్రారెడ్డి అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. బార్ అండ్ రెస్టారెంట్ వారు బార్లు ప్రారంభించగానే రెస్టారెంట్‌ను మూసేసి.. 90, 180, 360, ఎంఎల్ పద్ధతి మానేసి పార్సిల్ ఇవ్వడం ప్రభుత్వ అనుమతులకు పూర్తి విరుద్ధమన్నారు. బాటిల్ ఓపెన్ చేసి తినడానికి కావలసిన ఆహార పదార్థాలు ఇచ్చి బార్ అండ్ రెస్టారెంట్‌లోనే సౌకర్యాలందించాల్సింది పోయి ఫుల్ బాటిళ్లు పార్సిల్ ఇవ్వడం వల్ల వైన్ షాపుల యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి బార్ అండ్ రెస్టారెంట్లకు కూడా లైసెన్స్ జారీ చేయాలని, అప్పుడే తాము పడుతున్న కష్టాలేమిటో వారికి తెలియవస్తాయన్నారు. ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 20,620 వైన్ షాపులుండగా, 1386 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయని తెలిపారు. తమ వ్యాపారం వల్ల ప్రభుత్వానికి 87 శాతం రెవెన్యూ సమకూర్చగా, బార్ అండ్ రెస్టారెంట్ల రెవెన్యూ 15 నుంచి 13 శాతమేనని స్పష్టం చేశారు. తాము పర్మిట్ రూములకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సుమారు రూ.5 లక్షల వరకు చెల్లిస్తున్నామని, లైసెన్స్ కోసం రూ.రెండు లక్షలు చెల్లిస్తున్నామని అన్నారు. బార్ అండ్ రెస్టారెంట్లకు కూడా అదే నిబంధన పెట్టాలని, అప్పుడే తమ కష్టాలు వారికి తెలియవస్తాయని అన్నారు. తమకున్న నిబంధనలే వారికి అమలు చేయాలని కోరారు. ఈ విషయంపై ప్రభుత్వాన్ని ఆబ్కారి శాఖను కోరడంతో పాటు త్వరలోనే ముఖ్య అధికారులను, మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఇప్పటికైనా బార్ అండ్ రెస్టారెంట్ల వారు నీతి నిజాయితీగా వ్యాపారాలు చేసుకోవాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, విక్రం, ప్రభాకర్, సుభాష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కొత్త మద్యం బ్రాండ్లకు 604 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 604 కొత్త మద్యం బ్రాండ్ల అమ్మకాల అనుమతి కోసం 92 మద్యం సరఫరా కంపెనీలు దరఖాస్తులు చేసుకున్నాయని ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్. హరికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 23న దేశీ, విదేశీ మద్యం బ్రాండ్ల కోసం టీజీబీసీఎల్ దరఖాస్తులను ఆహ్వానించిందని తెలిపారు. ఏప్రిల్ 2న దరఖాస్తు గడువు ముగిసే సమయానికి 45 పాత కంపెనీలు 218 కొత్త రకాల మద్యం బ్రాండ్ల కోసం, 47 కొత్త కంపెనీలు 386 మద్యం బ్రాండ్లను తీసుక రావడానికి దరఖాస్తు చేసుకున్నాయని వివరించారు. దరఖాస్తుల పరిశీలిన అనంతరం కొత్త బ్రాండ్లకు ప్రభుత్వ ఆమోదం మేరకు అనుమతి ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

భూ భారతి చట్టం..రెవెన్యూకు కొత్త ఊపిరి

- ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం : తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నూతనంగా అమల్లోకి రానున్న భూ భారతి చట్టం రెవెన్యూ వ్యవస్థకు కొత్త ఊపిరి పోయనుందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రామకృష్ణ అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చట్టంతో తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణమవుతుందని అభిప్రాయపడ్డారు. భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరగడంతో పాటు రెవెన్యూ సేవలు, పౌర సేవలు సులభతరమవుతాయని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కావడంతో రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుం దని దీమా వ్యక్తం చేశారు. సర్కార్ గొప్ప లక్ష్యంతో చేపట్టిన ఈ చట్టం అమలుకు రెవెన్యూ ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం కోశాధికారి వెంకట్ రెడ్డి, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, అసోసియేట్ అధ్యక్షులు చల్ల. శ్రీనివాస్, టీజీజీఏ సెక్రటరీ జనరల్ సెక్రటరీ పూల్ సింగ్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష, కార్య దర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దర్శనం గౌడ్, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షురాలు పి. రాధ, వీఆర్ఓల సంక్షేమ సంఘం అధ్యక్షులు గరిక ఉపేంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే మనుగడ

- దళిత స్త్రీ శక్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజల్ని రక్షించాల్సిన రాజ్యాంగానికి ప్రమాదమేర్పడిందనీ, దాన్ని రక్షించుకుంటేనే మనకు మనుగడ ఉంటదని ఐఎఫ్ఎస్ అధికారి బీఎం వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో 'రాజ్యాంగ పరిరక్షణ-భవిష్యత్ ప్రణాళిక' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకి డీఎస్ఎస్ జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అధ్యక్షత వహించగా ఐఎఫ్ఎస్ అధికారి బీఎం వినోద్ కుమార్, ప్రొఫెసర్ వసుందరాదేవి, ప్రొఫెసర్ రజిత, డాక్టర్ సాధన, ఎస్సీ,ఎస్టీ అసోసియేట్ కార్యదర్శి శంకర్, ఎంపీఎఫ్ బాధ్యులు వెంకటరెడ్డి, సత్యవతి, ప్రకాశ్, కృష్ణ కుమారి మాట్లాడారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడు కోవటానికి మేధావులు,హక్కుల సంఘాలు, ప్రజలకు అవగాహన కల్పిం చాలని సూచించారు. ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా నడుకుని, ఎవరి వాటా వారికి అందేలా చూడాలన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరారు.

మెడికల్ కాలేజీల్లో డెంటల్ డిపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయాలి

ఆ విభాగాల్లో బోధనా సిబ్బందిని నియమించాలి

డీఎంఈకి ఆల్ ఇండియా డెంటల్ స్టూడెంట్స్, సర్జన్స్ అసోసియేషన్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్ని మెడికల్ కాలేజీల్లో డెంటల్ యూనిట్లను ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన బోధనా సిబ్బందిని నియమించాలని ఆల్ ఇండియా డెంటల్ స్టూడెంట్స్, సర్జన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మహమ్మద్ మంజూర్ అహ్మద్ నేతృత్వంలో మంగళవారం రాష్ట్ర వైద్యవిద్య సంచాలకునికి వినతిపత్రం అందజేశారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాల మేరకు ఈ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. బ్యాచ్‌కు 100 ఎంబీబీఎస్ సీట్లు కలిగిన ప్రతి మెడికల్ కాలేజీలో ఆ మార్గదర్శకాల మేరకు తప్పనిసరిగా ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక జూనియర్ రెసిడెంట్, నలుగురు డెంటల్ టెక్నీషియన్లు ఉండాలని తెలిపారు. బ్యాచ్ కు 250 ఎంబీబీఎస్ సీట్లు కలిగిన మెడికల్ కాలేజీలో అదే నిష్పత్తిలో బోధనా సిబ్బంది సంఖ్య పెంచాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో 38 ప్రభుత్వ మెడికల్ కాలేజీలున్నాయనీ, వాటన్నింటిలో గెజిట్ అయిన ఎన్ఎంసీ మార్గదర్శకాల మేరకు డెంటల్ యూనిట్ల పనిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం జాతీయ ప్రమాణాలను అందుకునేందుకే కాకుండా విద్యార్థులు అన్ని రకాల ఆరోగ్య సంరక్షణ విద్యపై అవగాహన పెంచుకునేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. దీంతో భవిష్యత్తులో డాక్టర్లు నోటి అనారోగ్య సమస్యలను గుర్తించి వెంటనే సిఫారసు చేసేందుకు కూడా ఉపయోగపడుతుందని వివరించారు. ఈ యూనిట్ల ఏర్పాటుతో స్థానిక ప్రజలకు నోటి ఆరోగ్య సంరక్షణ సేవలు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇలాంటి సేవలు అందుబాటులోకి రావడం ద్వారా అందరికి సమాన ఆరోగ్యసేవల లక్ష్యం దిశగా అడుగులు పడతాయని చెప్పారు.

పీఎన్‌బీ జోనల్ మేనేజర్‌గా సునీల్ కుమార్



నవ తెలంగాణ - హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) హైదరాబాద్ జోన్ జోనల్ మేనేజర్‌గా సునీల్ కుమార్ చుగ్ బాధ్యతలను స్వీకరించారు. చార్టర్డ్ ఎకౌంటెంట్ అర్హత కలిగిన చుగ్ బ్యాంకింగ్ రంగంలో మూడు దశాబ్దాలు పైగా విశేష అనుభవం కలిగి ఉన్నారు. వివిధ ప్రాంతాల్లోని పీఎన్‌బీ కార్పొరేట్ శాఖలను నిర్వహించారు. చుగ్ నాయకత్వంలో హైదరాబాద్ జోన్ మరింత మెరుగైన ప్రగతిని కనబర్చనుందని ఆ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేశాయి.

ఆ మూడు రాష్ట్రాలకు శిక్ష?

అందని సమగ్ర శిక్షా స్కీం నిధులు | కేరళ, తమిళనాడు, బెంగాల్‌లకు అన్యాయం

- **2024-25 ఏడాదికి ఫండ్స్ కేటాయించినా.. విడుదల కాని వైనం : కేంద్రం వెల్లడి**

కేంద్ర ప్రాయోజిత సమగ్ర శిక్షా పథకం.. దేశవ్యాప్తంగా అమలవుతున్న తీరు, పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయించే నిధులు, అవి విడుదలవుతున్న విధానం ఆందోళన కలిగిస్తున్నది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 సిఫారసులకు అనుగుణంగా ఉన్న ఈ పథకం కింద కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు కేంద్రం ఇప్పటికే నిధుల కేటాయింపులు జరిపినా.. అవి విడుదల కాలేదు. బీజేపీ పాలిత యూపీకి మాత్రం అత్యధిక మొత్తంలో నిధుల కేటాయింపులు, వాటి విడుదల సైతం జరిగాయి. రాజ్యసభలో కేంద్రం వెల్లడించిన సమాచారమే దీనిని తెలియజేస్తున్నది.





ఏమిటీ ఈ పథకం?

సమగ్ర శిక్ష పథకం 2018లో అమలైంది. ప్రాథమిక, మాధ్యమిక పాఠశాల విద్యకు కేంద్రం మద్దతు అందించే ఒక కార్యక్రమం ఇది. పాఠశాల విద్యలో సమానమైన నాణ్యతను నిర్ధారించటం, విద్యకు సమాన అవకాశాలు కల్పించటం, ప్రాథమిక అక్షరాస్యతను, లింగ సమానత్వాన్ని, సమ్మిళిత విద్యను సాధించటం వంటివి దీని లక్ష్యాలు. అయితే, ఈ పథకం కింద దేశంలోని అన్ని రాష్ట్రాలకు నిధులు అందే విషయంలో అన్యాయం జరుగుతున్నదనే వాదనలు వినబడుతున్నాయి.

'పీఎంశ్రీ'తో కేంద్రం మెలిక

సమగ్ర శిక్ష పథకం కింద కేటాయించిన నిధులు తమకు అందలేదని తమిళనాడు ప్రభుత్వం చాలా నెలలుగా ఫిర్యాదు చేస్తోంది. దీంతో నిధుల కొరత కారణంగా రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు జీతాలు అందించటంలో జాప్యం జరుగుతోంది. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు కేంద్ర ప్రాయోజిత పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకాన్ని పాటించటానికి నిరాకరించిన నేపథ్యంలో వాటికి సమగ్ర శిక్ష స్కీం నిధులు నిలిపివేయబడటం గమనార్హం.

కేటాయింపులు జరిగినా.. విడుదలకు బ్రేక్

విద్యా శాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ పథకం కింద ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నుంచి కేరళకు కేవలం రూ. 328.90 కోట్లు, తమిళనాడుకు రూ.2,151.60 కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు రూ.1,745.80 కోట్లు కేటాయించారు. అయితే, మార్చి 27 నాటికి ఈ రాష్ట్రాలకు ఎలాంటి నిధులూ విడుదల కాకపోవటం గమనార్హం. సమగ్ర శిక్ష పథకం కింద రాష్ట్రాలకు ఇంకా విడుదల చేయాల్సిన నిధులపై సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ సమాధానాన్నిచ్చారు.

న్యూఢిల్లీ : కేంద్ర ప్రాయోజిత పథకం సమగ్ర శిక్ష స్కీం కింద అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయిస్తున్న నిధులు, అవి అందుతున్న తీరు అన్యాయంగా ఉంటున్నది. కేంద్రంలోని మోడీ సర్కారు తీరుపై దేశవ్యాప్తంగా విద్యావేత్తలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2024-25 ఏడాదికి గానూ ఈ పథకం కింద కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు కేంద్రం నుంచి ఎలాంటి నిధులూ పొందలేదు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ రాజ్యసభకు ఈ విషయాన్ని వెల్లడించింది.

యూపీకి అత్యధికంగా రూ.6971 కోట్లకు పైనే..

ఈ పథకం కింద యూపీకి అత్యధికంగా రూ.6,971.26 కోట్లు కేటాయించారు. ఈ రాష్ట్రానికి ఇప్పటికే రూ.4,487.46 కోట్లు అందాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్రం 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)లకు రూ.45,830.21 కోట్లు కేటాయించింది. ఇందులో మార్చి 27 నాటికి కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ మినహా అన్నింటికీ రూ.27,833 కోట్లు విడుదలయ్యాయి. కేంద్ర, రాష్ట్ర, ప్రాంతీయ సంస్థల ద్వారా నిర్వహించబడే పాఠశాలల మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయటం ఈ పథకం లక్ష్యం. అయితే, ఈ పథకం ప్రయోజనాలు పొందాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా జాతీయ విద్యా విధానం, 2020 (ఎన్ఈపీ, 2020)ను అమలు చేయటానికి కేంద్రంతో అవగాహన ఒప్పందంపై సంతకం చేయాలి. ఎన్ఈపీ అమలు ఇప్పటికే దేశంలో తీవ్ర వివా దానికి దారి తీసింది. పలు తమిళనాడు వంటి రాష్ట్రాలు ఇప్పటికే దీనిని తీవ్రంగా వ్యతిరేకిం చాయి. కేంద్రంలోని మోడీ సర్కారు మాత్రం ఎన్ఈపీపై ఎంతకూ వెనక్కి తగ్గటం లేదు. ఇందులో భాగంగానే 'పీఎం శ్రీ'తో రాష్ట్రాలలో ఎన్ఈపీని అమలుకు వ్యూహాన్ని రచించిందని మేధావుల, విద్యావేత్తలు అంటు న్నారు. మోడీ సర్కారు తీరును తప్పుబడుతున్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా కేటాయింపులు జరిపిన రాష్ట్రాలకు నిధుల విడుదలను తక్షణమే చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ఆపరేషన్ కగార్‌ను ఎత్తేయాలి

ఆదివాసులను రక్షించాలి | **మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు ప్రారంభించాలి**
రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు, మేధావులు

నవతెలంగాణ - ముషీరాబాద్

ఆపరేషన్ కగార్‌ను ఎత్తేయాలని, ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆదివాసీ జాతి హననాన్ని వెంటనే ఆపాలని ప్రజాసంఘాలు, హక్కుల సంఘాల నాయకులు, మేధావులు కేంద్రాన్ని కోరారు. గిరిజనుల జీవించే హక్కును పరిరక్షించాలని, మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇంది రాపార్కు వద్ద ధర్నాచౌక్‌లో మంగళవారం సీపీఐ(ఎం)ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. దీనికి రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు, మేధావులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఆదివాసీలపై హత్యాకాండను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలని కోరారు.

సమాజ మనుగడలో, అభివృద్ధిలో, వికాసంలో ఆదివాసుల పాత్ర ప్రధానమైనదిగా కేంద్ర, రాష్ట్ర పాలకులు ఇప్పటికైనా గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను అణచివేయాలని చూస్తే ప్రజాసంఘాలు చూస్తూ ఊరుకోబోవన్నారు.

ప్రొఫెసర్ రమా మేల్కొటే మాట్లాడుతూ.. మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత జేవీ చలపతిరావు మాట్లాడుతూ.. మావోయిస్టులను అభివృద్ధి నిరోధకులుగా చూడటం, మాట్లాడటం సరికాదన్నారు. భూమి, ప్రజాస్వామ్యం, సమానత్వం కోసమే మావోయిస్టులు దశాబ్దాల తరబడి పోరాడుతున్న వాస్తవాన్ని గుర్తించాలన్నారు. నిజానికి పాలకవర్గ పార్టీలే హింసాకాండను తలపెడుతున్నాయన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు సాదినేని వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, అరుణోదయ నాయకులు విమలక్క, ఆప్ కన్వీనర్ డా.సుధాకర్, ప్రొ. కాశిం, సీపీఐ నాయకులు పశ్య పద్మ, సీపీఐ(ఎం-ఎల్) మాస్ లైన్ నాయకులు కె.రామా, ఎంసీపీఐ(యూ) నాయకులు మట్టయ్య, లిబిరేషన్ నాయకులు రమేష్ రాజా, రెడ్ ఫ్లాగ్ నాయకులు రాజేష్, ప్రొ.గడ్డం లక్ష్మణ్, ప్రొ.వినాయక రెడ్డి, కన్నగంటి రవి, రాఘవాచారి, రవిచంద్ర, డా.కృష్ణ ప్రసాద్, విరసం నాయకులు రాంకీ తదితరులు పాల్గొన్నారు.

ఇది మన సంస్కృతి కాదు, ఏబీవీపీ!



ఏమీ లేని చోట వివాదం లేవదీయడం ఒక కళ. ఈ కళలో ఆర్ఎస్ఎస్/ బీజేపీని మించిన వారు లేరు. ఆర్ఎస్ఎస్ విద్యార్థి సంఘం ఏబీవీపీ ఈ విషయంలో మాత సంస్థను మించిపోవాలని ఉవ్విళ్ళూరుతున్నది. అందుకనే కాబోలు, ఆర్ఎస్ఎస్ శాఖలో నేర్చింది, నేర్చుకున్నది తీసి గట్టును పెట్టింది. చదువులు చెప్పే గురువు మీదే ధ్వజమెత్తింది. గురువు చెప్పింది వినడం కాదు, మేము చెప్పేది గురువే వినాలి అనే తత్వం తలకెక్కించుకుంది.

ఇప్పుడు పరీక్షల సీజన్. ఉత్తరప్రదేశ్‌లోని చౌదరి చరణ్ సింగ్ యూనివర్సిటీ కూడా పరీక్షలు నిర్వహిస్తున్నది. ఏప్రిల్ 2వ తారీకు జరిగిన ఎంఏ పొలిటికల్ సైన్స్ ఫైనల్ ఇయర్‌లో 'రాష్ట్ర రాజకీయాలు' పై ఒక ప్రశ్నాపత్రం ఉంది. ఆ ప్రశ్నా పత్రాన్ని మీరట్ యూనివర్సిటీ రాజకీయ శాస్త్ర విభాగం అధిపతియైన సీమా పవార్ రూపొందించారు. అందులోని రెండు ప్రశ్నలు ఏబీవీపీకి తీవ్ర ఆగ్రహం తెప్పించాయి. ఆ రెండు ప్రశ్నలు ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు. బహుశా ఒక్కొక్క మార్కు ఉన్న ప్రశ్నలు. ఆ ప్రశ్నలు చూసి, ఎం.ఏ స్థాయి ప్రశ్నలా అని నవ్వుకోకండి. ఒకటి, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్న. సొసైటీ నుంచి ఒంటరిపాటైన (ఖశ్రీఱవఅఖవం) గ్రూప్ ఏది? 1. దల్ ఖల్సా 2. నక్సలైట్ గ్రూపులు 3. జమ్మూ అండ్ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ 4. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్. ఈ ప్రశ్నల్లో ఆర్ఎస్ఎస్‌ను మిగతా వాటితో కలిపి చెప్పటం ఏబీవీపీ కోపానికి కారణమైంది. కోపం తెప్పించిన రెండో ప్రశ్న ఈ క్రింది వాటిని జతపరచములో ఉంది.

1.దళిత రాజకీయాలు, 2. ప్రాంతీయ గుర్తింపు రాజకీ యాలు, 3. ఓబీసీ రాజకీయాలు, 4 కుల మత గుర్తింపు రాజకీయాలు. జతపర్చాల్సినవి. ఖ) మండల్ కమిషన్, ఎ) ఆర్ఎస్ఎస్, ఎ) బీఎస్‌పీ. ఎ) శివసేన. చాలా తేలిక ప్రశ్న. తేలికగా జతపరచవచ్చు. ఆర్ఎస్ఎస్ ఒక రాజకీయేతర సాంస్కృతిక సంస్థ అని చెప్పుకుంటుంటే, ఇక్కడ కులమత రాజకీయాలతో తప్పనిసరిగా జతపర్చాల్సి వచ్చింది.

ఈ ప్రశ్నలకి సమాధానం రాయటం 'ఎంటైర్ పొలిటిక్స్' చదివే వారికి కష్టమేమో గాని, మిగతా వారికి కాదు. కానీ, ఏబీవీపీ తమ మాత సంస్థ ఆర్ఎస్ఎస్ ని ఎగతాళి చేసినట్టుగా, విమర్శించినట్టుగా భావించింది.

వెంటనే ఆందోళనకు దిగింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు మెమోరాండం ఇచ్చి, ఆ ప్రశ్నాపత్రాన్ని తయారు చేసిన ప్రొఫెసర్‌పై చర్య తీసుకోవాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించింది. ఈ ప్రశ్నాపత్రం రూపొందించిన ప్రొఫెసర్ 'యాంటీ నేషనల్' అని ఆరోపించింది. ఆరోపణ చేసింది ఏబీవీపీ కనుక ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఆ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కూడా ఈ ప్రశ్నలు 'అభ్యంతరకరమైనవి', 'వివాదాస్పదమైనవి' గా కనపడ్డాయి. ఆ ప్రశ్నాపత్రం రూపొందించిన సీమా పవార్‌కి శిక్ష పడ్డది. ఆ ప్రొఫెసర్ జీవితకాలంలో ప్రశ్నాపత్రాలు తయారు చేయడం నుంచి నిషేధించింది యూనివర్సిటీ.

సీమా పవార్, తాను ఉద్దేశపూర్వకంగా ఆ ప్రశ్నలు తయారు చేయలేదని, దానికి సంబంధించిన అధ్యాయం పాఠ్యాంశాల్లో ఉందని చెప్పింది. ఆపై క్షమాపణలు కూడా అడిగింది. నిజానికి సీమా పవార్ న్యాయం కోసం కోర్టుకు వెళితే, యూనివర్సిటీ వాదన నిలబడుతుందా? నెత్తిన అక్షింతలు పడవా?

ఇటువంటి సమస్య రాకుండా ఉండాలంటే రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి, ప్రశ్నాపత్రాన్ని ఏబీవీపీ చేతనే తయారు చేయించడం. రెండోది, తయారైన ప్రశ్నాపత్రాన్ని ముందుగా ఏబీవీపీకి చూపించి అనుమతి తీసుకోవడం. బహుశా ముందు రోజుల్లో ఈ యూనివర్సిటీ ఈ రెండిట్లో ఏదో మార్గాన్ని అనుసరిస్తుందేమో చూడాలి.

సనాతన ధర్మాన్ని, భారతీయ సంస్కృతిని నెత్తిన పెట్టుకుని ఊరేగుతుంది ఏబీవీపీ. సనాతన ధర్మంలో, సంస్కృతిలో - ఆ మాటకొస్తే ఏ సంస్కృతిలోనైనా గురు శిష్య సంబంధం గొప్పది, పవిత్రమైంది. గురు పూర్ణిమ నాడు పూజలు చేసే ఏబీవీపీ నేర్చుకున్నది ఇదేనా? సంఘ్ జండా ధ్వజాన్ని గురువుగా భావించి, ఆర్ఎస్ఎస్ సభ్యులు ఆ ధ్వజానికి వందనం చేస్తారు. గోల్వాల్కర్ ని గురూజీ అని పిలుచుకుంటారు. అవన్నీ గడపకి అవతలే, గడప ఇవతల మా సంస్కృతే వేరప్పా అంటే ఎట్లా, శిష్యా?


\- కర్లపాలెం

మరో స్కాలర్‌షిప్ పథకానికి మంగళం

- 'స్టడీ ఇన్ ఇండియా'కు స్వస్తి చెప్పిన కేంద్రం
- ప్రతిభావంతులైన విదేశీ విద్యార్థులకు మొండిచేయి

న్యూఢిల్లీ : విదేశీ విద్యార్థులకు అందిస్తున్న ఉపకార వేతనాల పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. 'స్టడీ ఇన్ ఇండియా' (ఎస్ఐఐ) పేరుతో విద్యా శాఖ 2018లో ఈ పథకాన్ని ప్రారంభించింది. దీని కింద దేశంలో పేరొందిన పది ప్రముఖ సంస్థలలో ఉన్నత విద్యను అభ్యసించాలని అనుకునే విదేశీ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే దేశంలోని విద్యార్థుల కోసం ఉద్దేశించిన ఇలాంటి అనేక పథకాలను ఇప్పటికే అటకెక్కించిన మోడీ ప్రభుత్వం తాజాగా ఎస్ఐఐకి కూడా మంగళం పాడింది. 2020-21 విద్యా సంవత్సరం నుండి మొదలైన ఈ పథకం కింద పరీక్ష నిర్వహించి అర్హులైన విద్యార్థులను ఎంపిక చేశారు. వీరు 2022-23 వరకూ ప్రభుత్వం నుండి ఉపకార వేతనాలు పొందారు. 2023-24లో కొత్తగా విద్యార్థులెవ్వరికీ స్కాలర్‌షిప్పులు ఇవ్వలేదు. 2022-23లో ప్రయోజనం పొందిన వారికి ఈ ఏడాది మార్చి వరకూ ఉపకార వేతనాలు అందాయి.

విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే ప్రభుత్వ రంగ సంస్థ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ఇండియా (ఎడ్‌సిల్) డేటా ప్రకారం ఎస్ఐఐ పథకం కింద 2020-21లో 1,207 మంది, 2021-22లో 1,365 మంది స్కాలర్‌షిప్పులు పొందారు. అయితే 2022-23లో వారి సంఖ్య 1,048కి పడిపోయింది. విద్యా మంత్రిత్వ శాఖ తరపున ఈ పథకాన్ని ఎడ్‌సిల్ అమలు చేస్తోంది. ఎస్ఐఐ పథకం కింద ఎంపిక చేసిన వందకు పైగా విద్యా సంస్థలు విదేశీ విద్యార్థుల కోసం అదనపు సీట్లు సృష్టించాయి. స్కాలర్‌షిప్పులు కోరే వారి కోసం 2020లో ఇండియన్ స్కాలస్టిక్ అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహించారు. నేపాల్, ఇథియోపియా, బంగ్లాదేశ్, భూటాన్, ఉగాండా, టాంజానియా, రువాండా, శ్రీలంక, కెన్యా, జాంబియా, ఇండోనేషియా, మారిషస్ దేశాలకు చెందిన ఐదు వేల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. 2021లో ఈ పరీక్షకు 'ప్రగతి' అని పేరు పెట్టారు. 42 దేశాలకు చెందిన విద్యార్థులు పరీక్ష రాశారు. 2022లో 83 దేశాల నుండి విద్యార్థులు వచ్చి పరీక్షకు హాజరయ్యారు.



స్కాలర్‌షిప్పులకు ప్రాచుర్యం లభిస్తూ విదేశీ విద్యార్థులను ఆకర్షిస్తున్న సమయంలో ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసిందని ఎడ్‌సిల్‌కు చెందిన మాజీ అధికారి ఒకరు చెప్పారు.

'విద్యార్థులను ఈ పథకం బాగా ఆకర్షించింది. ఇప్పుడు దీనిని నిలిపివేయడంతో విదేశీ విద్యార్థులు మన సంస్థలలో చదువుకునేందుకు పెద్దగా రాకపోవచ్చు' అని ఆయన అన్నారు. ఎస్ఐఐ స్కాలర్‌షిప్పుల కోసం అవసరమైన నిధులను వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన ఛాంపియన్ సర్వీస్ సెక్టార్ స్కీమ్ ద్వారా అందజేస్తున్నారు. 2022-23 నుండి అవి నిలిచిపోయాయి.

ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం అనేక ఉపకార వేతన పథకాలను ఆపేసింది. పాఠశాల విద్యార్థులకు ఉద్దేశించిన నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్, మైనారిటీ విద్యార్థులు పరిశోధనలు చేయడానికి ఉపకరించే మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్, నేషనల్ స్కీమ్ ఆఫ్ ఇన్‌సెంటివ్ టూ గరల్స్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్, కిషోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన వంటి పథకాలకు కేంద్రం రెడ్ సిగ్నల్ వేసింది.

సిలిండర్ల ధరల పెంపు తగదు

ఖండించిన సీపీఐ(ఎం)
నిరసనలు చేపట్టాలిందిగా పిలుపు

న్యూఢిల్లీ : వంట గ్యాస్ సిలిండర్ల ధరలను అమాంతం రూ.50 పెంచడాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. అలాగే పెట్రోల్, డీజిల్‌లపై ప్రత్యేక ఎక్సైజ్ సుంకాన్ని విధించడాన్ని కూడా నిరసించింది. సాధారణ, సబ్సిడీయేతర కేటగిరీలకు చెందిన రెండు రకాల సిలిండర్ల ధరను రూ.50 చొప్పున పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ప్రజలపై దాదాపు రూ.7వేల కోట్ల భారం పడుతోంది. పైగా, పెట్రోల్, డీజిల్‌లపై రూ.32వేల కోట్లు మేరకు ప్రత్యేక ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. ద్రవ్యోల్బణం కారణంగా ఇప్పటికే ప్రజల జీవితాలు భారంగా మారాయని, తాజాగా గ్యాస్ ధరల పెంపుతో ఇంకా తీవ్రమైన ప్రభావం పడనుందని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు తగ్గిన నేపథ్యంలో ఆ ప్రయోజనాలను ప్రజలకు అందించడానికి బదులుగా ప్రభుత్వం అదనంగా భారాలు మోపుతోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. సమాఖ్య సూత్రాలను ఉల్లంఘించి, ప్రత్యేక ఎక్సైజ్ సుంకం పేరుతో అన్ని రకాల ఆదాయాలను తానే సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని పేర్కొంది. ప్రభుత్వం తక్షణమే ఈ ధరలను ఉపసంహరించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాల్సిందిగా పార్టీ శాఖలన్నింటికీ పిలుపునిచ్చింది.

ప్రజాస్వామ్యానికి దక్కిన విజయం

సుప్రీం తీర్పుని స్వాగతించిన కేరళ సీఎం పినరయి విజయన్



కొచ్చి: తమిళనాడు గవర్నర్ చర్యని ఎండగడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని కేరళ సీఎం పినరయి విజయన్ మంగళవారం స్వాగతించారు. తమిళనాడు గవర్నర్ బిల్లులను నిరవధిక నిలిపివేయడంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సమాఖ్య వ్యవస్థను, అసెంబ్లీ ప్రజాస్వామ్య హక్కులను సమర్థించిందని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రిమండలి సూచనల ప్రకారమే గవర్నర్ వ్యవహరిం చాలని అత్యున్నత న్యాయ స్థానం ఇప్పటికే పలుసార్లు స్పష్టం చేసిందని, ఈనాడు ఇచ్చిన ఈ తీర్పు బిల్లులను ఆమోదిం చడానికి నిర్దిష్ట కాలపరిమితులను కూడా నిర్దేశించిందని అన్నారు. అసెంబ్లీ హక్కు లను హరించే గవర్నర్ల వైఖరికి ఈ తీర్పు ఒక హెచ్చరికవంటిదని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి దక్కిన విజయంగా విజయన్ వ్యాఖ్యానించారు. బిల్లులను తమిళనాడు కేబినెట్ ఆమోదించినప్పటికీ గవర్నర్ ఆమోద ముద్ర వేయకుండా తొక్కిపట్టి వుంచడంతో రాష్ట్రంలో గత 23 నెలలుగా అనిశ్చిత పరిస్థితి నెలకొందని అన్నారు. గవర్నర్ల వైఖరిని వ్యతిరేకిస్తూ కేరళ ప్రభుత్వం న్యాయపోరాటం చేసిందని అన్నారు. ఇటువంటి అంశాల్లో కేరళ ప్రభుత్వం లేవనెత్తిన ప్రాముఖ్యతను, ఔచిత్యాన్ని ఈ తీర్పు నొక్కి చెప్పిందని అన్నారు. కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన పలు బిల్లులను నిలిపివేసిన సంగతి తెలిసిందే.

దాదీజీ మృతికి సీఎం సంతాపం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో


(ఫైల్)

బ్రహ్మకుమారీస్ గ్లోబల్ సెంటర్ల చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్‌గా సేవలందించిన రాజయోగిని దాది రతన్ మోహినీ మృతిపట్ల ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దాదిజీ జీవితం ఆదర్శాత్మకమైనదనీ, ఆధ్యాత్మిక బలానికి, నిర్మలత్వానికి, విశ్వ సోదరభావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని మంగళవారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదా యాలను ప్రపంచ వ్యాప్తంగా 140కి పైగా దేశాల్లో విస్తరించి, సమాజానికి శాంతి, మానవతా విలువల సందేశాన్ని అందించారని కొనియాడారు. దాదిజీ మృతి రాష్ట్రానికి, దేశానికి, విశ్వ ఆధ్యాత్మికతకు తీరని లోటు అనీ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

గాలి హామీలు

ఉభయ సభల్లో హోం శాఖ తీరు

లోక్‌సభలో 421.. రాజ్యసభలో 338 హామీలు

వీటిలో వరుసగా 15..12 శాతం విస్మరణ
2014 నుంచి ఆ శాఖ నుంచి అత్యధికం
ఆ తర్వాత ఆర్థికం, లా అండ్ జస్టిస్



న్యూఢిల్లీ : 2014 నుంచి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ లోక్‌సభలో 421 హామీలు, రాజ్యసభలో 338 హామీలు ఇచ్చింది. కానీ, వీటిలో వరుసగా 15 శాతం, 12 శాతం విస్మరించింది. ఇరు సభల్లో ఈ శాఖదే అత్యధిక వాటా కావటం గమనార్హం. లోక్‌సభ, రాజ్యసభలో సమాధానం, చర్చ సమయంలో ఒక మంత్రిత్వ శాఖ సభకు తిరిగి నివేదించటంలో ప్రభుత్వం వైపు నుంచి తదుపరి చర్య తీసుకునే బాధ్యతను ఇస్తే, దానిని హామీగా పరిగణిస్తారు. పార్లమెంటులో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్నారని నిర్ధారించుకోవటానికి 1953లో ప్రభుత్వ హామీల కమిటీ ఏర్పడింది. ఒక హామీ ఇచ్చిన తేదీ నుంచి మూడు నెలల్లోపు నెరవేరకపోతే దానిని 'పెండింగ్'గా పరిగణిస్తారు. దీని తర్వాత సంబంధిత మంత్రిత్వ శాఖ ఈ వ్యవధి పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకోవటమో, హామీని వదులుకోవాలని అభ్యర్థించటమో చేయాలి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ హామీలను ట్రాక్ చేస్తుంది. ఆన్‌లైన్ అస్యూరెన్స్ మానిటరింగ్ సిస్టమ్ (ఓఏఎంఎస్) పోర్టల్‌లో వాటి స్థితిని ప్రచురిస్తుంది. ఈ సమాచారం ప్రకారం.. లోక్‌సభలో 2024లో ఇచ్చిన హామీలలో దాదాపు 65 శాతం మార్చి 24నాటికి పెండింగ్‌లో ఉన్నాయి. 2023లో ఇచ్చిన హామీలలో దాదాపు 44 శాతం, 2022లో ఇచ్చిన హామీలలో దాదాపు 18 శాతం ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. 2014 నుంచి 2022 మధ్య హామీల వాటా ఐదు నుంచి 11 శాతం మధ్య తగ్గింది.

అలాగే, 2024లో రాజ్యసభలో ఇచ్చిన హామీల్లో దాదాపు 66 శాతం మార్చి 24 నాటికి పెండింగ్‌లో ఉన్నాయి. రాజ్యసభలో, 2023లో ఇచ్చిన హామీల్లో దాదాపు 36 శాతం, 2022లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే, 2014 నుంచి 2022 మధ్య హామీల వాటా రెండు నుంచి 15 శాతం మధ్య తగ్గింది. హోం మంత్రిత్వ శాఖ ఉభయసభల్లో అత్యధిక హామీలను వదులుకున్నది.

ఉదాహరణకు, 2014లో లోక్‌సభ ఎంపీ సిరాజుద్దీన్ అజ్మల్ రాష్ట్రాలవారీగా నివేదించిన ఉగ్రవాద దాడుల సంఖ్యతో పాటు అరెస్ట్ చేసిన, చంపబడిన ఉగ్రవాదుల సంఖ్యపై అడిగిన ప్రశ్నకు హోం మంత్రిత్వ శాఖ సమాధానం ఇవ్వలేదు. ఆ హామీని సదరు మంత్రిత్వ శాఖ తొలగించింది. నకిలీ ఎన్‌కౌంటర్లలో పాల్గొన్న పోలీసులకు 'అవుట్ ఆఫ్ టర్న్ ప్రమోషన్లు', 'శౌర్య పురస్కారాలు' ఇచ్చినట్టు వస్తున్న వార్తలపై 2014లో లోక్‌సభలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ.. హోం మంత్రిత్వ శాఖను అడిగారు. ఆ ప్రశ్నను కూడా సదురు మంత్రిత్వ శాఖ తొలగించటం గమనార్హం. 2019, 2020లలో పుల్వామా ఉగ్రదాడిపై కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ అడిగిన రెండు ప్రశ్నలను సైతం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తొలగించింది.

హోం శాఖ తర్వాత ఉభయ సభల్లో అత్యధిక హామీలను వదులుకున్న మొదటి మంత్రిత్వ శాఖల్లో ఆర్థికం, లా అండ్ జస్టిస్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్, రైల్వేలు ఉన్నాయి.

బండ భారం

సంపాదకీయం

దేశంలోని కోట్లాది పేద మహిళలకు పొగరహిత వంట అవకాశాన్ని అందించాలన్న ఉద్దేశంతో 2016లో పి.ఎమ్ 'ఉజ్వల యోజన'ను ప్రారంభించారు. "కట్టెల పొయ్యిలో వండే మా తల్లులకి గౌరవంగా జీవించాలన్నదే మా ఉద్దేశం" అని కూడా చెప్పారు. అందుకే ఉజ్వల పథకాన్ని ప్రవేశపెట్టినట్టు ఆనాడు మోడీ భావోద్వేగంతో చెప్పిన తీరు ఇప్పటికీ మహిళలకు గుర్తుంది. అ నినాదం ఆయనకూ, ఆయన పార్టీకి రాజకీయంగా ఎంతగానో ఎంతో లబ్ది చేకూర్చింది. ఇప్పుడు అదే తల్లులపై బండ రూపంలో భారం మోపారు. ఇప్పటికే రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలతో సామాన్యజనం పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. తాజాగా పెరిగిన గ్యాస్‌బండ భారంతో పేద, మధ్యతరగతి జనం ఆరోగ్యంగా ఎలా ఉండగలుగుతారన్నది ప్రశ్న.

> ఆర్థిక సమస్యలు చుట్టుముట్టినప్పుడల్లా ప్రజలను పక్కదారి పట్టించి ధరలు పెంపు భారాన్ని జనంపై మోపడం కేంద్రానికి కొత్తేం కాదు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నప్పుడల్లా బీజేపీ ప్రభుత్వం మతపరమైన అంశాలను ముందుకుతెచ్చి లబ్దిపొందుతూ వస్తోంది. పెట్రోధరల విషయంలో బీజేపీ ప్రభుత్వం అధికార దోపిడీకి పాల్పడుతున్నది. 'అచ్ఛేదిన్' ఇప్పుడు కనుచూపు మేరలో కూడా లేదు. ముడిచమురు ధరల పెరుగుతుండటమే వల్లే భారం వేయాల్సి వస్తుందంటున్న ప్రభుత్వం, అంతర్జాతీయ స్థాయిలో ధరలు తగ్గినప్పుడు గానీ ఆ ఫలితాలను వినియో గదారులకు అందించేందుకు చేతులు రాకపోవడం దారుణం.

పెరిగిన బండ భారం మంగళవారం నుంచే అమల్లోకి వచ్చింది. దీని ద్వారా పీఎంయూవై లబ్దిదారులకు, ఇతర విని యోగదారులకు ఇది భారమే. ఈ పెంపు గ్యాస్ వినియోగదారులకే కాదు సబ్సిడీ కింద సిలిండర్లను అందిస్తున్న ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపైనా భారం పడనుంది. అదేవిధంగా పెట్రోల్, డీజీల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని కేంద్రం పెంచింది. ఈ పెంపుతో వినియోగదారులపై ప్రభావం పడదని, ఈ భారాన్ని చమురు మార్కెటింగ్ కంపెనీల భరిస్తాయని కేంద్రం వివరించింది. సుంకం పెంపు వల్ల కేంద్రానికి ఆదాయం లభిస్తోంది. పదిహేను రోజులకోసారి ధరలను సమీక్షిస్తూ నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రకటించడంతో ఎప్పుడైనా ధరలు పెరగడం ఖాయమని తెలుస్తోంది.



కొన్నిరోజుల క్రితమే 19 కేజీల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్‌పై రూ.41 మేర ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ (ఓఎంసీ)లు తగ్గించిన విషయం తెలిసిందే. తాజాగా వంటగ్యాస్ సిలిండర్ ధరలను పెంచుతూ మోడీ సర్కారు తీసుకున్న నిర్ణయం సామాన్యులకు ధరాఘాతమే. 2014లో మోడీ అధికారంలోకి వచ్చినపుప్పుడు రూ.399 ఉన్న ధర.. ఇప్పుడు ధర రూ.900కు పైగా చేరింది. పదకొండేండ్లలో 130.57 శాతం ధర పెరిగినట్టయింది. వంట గ్యాస్ ధర పెంపుదల భారం గతంలో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపైనే పడేది. ఉజ్వల పథకాన్ని ప్రారంభించిన తర్వాత ఆ వర్గాల ప్రజలపైనా ప్రధాని మోడీ మొట్టమొదటిసారి భారాన్ని మోపారు. ఇప్పటికే గ్యాస్ ధరలు సామాన్యులకు అందనంత స్థాయికి చేరగా, భవిష్యత్తులో మరింత భారం మోపే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే దేశంలో పెరుగుతున్న పలు వస్తువుల ధరలతో సతమత మవుతున్న సాధారణ ప్రజలు.. వంట గ్యాస్ ధరలను అమాంతంగా పెంచటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతంలో ఎదురైన నష్టాలను పూడ్చుకోవటంలో భాగంగా ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం పెంపు తప్ప వినియోగదారులపై భారం పడదు అని కేంద్రప్రభుత్వం చెబుతోంది. వాస్తవానికి సాధారణ ఎన్నికలకు ముందు 2024లో కేంద్రప్రభుత్వం పెట్రోల్, డీజీల్‌పై లీటర్‌కు రెండు రూపాయల చొప్పున ధర తగ్గించింది. దాంతో మోడీని ఆకాశానికెత్తేశారు. తాజాగా ఎక్సైజ్ సుంకం రూపంలో పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రెండు రూపాయలు విధించింది. అప్పుడు కోల్పోయిన నష్టాన్ని తాజాగా సమకూర్చింది. 32 వేల కోట్ల రూపాయలను అర్జించబోతుంది. ఎక్సైజ్ సుంకం రూపంలో గతంలో కోట్ల రూపాయలను వెనకేసుకున్న ప్రభుత్వం.. వాటిని పారిశ్రామికవేత్తలకు ఉపయోగించింది తప్ప సామాన్యులకు ఉపయోగించింది శూన్యం. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతికూల ఆర్థిక, వాణిజ్య పరిస్థితుల నేపథ్యంలో మోడీ సర్కారు ధరల పెంపు నిర్ణయం తీసుకుందన్నది వాస్తవం. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి నప్పుడల్లా ప్రజలను పక్కదారి పట్టించి ధరలు పెంపు భారాన్ని జనంపై మోపడం కేంద్రానికి కొత్తేం కాదు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నప్పుడల్లా బీజేపీ ప్రభుత్వం మతపరమైన అంశాలను ముందుకుతెచ్చి లబ్దిపొందుతూ వస్తోంది. పెట్రోధరల విషయంలో బీజేపీ ప్రభుత్వం అధికార దోపిడీకి పాల్పడుతున్నది. 'అచ్ఛేదిన్' ఇప్పుడు కనుచూపు మేరలో కూడా లేదు. ముడిచమురు ధరల పెరుగుతుండటమే వల్లే భారం వేయాల్సి వస్తుందంటున్న ప్రభుత్వం, అంతర్జాతీయ స్థాయిలో ధరలు తగ్గినప్పుడు గానీ ఆ ఫలితాలను వినియో గదారులకు అందించేందుకు చేతులు రాకపోవడం దారుణం. ప్రభుత్వం నిజంగా ప్రజలతో ఉందని భావిస్తే ఇంధనంపై అధిక ఎక్సైజ్ సుంకాలను తగ్గించాలి. అభివృద్ధి ముసుగులో భారం మోపే విధానాలను ప్రజలు నమ్మరు. అటువంటి వాటిని ప్రజలు వ్యతిరేకించాలి. ధరలు తగ్గించేందుకు పాలకులపై ఒత్తిడి తీసుకురావాలి. ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములవ్వాలి.

మెయిల్ @ నవతెలంగాణ

సపాయి కార్మికులకు సౌకర్యాలేవి?

హైదరాబాద్ మహానగరం అందమైన పరిశు భ్రత కలిగిన నగరం అని గతంలో ఘనంగా కీర్తింపబడేది. దానికి కారణం ఉదయం మనం లేవకముందే సిటీని మొత్తం శుభ్రపరిచేది సపాయి కార్మికులు. కానీ సౌకర్యాల లేమి, సిబ్బంది కొరత ఇప్పుడు వారికి అదనంగా పనులు కల్పించడంతో నగర శుభ్రత ప్రశ్నార్థకంగా మారింది. నగరం ఎంత అందంగా ఉన్నా రోడ్ల మీద చెత్త, డ్రెయినేజీ కంపు కనపడకూడదు. ఇది వాహనదారులకే కాదు, ప్రతి ఒక్కరినీ ఇబ్బంది పెట్టేదే. నాలుగైదు దశాబ్దాలతో పోలిస్తే జనాభా గృహాలు, వాటి సముదాయాలు, ఆకాశహర్మ్యాలు, పరిశ్రమలు, వ్యాపార వాణిజ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు విస్తృతస్థాయిలో ఏర్పడ్డాయి. కానీ, సమయానుకూలమైన యాజమాన్య పద్ధతులు పర్యవేక్షణ అవలంభించకపోవడం వలన ప్రస్తుతం గత కీర్తి ప్రతిష్టలకు నోచుకోవడం లేదు. ఏ ఇంటికి,లేదా అపార్ట్‌మెంట్, ఫ్యాక్టరీ, ఆఫీసులకు ఊడ్చేందుకు మనుషులు ఉన్నా వారు అక్కడికే పరిమితమవుతారు. కానీ నగరాన్ని ఉదయమే శుభ్ర పరచడానికి సపాయి కార్మికులుతమ శక్తి వంచన లేకుండా ఎండకాలం, చలికాలం, వానాకాలమనే తేడాలేకుండా ఏ కాలమైనా విధులను నిర్వహిస్తుంటారు. వీరి సేవలకు పాదాభివందనం చేయవలసిందే. ముఖ్యంగా స్త్రీలు నిర్వహిస్తున్న పాత్ర ఇందులో ప్రశంసించ తగినది. గతంలో వీరికి వీధులను ఊడ్చుటకు ఏడాదికి సరిపడా చీపురు కట్టలు, వాటికి రక్షణకు కావలసిన చేతి గ్లౌజులు, మాస్కులు, చేతులు శుభ్రం చేసుకోవడానికి హ్యాండ్‌వాష్‌తో కూడిన కిట్‌ను అందజేసేవారు. కానీ, ప్రస్తుతం ఈ కిట్స్‌ను ప్రభుత్వం వీరికి అందజేయడం లేదు. దీనివల్ల అనారోగ్యానికి గురవుతున్నామని వారు వాపోతున్నారు. అలాగే వీరి సేవలను కేవలం వీధులు శుభ్రం చేసుకోవడానికి కాకుండా ఇతర పనులకు కూడా ఉపయోగించడం వలన శుభ్రత లోపిస్తున్నది. వాడల్లో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికిన తర్వాత వాటిని వాహనాల్లో తరలించుటకు వీరి సేవలను ఉపయోగిస్తున్నారు. ఫలితంగా వాడల శుభ్రత అధ్వానంగా మారుతున్నది. ఇతర గ్యాంగ్ పనులకు కూడా వీరినే ఉపయోగించుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఆయా కాలనీల గృహాల సంఖ్య జనాభా ఇతరత్రా దృష్టిలో పెట్టుకొని ముగ్గురు లేదా నలుగురుని సఫాయి ఉద్యోగులను కేటాయిస్తుంటారు. ఇందులో ఒకరు వారాంతం సెలవు, మరొకరు స్వంత అవసరాల కోసం లీవ్‌లో ఉంటే వీధుల శుభ్రత లోపిస్తున్నది. ఇతర శాఖల్లో అదనంగా సపాయి కార్మికులకు బదులుగా పనిచేసే వారు వేరే లేరు.దీంతో కష్టమైనా సరే, ఉన్నవారే విధుల్లో ఉండాల్సి వస్తున్నది. ఇతర శాఖల్లో ఉండే అదనపు సిబ్బందిని ఈ పనులకు కేటాయించడం ద్వారా విధుల్లో ఉన్న కార్మికులకు కాస్త ఉపశమనం దొరికే అవకాశముంది.దీనివల్ల వీరు ఆరోగ్యవంతంగా ఉండి నగరాన్ని మరింత శుభ్రంగా తీర్చిదిద్దుతారు. అందుకే వీరి అరోగ్యం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాలి. వీరి పని ప్రదేశాల్లో కేటాయించే కిట్, అలాగే శానిటైజర్, మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించాలి.

-డి.ఆర్.సి.రావు,
9849592958

రక్తమోడిన స్టాక్ మార్కెట్లు! అమెరికాలో 20లక్షల మంది నిరసన



ఎం కోటేశ్వరరావు
8331013288

డాక్టర్ డోనాల్డ్ ట్రంప్ పన్నుల మాత్ర వికటించి ప్రపంచమంతా అతలాకుతలమైంది! ఒకవైపు ధరల పెరుగుదల భయంతో అమెరికాలో వేలం వెర్రిగా కొనుగోళ్లకు జనం పరుగులు తీశారు. వారే మరోవైపు డోనాల్డ్ ట్రంప్, అతగాడి ఆత్మ ఎలన్ మస్క్ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసనలకు దిగారు. 150 సంస్థల పిలుపు మేరకు ఏప్రిల్ ఐదవ తేదీన మా జోలికి రావద్దు (హాండ్స్ ఆఫ్) నినాదంతో 20లక్షల మంది దేశమంతటా ప్రదర్శనలు నిర్వహించారు. ప్రపంచ వ్యాపితంగా మూడవ రోజు సోమవారం కూడా స్టాక్ మార్కెట్లు పతనమై 9.5లక్షల కోట్ల డాలర్ల సంపద ఆవిరైంది. హంకాంగ్ స్టాక్ మార్కెట్ సూచీ గరిష్టంగా 13శాతం కుదేలైంది. మంగళవారం నాడు మనదేశంతో సహా ఆసియా దేశాల మార్కెట్లు కొద్దిగా తేరుకున్నాయి. 'నేనైతే తగ్గాలనుకోవంటం లేదు, ఏదన్నా జరిగినపుడు కొన్ని సమయాల్లో ఒక గోలీ వేసుకోక తప్పదు' అని ట్రంప్ వ్యాఖ్యానించాడు. అమెరికన్ల హక్కులు, స్వేచ్ఛ మీద దాడి చేస్తూ బలవంతంగా లాక్కుంటు న్నారంటూ ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమకారుల పిలుపుమేరకు జనం స్పందించారు. అక్కడి 50 రాష్ట్రాల రాజధానులు, పార్లమెంటు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముందు 1,400కుపైగా చిన్నా పెద్ద ప్రదర్శనలు నిర్వహించారు. లండన్, పారిస్ వంటి ఇతర దేశాల నగరాల్లో కూడా నిరసన తెలిపారు. ధనవంతుల పాలన ఇంకే మాత్రం సాగదు, వారికి జన ఘోష వినిపించేట్లు చేస్తామంటూ ప్రదర్శకులు నినదించారు. నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటామని సంతకాలు చేసిన వారే దాదాపు ఆరులక్షల మంది ఉన్నారు.

వాషింగ్టన్ డిసిలోని జార్జి వాషింగ్టన్ స్మారక స్థూపం వద్ద ప్రధాన సభ జరిగింది. అమెరికా కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షురాలు లిజ్ షూలెర్ ప్రధాన వక్త. పోరాడేవారి నోరు మూయించేందుకు ట్రంప్ సర్కార్ చూస్తున్నది కానీ ఆటలు సాగనిచ్చేది లేదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వంతో బేరమాడే హక్కులను యూనియన్లకు లేకుండా కాలరాస్తోందని, కార్మిక సంఘాలను దెబ్బతీస్తోందన్నారు.ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఎవరెట్ కెలీ మాట్లాడుతూ ఉద్యోగులను సులభంగా దెబ్బతీయవచ్చని ట్రంప్, మస్క్ భావిస్తున్నారు. 'మాసభ్యులు మిలిటరీలో పనిచేసిన వారే అని గుర్తుంచుకోవాలని, తమను బెదిరించలేరని' హెచ్చరించాడు. డెమోక్రటిక్ పార్టీ ఎంపీ జామీ రస్కిన్ మాట్లాడుతూ 'అమెరికాను స్థాపించిన వారు రాసిన రాజ్యాంగం..మేము పౌరులం అంటూ ప్రారంభమైంది తప్ప మేము నియంతలం' అని కాదన్నాడు. ఇక్కడ ప్రదర్శనకు పది వేల మంది వస్తారనుకుంటే పది రెట్లు వచ్చినట్లు నిర్వాహకులు ప్రకటించారు. వాషింగ్టన్ నగరంలో ప్రదర్శన చేసిన వారు కిరాయిబాపతు తప్ప మరొకటి కాదని ఎలన్ మస్క్ నోరుపారేసుకున్నాడు. ఆ మేరకు తన ఎక్స్‌లో అనేక వీడియోలను పోస్టు చేశాడు. వారెందుకు ప్రదర్శన చేశారో కూడా వారికి తెలియదన్నాడు. నిరసనకారులు ట్రంప్‌ను ఎంతగా వ్యతిరేకిస్తున్నారో లక్షా 21వేల మంది కేంద్ర ఉద్యోగులను తొలగించిన ఎలన్ మస్క్‌ను కూడా అంతే నిరసిస్తున్నారు. రానున్న పదేండ్లలో ధనికులకు ఐదులక్షల కోట్ల డాలర్ల మేర పన్నుల రాయితీ ఇస్తూ ట్రంప్ సర్కార్ ఇటీవల నిర్ణయించింది. ఇదే



సమయంలో వైద్యం, పెన్షన్ వంటి సంక్షేమ పథకాలకు పెద్ద ఎత్తున కోతలను ప్రతిపాదించింది.తమ మీద మరిన్ని భారాలను మోపే పన్నులతో పాటు ఈ విధానాలకు కూడా శనివారం నాడు నిరసనలో వెల్లడించారు. ట్రంప్ వెనక్కు తగ్గకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలు కొనసాగే అవకాశం ఉంది.

ట్రంప్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని చైనా వ్యాఖ్యానించింది. ఈనెల తొమ్మిదవ తేదీలోగా చైనా వెనక్కు తగ్గాలని లేకుంటే మరో యాభై శాతం వడ్డిస్తానని ట్రంప్ ప్రకటించాడు. ఎవరూ తగ్గకపోతే చైనా వస్తువులపై ట్రంప్ పన్ను 104 శాతానికి చేరనుంది. అతగాడిని ప్రసన్నం చేసుకొనేందుకు మనదేశం గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, ఎక్స్ తదితర కంపెనీలకు లబ్ది కలిగేలా డిజిటల్ సర్వీసు పన్ను రద్దు చేసింది. ఖరీదైన మోటారు సైకిళ్ల, విస్కీల మీద పెద్ద మొత్తంలో తగ్గించింది. ఇంత చేసిన తర్వాత రెండు దేశాల మధ్య ఒప్పందం సంగతి తేల్చాలని మన విదేశాంగ మంత్రి జై శంకర్ అమెరికా మంత్రి మార్కో రూబియోకు ఫోన్లు చేస్తున్నారు. పారిశ్రామిక వస్తు ఎగుమతులు, దిగుమతుల మీద ఎలాంటి పన్ను విధించకూడదని తాము కోరుతున్నామని, వీటిమీద చర్చలకు సిద్ధమని, కుదరకపోతే తాము కూడా ప్రతికూల పన్నులు వేసేందుకు సన్నద్ధమౌతున్నట్లు ఐరోపా సమాఖ్య అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ చెప్పారు. మూడు నెలల పాటు పన్నుల వసూలు వాయిదా వేయాలన్న సూచనను ట్రంప్ తిరస్కరించాడు. అయినప్పటికీ మంగళవారం నాడు ప్రారంభంలో ఆసియా స్టాక్ మార్కెట్లు స్వల్పంగా కోలుకున్నాయి.

అమెరికాలో బహుళజాతి కార్పొరేట్లకు వత్తాసు పలుకుతున్న ట్రంప్, వారి కనుసన్నల్లో పనిచేసే మీడియా సంస్థలు అనేక అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయి. మెక్సికో నుంచి చైనా పెంటానిల్ అనే మత్తు మందును అక్రమంగా సరఫరా చేస్తోందని, అక్రమ వలసలు అమెరికాను దెబ్బతీస్తున్నాయని చేసిన ప్రచారం నిజంగా అసలు సమస్యలే కాదు. వాటిని అరికట్టేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. ఆ సాకుతో వాణిజ్యం యుద్ధం చేయాల్సిన అవసరం లేదు. అధికారానికి వచ్చిన వెంటనే అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపే పేరుతో చేసిన హడావుడి తర్వాత ఎందుకు కొనసాగించలేదు. 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో ధరలు తగ్గుతాయి, ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుంది, దిగుమతులపై పన్నులు అమెరికన్ల ఉపాధిని కాపాడతాయి, ఇందుకోసం తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులను భరించకతప్పదు' అనే రీతిలో జనాన్ని నమ్మించచూస్తున్నారు. వీటిలో ఏ ఒక్కటైనా కార్మికవర్గ జీవన ప్రమాణాలను పెంచేదిగానీ, ఉపయోగపడేది గానీ ఉందా, వేతనాలను అదుపు చేయటం వారి లాభాలను గరిష్టంగా పెంచుకొనే కార్పొరేట్ల ఎత్తుగడలు తప్ప మరేమైనా ఉన్నాయా అన్న చర్చ కార్మికవర్గంలో ప్రారంభమైంది. గత మూడు దశాబ్దాలుగా అమెరికా వస్తు ఉత్పాదక సంస్థలు దేశం వదలి పోతుంటే 78 ఏండ్ల ట్రంప్ గతంలో ఎప్పుడైనా నోరు విప్పాడా? ఇప్పుడెందుకు గుండెలు బాదుకుంటున్నాడు? పెట్టుబడిదారులు తమకు ఏది లాభంగా ఉంటే ఆ విధానాలను రూపొందించే వారిని పాలకులుగా గద్దెనెక్కి స్తారు. 2018లో ఇదే ట్రంప్ చైనా మీద వాణిజ్య యుద్ధం ప్రారంభించాడు. అమెరికాలో పోయిన ఉద్యోగాలు తిరిగి వస్తాయని అప్పుడు కూడా చెప్పాడు. తర్వాత ఎన్నికల్లో ఓడిపోయి చరిత్రకెక్కాడు. అక్కడి ఉక్కు, తదితర కంపెనీలకు లాభాలు తప్ప కార్మికులకు వేతనాలు పెరగలేదు.రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత వినాశకరమైన ఆర్థిక విధానాన్ని ట్రంప్ పాటిస్తున్నట్లు అమెరికా మాజీ అర్థిక మంత్రి లారెన్స్ సమర్స్ వ్యాఖ్యానించాడు.1930దశకం తర్వాత అతి పెద్ద వాణిజ్య యుద్ధాన్ని ట్రంప్ ప్రారంభించినట్లు చెబుతున్నారు.

> గత మూడు దశాబ్దాలుగా అమెరికా వస్తు ఉత్పాదక సంస్థలు దేశం వదలి పోతుంటే 78 ఏండ్ల ట్రంప్ గతంలో ఎప్పుడైనా నోరు విప్పాడా? ఇప్పుడెందుకు గుండెలు బాదుకుంటున్నాడు? పెట్టుబడిదారులు తమకు ఏది లాభంగా ఉంటే ఆ విధానాలను రూపొందించేవారిని పాలకులుగా గద్దెనెక్కిస్తారు. 2018లో ఇదే ట్రంప్ చైనా మీద వాణిజ్య యుద్ధం ప్రారంభించాడు. అమెరికాలో పోయిన ఉద్యోగాలు తిరిగి వస్తాయని అప్పుడు కూడా చెప్పాడు. తర్వాత ఎన్నికల్లో ఓడిపోయి చరిత్రకెక్కాడు. అక్కడి ఉక్కు తదితర కంపెనీలకు లాభాలు తప్ప కార్మికులకు వేతనాలు పెరగలేదు.రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత వినాశకరమైన ఆర్థిక విధానాన్ని ట్రంప్ పాటిస్తున్నట్లు అమెరికా మాజీ అర్థిక మంత్రి లారెన్స్ సమర్స్ వ్యాఖ్యానించాడు.1930దశకం తర్వాత అతి పెద్ద వాణిజ్య యుద్ధాన్ని ట్రంప్ ప్రారంభించినట్లు చెబుతున్నారు.

సమస్య పెట్టుబడిదారీ వ్యవస్థలోనే అంతర్గతంగా ఉంది. కార్మికుల ఉద్యోగాలు పోవటానికి, వేతనాలు తగ్గటానికి కారణం చైనా, మెక్సికో, కెనడా, ఐరోపాల నుంచి వస్తున్న దిగుమతులే కారణమని ట్రంప్ యంత్రాంగం చిత్రిస్తున్నది. స్వదేశీ పరిశ్రమలకు ప్రోత్సాహం పేరుతో భారీ ఎత్తున్న పన్ను రాయితీలు ఇచ్చినసప్పటికీ దేశభక్త జనరల్ మోటార్స్ వంటి కంపెనీలు స్వదేశంలో ఫ్యాక్టరీలను మూసివేసి మెక్సికో, తదితర దేశాలకు తరలిపోయాయి. పన్నుల విధింపు కంపెనీలకు తప్ప కార్మికులకు మేలు చేయవని తొలిసారి అధికారంలో ఉన్నపుడు ఉక్కు దిగుమతుల వ్యవహారం వెల్లడించింది. కరోనా కాలం నుంచి చూస్తే కార్పొరేట్లకు లాభాలు కార్మికులకు భారాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో దిగువ చర్యలు తీసుకోవాలని కార్మికవర్గం డిమాండ్ చేస్తోంది. విదేశాల్లో ఉపాధి కల్పించి కార్యకలాపాలు నిర్వహిస్తున్న అమెరికన్ కార్పొరేషన్ల మీద పన్ను విధించి, ఆ మొత్తాన్ని ఇతర రంగాల్లో కార్మికులను నిలుపుకొనేందుకు వినియోగించాలి. పన్నులు గనుక ఖర్చులను పెంచేట్లయితే ధరలను గట్టిగా నియంత్రించాలి. ఆహారం, ఔషధాలు, గృహ తదితరాల ధరలను స్తంభింప చేయాలి. కార్పొరేట్ల కోసం కార్మికులు మూల్యం చెల్లించకూడదు. కార్మిక సంఘాల హక్కులకు భంగం కలగకుండా అంతర్జాతీయ కార్మిక హక్కులను అమలు చేసి మాత్రమే వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలి. కీలకమైన ఉక్కు, ఆటోమొబైల్ వంటి పరిశ్రమలను బడా కంపెనీలకు దూరంగా ప్రజల భాగస్వామ్యంలో నిర్వహించాలి.

పెట్టుబడిదారులు వారు పారిశ్రామికవేత్తలైనా, వాణిజ్యంచేసే వారైనా లాభాలు వచ్చాయా లేదా? అన్నది తప్ప ఎలాంటి విలువలు, వలువలు, సిద్ధాంతాలు ఉండవు. ఎప్పటికెయ్యది లాభమో అప్పటికా విధానాలను తమ ప్రతినిధులైన పాలకుల ద్వారా రూపొందించి అమలు చేస్తారు. కమ్యూనిజం వ్యాప్తి నిరోధానికి కంకణం కట్టుకున్నట్లు చెప్పిన అమెరికా ప్రత్యర్థిగా ఉన్న బలమైన సోవియట్‌ను దెబ్బతీసేందుకు ప్రచ్ఛన్న యుద్ధం సాగించింది. అదే కాలంలో ప్రపంచంలో పెద్ద మార్కెట్‌గా ఉన్న చైనాలో తన వస్తువులను అమ్ముకొనేందుకు, చౌకగా అక్కడ ఉత్పత్తి చేసి దిగుమతులు చేసుకొని లబ్దిపొందాలని ఎత్తువేశారు. దాంతో అప్పటి వరకు ఐరాసలో కమ్యూనిస్టు చైనాకు నిరాకరించిన భద్రతామండలి శాశ్వత సభ్యత్వాన్ని ఇచ్చేందుకు అంగీకరించింది. ఇదే సమయంలో స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో ప్రపంచీకరణ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చింది. ప్రపంచ వాణిజ్య సంస్థపేరుతో నిబంధనలు రూపొందించింది. నాలుగు దశాబ్దాల తర్వాత సమీక్షించుకుంటే ఈ విధానం తమకంటే చైనా, ఇతర దేశాలకు ఎక్కువ ప్రయోజనకరంగా ఉన్నట్లు గ్రహించి ప్రపంచం మొత్తం తనకు వ్యతిరేకంగా తొండి చేస్తున్నట్లు ఇప్పుడు అమెరికా ఆరోపిస్తోంది.తమకు రక్షణ చర్యలు,మరిన్ని రాయితీలు కల్పించాలని ట్రంప్ ద్వారా కార్పొరేట్ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. స్వేచ్ఛా వాణిజ్యానికి వీలు కల్పించాలని కోరేదీ, దానికి విరుద్ధమైన రక్షణ విధానాలను కోరేదీ కూడా పెట్టుబడిదారులే. చైనా నుంచి వస్తువులను స్వేచ్ఛగా దిగుమతి చేసుకొనేందుకు, పెట్టుబడులను అనుమతించాలని మన దేశంలో కోరుతున్నదీ, చౌకగా వచ్చే వస్తువులతో తమ పరిశ్రమల మనుగడకు ముప్పు గనుక ఆంక్షలు పెట్టాలి లేదా పన్ను విధించాలని కోరుతున్నదీ పెట్టుబడిదారులే .చైనా పెట్టుబడులను కేంద్రం అడ్డుకుంటే మోడీ మెడలు వంచి అనుమతించేందుకు ఒప్పించారు. అమెరికాను వ్యతిరేకిస్తున్న దేశాల మీద ప్రతీకార పన్ను ఏటా ఆరువందల బిలియన్ డాలర్ల మేర రాబడి వస్తుందని చెబుతున్న ట్రంప్ రానున్న పదేండ్లలో ఐదు లక్షల కోట్ల డాలర్ల మేరకు కార్పొరేట్లు, ధనికులకు పన్ను రాయితీలిచ్చేందుకు తీర్మానం చేయించాడు. అంటే అలా వచ్చేదాన్ని ఇలా అయినవారికి వడ్డించేందుకు సిద్ధమయ్యాడు. మరోవైపున కార్మికుల సంక్షేమ చర్యలకు కోత పెట్టేందుకు పూనుకున్నాడు.తమ దేశాలకు చెందిన సంస్థల వస్తువులను అమ్ముకొనేందుకు అవసరమైన మార్కెట్ల వేటలో భాగంగానే ప్రపంచాన్ని వలసలుగా మార్చుకొనేందుకు తలెత్తిన పోటీలో రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. భౌతిక వలసల్లో బ్రిటన్‌ది పైచేయి కాగా ఇప్పుడు అది సాధ్యం కాదు గనుక మార్కెట్లను కబళించే క్రమంలో అమెరికా ముందుకు వచ్చింది. దానికి ప్రతిఘటన ఫలితమే వాణిజ్యపోరు!

> కమ్యూనిజం వ్యాప్తి నిరోధానికి కంకణం కట్టుకున్నట్లు చెప్పిన అమెరికా ప్రత్యర్థిగా ఉన్న బలమైన సోవియట్‌ను దెబ్బతీసేందుకు ప్రచ్ఛన్న యుద్ధం సాగించింది. అదే కాలంలో ప్రపంచంలో పెద్ద మార్కెట్‌గా ఉన్న చైనాలో తన వస్తువులను అమ్ముకొనేందుకు, చౌకగా అక్కడ ఉత్పత్తి చేసి దిగుమతులు చేసుకొని లబ్దిపొందాలని ఎత్తువేశారు. దాంతో అప్పటి వరకు ఐరాసలో కమ్యూనిస్టు చైనాకు నిరాకరించిన భద్రతామండలి శాశ్వత సభ్యత్వాన్ని ఇచ్చేందుకు అంగీకరించింది. ఇదే సమయంలో స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో ప్రపంచీకరణ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చింది. ప్రపంచ వాణిజ్య సంస్థపేరుతో నిబంధనలు రూపొందించింది. నాలుగు దశాబ్దాల తర్వాత సమీక్షించుకుంటే ఈ విధానం తమకంటే చైనా, ఇతర దేశాలకు ఎక్కువ ప్రయోజనకరంగా ఉన్నట్లు గ్రహించి ప్రపంచం మొత్తం తనకు వ్యతిరేకంగా తొండి చేస్తున్నట్లు ఇప్పుడు అమెరికా ఆరోపిస్తోంది.

వక్ఫ్ బిల్లు.. రాజ్యాంగ మౌలిక నిర్మాణంపై దాడి



షేక్ కరిముల్లా
9705650705

"ప్రస్తుత భారతదేశంలో ముస్లింలను నమాజ్ చేసినందుకు అవమానిస్తారు. ఆవు పేరుతో కొట్టి చంపుతారు. శాఖాహారం పేరుతో వారి దుకాణాలను బహిష్కరిస్తారు. వారి గుర్తింపు కారణంగా వారికి అద్దె ఇండ్లు నిరాకరిస్తారు. వారి ఇండ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తారు. వాస్తవం ఇది కాగా ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసమే ఈ వక్ఫ్ బిల్లు తీసుకువచ్చిందని చెబుతున్నారు. ఇది మనం నమ్మాలంటా...! ఎంత హాస్యాస్పదం." - రవిష్ కుమార్ (జర్నలిస్ట్)

రాజ్యాంగం, ప్రజాస్వామ్యాలపై తమకు ఏమాత్రం గౌరవం లేదని మోడీ ప్రభుత్వం మరోసారి రుజువు చేసింది. ముస్లిం ప్రజల ధార్మిక వక్ఫ్ ఆస్తులపై కన్నేసి వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో తూతూ మంత్రంగా బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ చైర్మన్‌గా కమిటీ వేసింది. కమిటీ ప్రతిపక్షాలు, ముస్లిం ప్రజల ప్రతిపాదనలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు. ఏకపక్షంగా నివేదికను ఖరారు చేసింది. దీన్నిబట్టి ప్రభుత్వానికి వక్ఫ్ ఆస్తులను బడా బాబులకు అప్పగించాలనే ఆలోచన ఉంది. అందుకే ఈ బిల్లు సున్నితమైన మతపరమైన అంశంగా కాక ఆస్తులకు సంబంధించిన అంశంగా చూసింది. తన మంది బలంతో 'మాయ సభ' లో బిల్లును ఆమోదింప చేసుకుంది. మొదటినుండి మోడీ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులపై విష ప్రచారం మొదలుపెట్టింది. నిజానికి వక్ఫ్ ఆస్తులు ఏ ఒక్కరి వ్యక్తిగత ఆస్తులు కావు. మొత్తం ముస్లిం సమాజానికి చెందిన ఆస్తులు.(ప్రతి మతానికి ఇలాంటి ఆస్తులు ఉన్నాయి) ఇందులో మొత్తం ముస్లిం సమాజ ప్రయోజనాలే ఉంటాయి .విద్య, వైద్యం, దర్గాలు, ఈద్గాలు ముస్లిం ధార్మిక సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు దీనిపై వచ్చే ఆదాయం ఖర్చు చేస్తారు. తరాలుగా ముస్లిం ప్రజల మేలు కోసం ముస్లిం చక్రవర్తులు, నవాబులు, సంపన్న ముస్లింలు దాతృత్వంతో ఉదారంగా దాన మిచ్చిన ఆస్తులివి. ఇవి ఏమాత్రం ప్రభుత్వ ఆస్తులు కావు. ఈ ఆస్తులు సంరక్షించడానికి ఓ చట్టం ఉంది. అదే వక్ఫ్ చట్టం.



ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసి ఆస్తులను స్వాధీనం చేసుకోవటమే మోడీ అసలు లక్ష్యం. తద్వారా తమ పారిశ్రామిక మిత్రులైన ఆదాని, అంబానీలకు ఈ ఆస్తులు ధారాదత్తం చేయటం కోసమే ఈ బిల్లు తెచ్చింది. తదుపరి లక్ష్యం ఆలయాలు, చర్చిలు గురుద్వారాల భూములు ఆక్రమించుకుంటారు అని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. వాస్తవం కూడా ఇదే. ఇదంతా హిందూత్వ ముసుగులో జరిగిపోతోంది. నిజానికి హిందూ ప్రజలకు జరుగు తున్న మేలు శూన్యం. మోడీ ప్రభుత్వం ఏదైనా మంచి చేసిందంటే అది ఆదాని, అంబానీ లాంటి బడా పారిశ్రామికవేత్తలకే అన్న విషయం హిందూ మిత్రులు గ్రహించాలి. ఈ సందర్భంగా శివసేన నేత ఉద్దవ్ ఠాక్రే మాట్లాడుతూ " బీజేపీ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసి కాశ్మీర్ పండిట్లకు వారి భూములు తిరిగి అందజేసిందా...?" అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే అయోధ్యలో 13వేల ఎకరాల భూ స్కాం జరిగింది. కేదార్‌నాథ్‌లో 300 కేజీల బంగారం మాయమైంది. ఇలా హిందువుల ఆస్తులు కాపాడలేకపోయారు. ఇప్పుడు వక్ఫ్ సవరణ బిల్లు పేరుతో ముస్లింల ఆస్తులు కాపాడుతామంటూ ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారు. మరోవైపు చైనా ఆక్రమించిన మన భూముల్ని కాపాడలేక పోతున్నారు. మొన్న అమెరికా మన దేశంపై 27 శాతం సుఖం విధించింది. ఇది మన ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపి చాలా నష్టం జరగనున్నది. అలాగే దేశంలో నిత్యం పెరిగిపోతున్న ధరలు, నిరుద్యోగం, పేదరికం, ఉపాధి, విద్య , వైదమందక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ మౌలిక అంశాలు కప్పిపుచ్చడానికి హిందూ, ముస్లిం పేరుతో విభజన రాజకీయాలు నడుపుతూ పబ్బం గడుపుకుంటున్నారు.

మొత్తంగా ఈ బిల్లు రాజ్యాంగ మౌలిక నిర్మాణంపై దాడి చేసింది. ఇది రాజ్యాంగం మైనార్టీలకు ఇచ్చిన హక్కులు తొలగించబడతాయి. ప్రాథమిక హక్కులు సైతం ఉల్లంఘిస్తుంది. వక్ఫ్ ఆస్తులను నియంత్రించి, కేంద్రీకరిస్తుంది. ముస్లింలకు సంబంధించిన వక్ఫ్ బోర్డులో ముస్లిం మేతరులకు స్థానం కల్పించడం ద్వారా ముస్లిం సమాజ హక్కులను బలహీనపరచటం, మతపరమైన వారి సొంత విషయాలపై ప్రభుత్వం జోక్యం వంటి ప్రమాదకర అంశాలున్నాయి. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 25, 26, 27, 28 ,29, 30లకు విరుద్ధంగా ఉంది. అలాగే రాష్ట్రాల జాబితాలోకి వచ్చే భూముల అంశంలోకి కేంద్రం చొరబాటుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. ఇది రాజ్యాంగ సమైక్యస్ఫూర్తికి విరుద్ధం. ఏమైనా ఈ బిల్లు ద్వారా ప్రజలకు ఉన్న మత హక్కును హరించటమే. మతం అనేది పూర్తిగా వ్యక్తిగతమైనది. రాజకీయాలను, రాజ్యాంగాన్ని, సామాజిక వ్యవస్థను మతం ప్రభావితం చేయకూడదు. రాజ్యాంగం మత స్వేచ్ఛను ఇచ్చి, లౌకికతత్వం భారతీయ జీవన విధానం అని చాటి చెప్పింది. మతాల మధ్య సోదర భావం కల్పించే రాజ్యాంగ విలువలు బాబాసాహెబ్ అంబేద్కర్ అందించారు. ఆ విలువలను గౌరవించేలా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. నేడు బీజేపీకి తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. దీన్ని లౌకికవాదులు వ్యతిరేకించాలి.

ఇంత వివాదాస్పద బిల్లును ఎంతో రాజకీయ అనుభవం ఉన్న నితీష్ కుమార్ , చంద్రబాబు సమర్థించటం ఆశ్చర్యం...! బీజేపీకి వీరు అంత తలవంచాల్సిన అవసరం ఏముంది? తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను చూసి నేర్చుకోవాలి. బీజేపీతో చెలిమి ధ్రుతరాష్ట్ర కౌగిలితో సమానమని చంద్రబాబుకు బాగా తెలుసు. 2014-17ల మధ్య బీజేపీతో అంట కాగి దెబ్బతిన్నాడు, విమర్శలు గుప్పించాడు. ఏదైనా ప్రజల్ని విస్మరించి పబ్బం గడుపుకునే రాజకీయ పార్టీలు ప్రజాపునాదిని కోల్పోతాయి. ఉనికిలో లేకుండా పోతాయి. తెలంగాణలో ఆ పార్టీ పరిస్థితే ఇందుకు ఉదాహరణ. 'సనాతన' జనసేన గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఇసుమంతైన సైద్ధాంతిక పునాది, రాజకీయ నిలకడ ఈ పార్టీకి లేవు. ఏపీలో బీజేపీ పిల్ల పార్టీగా వ్యవహరిస్తున్నది. త్రిపురనేని, విద్యాసాగర్, కందుకూరి, పెరియార్‌లు నడయాడిన దక్షిణాది నేలపై సనాతన వాదులకు చోటులేదని చరిత్ర తేల్చి చెప్పింది. అధికారంలోకి వచ్చిన 2014 నుండి మోడీ సర్కార్ నియంతృత్వ ధోరణితో దూకుడుగా ముందుకు సాగుతున్నది. ఢిల్లీ రైతు ఉద్యమ స్ఫూర్తితో ప్రజలంతా ఏకమవ్వాలి. వక్ఫ్ సవరణ చట్టాన్ని అడ్డుకోవాలి. దీనికి కుల మతాలకతీతంగా బలహీన బడుగు వర్గాలు సహకరించాలి.

> మతం అనేది పూర్తిగా వ్యక్తిగతమైనది. రాజకీయాలను, రాజ్యాంగాన్ని, సామాజిక వ్యవస్థను మతం ప్రభావితం చేయకూడదు. రాజ్యాంగం మత స్వేచ్ఛను ఇచ్చి, లౌకికతత్వం భారతీయ జీవన విధానం అని చాటి చెప్పింది. మతాల మధ్య సోదర భావం కల్పించే రాజ్యాంగ విలువలు బాబాసాహెబ్ అంబేద్కర్ అందించారు. ఆ విలువలను గౌరవించేలా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. నేడు బీజేపీకి తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. దీన్ని లౌకికవాదులు వ్యతిరేకించాలి.

భూమి అడుగుతోంది?

భూమి అడుగుతోంది?నా పిల్లలు ఎక్కడని
పుడమిపై పురుడు పోసుకున్న
జీవకోటికి అవసరాలు తీర్చింది
జలచర జీవరాశులకు ఆశ్రయం ఇచ్చింది

ధరణిలోనుంచి పుట్టుకొచ్చిన
మొక్కను చూసి మురిసిపోయింది
భవిష్యత్తు సమాజ మేలు కోరింది
ఆకాశం నుంచి జాలువారిన
వర్షపు నీరును ఒడిసి పట్టుకుంది
సకల జీవరాశికి నీరందించి దాహార్తిని తీర్చింది

భూ మండలం కలుషితం
అవుతున్న వ్యర్థాలను స్వీకరించింది
మంచి ఫలాలను అందించింది
ప్రకృతితో ముడివేసిన బంధంలా
చెట్ల బలగాన్ని చూసి మురిసిపోయింది

అంతరించిపోతున్న అడవులను
పశుపక్షాదులను,నరికేస్తున్న వృక్షాలను చూసి
బోరున విలపిస్తోంది. నా పిల్లలెక్కడా, అని
భూమి అడుగుతోంది?

-మిద్దె సురేష్,
9701209355

సీడబ్ల్యూసీ సమావేశంలో సీఎం

- సబర్మతి ఆశ్రమం సందర్శన



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూడా సీడబ్ల్యూసీ సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబర్మతీ ఆశ్రమాన్ని సీఎం బృందం సందర్శించింది.మహాత్ముడికి నివాళులు అర్పించారు. అక్కడే సీఎం రేవంత్ రెడ్డి చరఖా తిప్పి నూలు వడికారు. అక్కడి ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. గాంధీజీ చేతిరాతతో రాసిన ఉత్తరాలను చదివే ప్రయత్నం చేశారు. అధికారులు ఆశ్రమ విశేషాలను సీఎం బృందానికి వివరించారు.

మీ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్చండి

- మంచి విద్యనందిస్తామనే భరోసా కల్పించాలి
- సీట్ల సంఖ్య మేరకు విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకోవాలి : సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'విద్యాశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి నుంచి విద్యాసంస్థ అధిపతి వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే మీ పిల్లలను చేర్చండి. మంచి విద్యనందిస్తామనే భరోసాను కల్పించాలి. వచ్చే విద్యాసంవత్సరం (2025-26)లో ప్రభుత్వ విద్యాసంస్థల్లో సీట్ల సంఖ్య మేరకు విద్యార్థులు చేరే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలి'అని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలను నిర్వహిస్తూనే విద్యాశాఖ, సంక్షేమ శాఖలను చూస్తున్నారని తెలిపారు. గతనెల 26న శాసన మండలిలో విద్యారంగంపై చర్చ జరిగిందని పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణ తర్వాత కూడా విద్యాశాఖను నిర్వహిస్తానని చెప్పడాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. విద్యాశాఖను తీసుకోవడానికి మంత్రిమండలిలో వెనుకాడిన అనేక సందర్భాలను తాను గమనించానని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో ప్రాథమిక పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు సీట్ల సంఖ్య మేరకు విద్యార్థులు చేరని పరిస్థితి రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్నదని వివరించారు. పాఠశాల విద్యలో దశాబ్ద కాలంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గిందని తెలిపారు. 2014-15 విద్యాసంవత్సరంలో 24,85,007 మంది విద్యార్థులుంటే ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లో 16,86,343 మంది విద్యార్థులకు పడిపోయిందని పేర్కొన్నారు. ఈ పదేండ్లలో పాఠశాల విద్యలో 33 శాతం విద్యార్థులు తగ్గిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం గురుకులాల ద్వారా నాణ్యమైన విద్యనందిస్తామంటూ ఊదరగొట్టిందని తెలిపారు. 755 గురుకులాలను కొత్తగా ప్రారంభించిందని పేర్కొన్నారు. అందులో 622 అద్దెభవనాల్లో అరకొర వసతులతో నడుస్తున్నాయని వివరించారు. వాటిలో సీట్ల సంఖ్య మేరకు విద్యార్థులు చేరడం లేదని తెలిపారు. అద్దె భవనాల్లో ఉన్న గురుకులాల కోసమే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల భవనాలను నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. విద్యార్థులకు మంచి వసతులు సమకూరుతాయనీ, ఇది సంతోషకరమని తెలిపారు. కానీ మెజార్టీ విద్యార్థులు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ప్రయివేటు విద్యాసంస్థల్లో చదువుతున్నారని వివరించారు. ఈ పరిస్థితిని మార్చడానికి దీర్ఘకాలిక వ్యూహంతో ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. తాత్కాలిక వ్యూహంతో తీసుకుంటున్న చర్యలు ప్రభుత్వ విద్యారంగ పతనాన్ని కనీసం నిలువరించే పరిస్థితి ఉండబోదని తెలిపారు.

అధికారులదే ప్రధాన బాధ్యత

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సీట్ల సంఖ్య మేరకు గరిష్టంగా విద్యార్థులు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని నర్సిరెడ్డి సూచించారు. ప్రవేశాలను పెంచడానికి విద్యాశాఖ విభాగాధిపతి, అధికారులదే ప్రధాన బాధ్యత తీసుకోవాలని కోరారు. గురుకులాలకు సంబంధించి ఆయా సొసైటీల కార్యదర్శులు, కేజీబీవీలకు ఏఎస్పీడీ, మోడల్ స్కూళ్లకు అదనపు సంచాలకులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఇంటర్ విద్య, ఉన్నత విద్య సంచాలకులకు సంఖ్యాపరంగా విద్యాసంస్థలు చాలా తక్కువ అని పేర్కొన్నారు. వారు కాలేజీ వారీగా సమీక్ష చేసి తగు చర్యలు తీసుకుని ప్రవేశాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. విభాగాధిపతులు హుకుం జారీ చేసే తత్వంతోనే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. బృంద నాయకులుగా, ఆ బృందాన్ని ప్రేరేపించి పని చేయించే లక్షణం తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.విభాగాధిపతుల నుంచి జిల్లా స్థాయి విద్యాశాఖాధికారుల వరకు పనిచేస్తున్న వారికి బృంద నాయకులుగా పనిచేసేందుకు అవసరమైన నైపుణ్యాన్ని పెంచడానికి అవసరమైన ఏర్పాటు చేయాలని సూచించారు. రెండో దశలో మండల స్థాయి, విద్యాసంస్థల అధిపతులు, బృంద నాయకులుగా పనిచేసే నైపుణ్యాలను అందించాలని కోరారు.

పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలి

- నేడు, రేపు మండల కేంద్రాల్లో నిరసనలు : వ్యకాస

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50, పెట్రోల్, డీజీల్‌పై ఎక్సైజ్ సుంకం రూ.2 పెంచడాన్ని నిరసిస్తూ బుధ, గురు వారాల్లో మండల, జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలపాలని వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. మంగళవారం ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, అర్.వెంకట్రాములు ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలపై అధిక ధరల భారాన్ని మోపి కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చడమే లక్ష్యంగా మోడీ సర్కారు పనిచేస్తున్నదని విమర్శించారు. ఈ ధరల పెరుగుదల వల్ల రాష్ట్రంలోని 91 లక్షల కుటుంబాలపై ఆర్థిక భారం పడబోతున్నదని వాపోయారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను నియంత్రించకపోగా ప్రభుత్వమే గ్యాస్ ధరలను పెంచడం దారుణమని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గినట్టు అనేక రిపోర్టులు చెబుతుంటే మన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం కంపెనీలకు, ప్రభుత్వ ఖజానాలు నింపుకోవడం కోసం తప్ప మరొకటి కాదని విమర్శించారు. వాటి ధరలు పెరగడం అంటే వ్యవసాయ అనుబంధ ఆహార వస్తువుల ధరలు పెరగడానికి దారితీస్తుందని తెలిపారు. గ్రామీణ పేదలు చేసే పనులకు కనీస వేతనాలను పెంచాలని డిమాండ్ వస్తుంటే పట్టించుకోని సర్కారు ధరలను పెంచి వారిని మరింత పేదలుగా మార్చుతున్నదని విమర్శించారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

వర్సిటీల్లో నియామకాలపై గైడ్‌లైన్స్ విడుదల శుభపరిణామం

- ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల్లో 50శాతం ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడం శుభపరిణామని ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు తెలిపారు. రాష్ట్రంలో ఏ రంగంలో ఎలాంటి సమస్యలొచ్చినా తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవడం పట్ల ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో తగినంతమంది లెక్చరర్లు లేకపోవడం వల్ల న్యాక్ గ్రేడింగ్ తగ్గిపోయే ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని ఇటీవల తాము సీఎం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ముఖ్యమంత్రి వెంటనే స్పందించారని ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక వనరుగా మొఘల్ కట్టడాలు

పర్యాటకంతో కేంద్రానికి కోట్లాది రూపాయలు

- అత్యధిక మంది టూరిస్టులు సందర్శిస్తున్న ప్రదేశాలుగా గుర్తింపు
- టాప్-5లో తాజ్‌మహల్, కుతుబ్‌మినార్, ఎర్రకోట, ఆగ్రాకోట, రబియా దురానీ సమాధి
- 2019-24 మధ్య రూ.548 కోట్ల రెవెన్యూ
- పలు రంగాల్లో వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి
- కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ గణాంకాలు



న్యూఢిల్లీ : 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మోడీ సర్కారు ముస్లిం పాలకులను టార్గెట్ చేసుకున్నది. భారత్‌లో వారి గత పాలన గురించి తీవ్ర విమర్శలను, ఆరోపణలను చేస్తోంది. దొరికిన ప్రతి సందర్భాన్నీ, వేదికనూ ఇందుకు వినియోగించుకున్నది. ముస్లిం పాలకుల పట్ల ప్రజలలో విషబీజాలు నాటింది. వారిని తప్పుదోవ పట్టించి, వారి మెదళ్లను కలుషితం చేసింది. అయితే, ఆ ముస్లిం పాలకులు కట్టించిన ఐదు అత్యంత ప్రసిద్ధ స్మారక చిహ్నాలు, నిర్మాణాలు ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. సాక్షాత్తూ కేంద్ర అధికారిక గణాంకాలు ఈ విషయాలను వెల్లడిస్తున్నాయి. పార్లమెంటులో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన సమాచారమే ఇందుకు నిదర్శనం. యూపీలోని తాజ్‌మహల్, న్యూఢిల్లీలోని కుతుబ్ మినార్, ఎర్ర కోట, మహారాష్ట్రలోని ఆగ్రా కోట, రబియా దురానీ సమాధులు పర్యాటకులలో ఐదు అత్యంత ప్రజాదరణ కలిగిన మొఘల్ కాలం నాటి స్మారక చిహ్నాలుగా నిలిచాయి. 2019-20 నుంచి 2023-24 నాటికి ఐదేండ్లలో కేంద్రం ఈ మాన్యుమెంట్స్ వద్ద పర్యాటకులకు టిక్కెట్లను అమ్మటం ద్వారా అక్షరాల రూ.548 కోట్లను ఆర్జించింది. అంతేకాదు.. ప్రభుత్వ, ఆతిథ్య, సంబంధిత రంగాల్లో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరికింది.

భారత పురావస్తు సర్వే సంస్థ (ఏఎస్ఐ) ఈ పురావస్తు కట్టడాలపై వెచ్చించేది చాలా తక్కువే. ఉదాహరణకు, ఆగ్రా సిటీలో 2023-24 ఏడాదికి గానూ అన్ని రక్షిత స్మారక చిహ్నాల నిర్వహణ కోసం చేసిన ఖర్చు రూ.23.52 కోట్లు మాత్రమే. అయితే, అదే ఏడాది తాజ్‌మహల్ వద్ద టిక్కెట్ల అమ్మకం ద్వారా ప్రభుత్వానికి సమకూరిన మొత్తం రూ.98.5 కోట్లు కావటం గమనార్హం. " బీజేపీ నాయకులు మొఘల్ పాలకులను విమర్శించారు, ఎగతాళి చేశారు. వారి కాలం నాటి కట్టడాలు, వారసత్వ ప్రదేశాల ద్వారా అదే బీజేపీ ప్రభుత్వం భారీ మొత్తంలో రెవెన్యూను సమకూర్చుకుంటున్నది. ఇది నిజమైన కపటత్వం. వారి ద్వంద్వ స్వభావాన్ని బయటపెడుతున్నది" అని శ్రీనగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త రజా ముజఫర్ భట్ అన్నారు.

తాజ్‌మహల్ ద్వారా రూ.535 కోట్లకు పైనే

సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) దరఖాస్తు ద్వారా ఏఎస్ఐ నుంచి అందిన సమాచారం ప్రకారం.. పైన పేర్కొన్న ఐదేండ్ల కాలంలో 2.2 కోట్ల మంది పర్యాటకులు తాజ్‌మహల్‌ను సందర్శించారు. ఇది రూ.297.33 కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వానికి తెచ్చిపెట్టింది. యూపీలోని ఆగ్రాలో గల తాజ్‌మహల్.. ప్రపంచ వారసత్వ ప్రదేశంగా, దేశంలో అత్యధిక మంది సందర్శించే మొఘల్ కట్టడంగా నిలిచింది. భారత ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టిన తదుపరి ఏడాది.. అంటే 2015 నుంచి 2024 సెప్టెంబర్ ముగింపు వరకు టిక్కెట్ల అమ్మకం ద్వారా తాజ్‌మహల్ జనరేట్ చేసిన రెవెన్యూ అక్షరాల రూ.535.62 కోట్లు కావటం గమనార్హం.

ప్రపంచంలోనే అత్యంత సుందర కట్టడం

కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోకి వచ్చే ఏఎస్ఐ.. తాజ్‌మహల్ సందర్శనకు స్వదేశీ పర్యాటకులకు ఒక్కరికి రూ.50, విదేశీయులకు రూ.1100 చార్జ్ చేస్తుంది. ఇక తాజ్‌మహల్ ప్రధాన సమాధి సందర్శనకు పర్యాటకులందరూ ప్రత్యేకంగా రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. ప్రపంచంలోనే అత్యంత సుందరమైన కట్టడంగా తాజ్‌మహల్‌కు పేరున్నది. మొఘల్ చక్రవర్తి 17వ శతాబ్దంలో (క్రీస్తు శకం 1632 నుంచి 1648 మధ్య) తన భార్య ముంతాజ్‌కు గుర్తుగా ఈ అద్భుత కట్టడాన్ని నిర్మించారు. పాలరాతితో నిర్మించిన ఈ కట్టడం ప్రేమకు చిహ్నంగా నిలిచింది. ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటిగా పేరు సంపాదించుకున్నది.

తాజ్‌మహల్‌పై బీజేపీ నాయకుల నోటి దురుసు

ముస్లింలు, ఆ వర్గానికి చెందిన పాలకులంటేనే అంతెత్తున లేచే బీజేపీ నాయకులు సహజంగానే వారు(మొఘలులు) నిర్మించిన కట్టడాలను లక్ష్యంగా చేసుకుంటూ పలు సందర్భాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా తాజ్‌మహల్ పైనా మాట్లాడారు. దానిని కూలదోసి, అక్కడ ఆలయాన్ని నిర్మించాలని ప్రధాని మోడీకి తాను సిఫారసు చేసినట్టు 2023లో అసోం బీజేపీ ఎమ్మెల్యే రూప్‌జ్యోతి కుమారి అన్నారు. తాజ్‌మహల్ ఒకప్పుడు హిందూ దేవాలయమనీ, షాజహాన్ పాలనకు ముందు ఆ ఆలయాన్ని నిర్మించారని పలువురు కాషాయపార్టీ నేతలు, మద్దతుదారులు, హిందూత్వ సంస్థల నాయకులు వ్యాఖ్యలు చేశారు. ఎలాంటి ఆధారం లేకుండానే ఇలాంటి మాటలు మాట్లాడారు. ఏఎస్ఐ కూడా వారి వ్యాఖ్యలను తోసిపుచ్చుటం గమనార్హం. తాజ్‌మహల్ వద్ద కనీసం 106 మంది ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారని ఏఎస్ఐ వెల్లడించింది.

మూడో స్థానంలో ఎర్రకోట.. 90 లక్షల మంది టూరిస్టులు..రూ.54 కోట్లకు పైగా ఆదాయం

ప్రతి ఏడాదీ భారత స్వాతంత్ర్య దినోత్సవం నాడు దేశ ప్రధానిగా మోడీ ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, జాతినుద్దేశించి ప్రసంగిస్తుంటారు. ఈ ఎర్రకోట భారత్‌లో మూడో అత్యధిక ప్రజాదరణ కలిగిన మొఘల్ కట్టడంగా నిలిచింది. అధికారిక సమాచారం ప్రకారం.. ఐదేండ్లలో దాదాపు 90 లక్షల మంది టూరిస్టులు ఎర్రకోటను సందర్శించారు. రూ.54.32 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఈ చారిత్రక కోటను మొఘల్ చక్రవర్తి షాజహాన్ 1639లో నిర్మించారు. 2014 నుంచి ఈ కోట వద్ద సందర్శకులకు టిక్కెట్ల అమ్మకం ద్వారా ఏఎస్ఐకి దాదాపు రూ.140 కోట్లు సమకూరినట్టు అంచనా.

ఆగ్రా కోటకు నాలుగో ర్యాంకు

యునెస్కో ప్రపంచ చారిత్రక ప్రదేశంగా గుర్తింపు పొందిన ఆగ్రా కోట.. అత్యధిక సందర్శకులు పర్యటించిన మొఘల్‌కట్టడంగా నాలుగో స్థానంలో ఉన్నది. 2019-20 నుంచి 2023-24 వరకు 69.61 లక్షల మంది పర్యాటకులు సందర్శించగా.. రూ.64.84 కోట్ల రెవెన్యూ సమకూరింది. 1565లో మొఘల్ చక్రవర్తి అక్బర్ దీనిని నిర్మించారు. 2015 నుంచి 2024 సెప్టెంబర్ వరకు దాదాపు రెండు కోట్ల మంది పర్యాటకులు ఇక్కడకు వచ్చారనీ, రూ.178.83 కోట్ల ఆదాయం వచ్చిందని ఏఎస్ఐ డేటా చెప్తున్నది.

రెండో స్థానంలో కుతుబ్‌మినార్

92 లక్షల మందికి పైగా సందర్శన.. రూ.63 కోట్లకు పైగా ఆదాయం

తాజ్‌మహల్ తర్వాత ఎక్కువ మంది పర్యాటకులు సందర్శించిన మొఘల్‌కాలం నాటి కట్టడంగా రెండోస్థానంలో కుతుబ్‌మినార్ నిలిచింది. పైన తెలిపినట్టుగా ఐదేండ్లలో 92.13 లక్షల మంది పర్యాటకులు దీనిని సందర్శించారు. రూ.63.74 కోట్ల రెవెన్యూను ఇది జనరేట్ చేసింది. ఈ లెక్కన ఇక్కడకు వచ్చే సందర్శకులకు పదేండ్లలో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.178.08 కోట్లు ఆదాయాన్ని తెచ్చిపెట్టినట్టు అంచనా. 12 శతాబ్దంలో కుతుబుద్దీన్ ఐబక్, షంషుద్దీన్ ఇల్‌టుట్‌మిశ్‌లు ఈ కట్టడాన్ని నిర్మింపజేశారు.

హిందూత్వ సంస్థల తప్పుడు ఆరోపణలు

కుతుబ్‌మినార్‌ను కూడా విశ్వహిందూ పరిషద్ (వీహెచ్‌పీ) వంటి హిందూత్వ సంస్థలు వదలలేదు. ఇది 'విష్ణు స్తంభ్' అని వీహెచ్‌పీ ఆరోపించింది. కుతుబ్‌మినార్ కాంప్లెక్స్‌లో హిందూ నిర్మాణాలను తిరిగి చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కాగా, కుతుబ్‌మినార్ కాంప్లెక్స్‌లోని మసీదులు, మినార్లు, ఇతర కట్టడాలను, వాటి నిర్మాణశైలి, నైపుణ్యాన్ని, ఇస్లామిక్ పాలకుల ఘనతను యునెస్కో తన వెబ్‌సైట్‌లో కొనియాడటం గమనార్హం.

రబియా దురాని సమాధి ద్వారా రూ.68 కోట్లకు పైనే..

మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో గల రబియా దురాని సమాధి ఐదోస్థానంలో ఉన్నది. 1660లో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు కుమారుడు ప్రిన్స్ ఆజామ్ షా తన తల్లి దిల్‌రస్ బాను బేగమ్ జ్ఞాపకార్థం ఈ సమాధిని నిర్మించారు. బీబీ కా మఖ్బారాగా దీనికి పేరున్నది. ఈ సమాధిని 2019-24 మధ్య 42.14 లక్షల మంది టూరిస్టులు సందర్శించారు. రూ.68.51 కోట్ల రెవెన్యూ జనరేట్ అయ్యింది.

ఇతర కట్టడాల ద్వారా రూ.42 కోట్లు

ఆర్టీఐ సమాచారం ప్రకారం.. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఏఎస్ఐ కనీసం ఒక డజను కేంద్ర రక్షిత మొఘల్ స్మారక చిహ్నాలకు బాధ్యత వహిస్తుంది. ఇందులో ఖాన్-ఇ-ఖానా, సుల్తాన్‌గర్హీ సమాధి, తుగ్లఖాబాద్ కోట, హుమాయున్ సమాధి, హౌజ్ ఖాస్, సఫ్దర్‌జంగ్ సమాధి, కోట్ల ఫిరోజ్ షా, పురాణా ఖిలా వంటివి ఉన్నాయి. ఈ కట్టడాల వద్ద టిక్కెట్ల అమ్మకం ద్వారా ఐదేండ్లలో రూ.42 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది.

ఇలా మొఘల్ కాలం నాటి కట్టడాల ద్వారా కోట్లాది రూపాయలను పొందుతున్న కేంద్రంలోని బీజేపీ సర్కారు.. నైతిక విలువలు మరిచి వ్యవహరిస్తున్నదని మేధావులు అంటున్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం హిందువులను రెచ్చగొట్టడానికి ముస్లిం పాలకులను దోపిడీదారులుగా, దొంగలుగా చిత్రీకరిస్తున్న బీజేపీ నాయకుల తీరే ఇందుకు నిదర్శనమని చెప్తున్నారు. 1526 నుంచి 1857 మధ్య అత్యధిక కాలం పాలించి భారత ఉపఖండంలో మొఘలులు నిర్మించిన చారిత్రాత్మక కట్టడాలను కూలదోయాలని బీజేపీ చూస్తున్నదని ప్రతిపక్షపార్టీల నేతలు ఆరోపిస్తున్నారు.

65కు చేరిన కల్తీకల్లు బాధితులు



నవతెలంగాణ-నసురుల్లాబాద్

కల్తీకల్లు సేవించి అస్వస్థతకు గురవుతున్న బాధితుల సంఖ్య పెరుగుతోంది. బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో 65 మంది బాధితులు చికిత్స పొందుతుడగా.. ఆర్ఎంపీ, పీఎంపీలు, ఇతర ప్రయివేటు ఆస్పత్రుల్లో పలువురు బాధితులు చికిత్స పొందుతున్నట్టు సమాచారం. కాగా కల్తీకల్లుకు కారణమైన దుర్కి కల్లు డిపోను ఎక్సైజ్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని నసురుల్లాబాద్ మండలం దుర్కిలోని కల్లు డిపో నుంచి బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లోని పలు గ్రామాలకు కల్లు సరఫరా చేయగా.. అది సేవించిన పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సోమవారం 22 మంది బాధితులు ఆస్పత్రుల్లో చేరగా, మంగళవారం ఆ సంఖ్య 65కు పెరిగి బాన్సువాడ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఐదుగురి పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇందులో ఇద్దరి పరిస్థితి మరింత విషాదంగా మారడంతో హైదరాబాద్‌కు తరలించినట్టు సమాచారం. బాన్సువాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్, అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, అధికారులు పరామర్శించి వైద్య చికిత్సలు అందుతున్న తీరుపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

కామారెడ్డి జిల్లా దుర్కి కల్లుడిపో సీజ్



కాగా కల్లు డిపోను మంగళవారం సీజ్ చేశామని బాన్సువాడ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యాదగిరి తెలిపారు. దుకాణంలో ఉన్న 840 లీటర్ల కల్తీ కల్లును స్వాధీనం చేసుకొని, ఆరుగురు నిందితులను గుర్తించి 5 సెక్షన్ల కింద వారిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రధాన నిందితుడు దుర్కికల్లు డిపో యజమాని సురేందర్ గౌడ్ పరారీలో ఉన్నాడని. సురేందర్ గౌడ్ తండ్రి లక్ష్మాగౌడ్‌ను పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈత, తాటి చెట్టు ఎక్కలేని వారికి గీత కార్మిక లైసెన్స్ ఇచ్చి కల్తీకల్లుకు పలువురు ఎక్సైజ్ అధికారులు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కల్తీ కల్లు సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోకుండా, చెట్టు ఎక్కి స్వచ్ఛమైన కల్లు అమ్ముకుంటూ జీవిస్తున్న తమను అక్రమంగా అరెస్టు చేసి బాన్సువాడ ఎక్సైజ్ ఆఫీస్‌కు తీసుకువచ్చారని కొందరు గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. చెట్టు ఎక్కలేని వారు కల్తీకల్లు సరఫరా చేస్తున్న వారికి కొందరు లైసెన్స్ ఇవ్వగా, లైసెన్సు ఇవ్వని వారిని అదుపులో తీసుకొని విచారించడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పోలవరంపై అభ్యంతరాలు

- పీపీఏ దృష్టికి తీసుకెళ్లిన తెలంగాణ
- ముంపు,బ్యాక్ వాటర్స్‌పై అధ్యయనం
- సంయుక్త సర్వేకు నిర్ణయం
- సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు
- తప్పనిసరి చేయాలని విజ్ఞప్తి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ ప్రాంతంలో ముంపు, బ్యాక్ వాటర్స్ ప్రభావం ఉండే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సంయుక్తంగా అధ్యయనం చేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) నిర్ణయించింది. ఈమేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు చేసిన విజ్ఞప్తిని అంగీకరించింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఉన్న అభ్యంతరాలను పీపీఏ ముందు తెలంగాణ అధికారులు స్పష్టంగా చెప్పారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం చైర్మెన్ అతుల్‌జైన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కృష్ణా,గోదావరి భవన్‌లోని పీపీఏ కార్యాలయంలో జరిగింది. తెలంగాణ ఈఎన్సీ జి అనిల్‌కుమార్, ఏపీకి చెందిన ఇద్దరు చీఫ్ ఇంజినీర్లు సుగుణాకర్, నర్సింహ్మమూర్తి ఇందులో పాల్గొన్నారు. పోలవరం పనుల పురోగతి, అంచనా వ్యయం, నిదులు ఇతర అంశాలపై ఈ భేటీలో చర్చించారు. తెలంగాణ ప్రాంత ముంపు, బ్యాక్ వాటర్స్‌పై ఎక్కువసేపు చర్చ చోటుచేసుకున్నట్టు సమాచారం. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణకు ఉన్న అభ్యంతరాలను అధికారులు మరోసారి పీపీఏతో సవివరంగా మాట్లాడారు. పోలవరం పూర్తి నిల్వ సామర్థ్యం గురించి కూడా అధికారులు ప్రస్తావించారు. కిన్నెరసాని, ముర్రేడువాగు, ఇతర ప్రవాహాల చర్యల గురించి కూడా చర్చించినట్టు తెలిసింది. ఖమ్మంతోపాటు భద్రాచలం పట్టణాలపై పోలవరం బ్యాక్ వాటర్స్ ప్రభావం, రామాలయం వద్ద నీటిమట్టం, మణుగూరు భారజల ప్లాంట్ వద్ద వాటర్ లెవెల్స్ అంశంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని రాష్ట్ర అధికారులు మరోసారి అథారిటీని కోరారు. గత సంవత్సరం వరదల ప్రభావం మూలంగా ముంపునకు గురైన నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేస్తే ఆ ప్రభావం తెలంగాణపై ఏ మేరకు ఉంటుందనే విషయాలపై అధ్యయనం చేయాలని తెలంగాణ కోరగా, అందుకు ఏపీ అధికారులు అవసరం లేదని వాదించారు. గతంలో ఉన్న వివరాలే సరిపోతాయని అభిప్రాయపడ్డారు. కాగా సంయుక్త సర్వే చేయాలని పీపీఏ నిర్ణయం తీసుకుంది. ఇదిలావుండగా ఈ సమావేశంలో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని సైతం తెలంగాణ లేవనెత్తింది. అవార్డులు, చట్టాలకు విరుద్ధంగా ఏపీ ముందుకెళ్లకుండా పీపీఏ జోక్యం చేసుకోవాలని తెలంగాణ కోరింది. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి 18 టీఎంసీల ఎత్తిపోతల పథకాన్ని ఏపీ చేపడుతున్నదని తెలంగాణ పీపీఏకు ఫిర్యాదు చేసింది. కేంద్ర జలసంఘం, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు తీసుకున్న తర్వాతే ఏపీ ముందుకెళ్లేలా చూడాలని తెలంగాణ అధికారులు పీపీఏను కోరారు.

తెలుగు రాష్ట్రాల వివాదానికి తెర

(మొదటిపేజీ తరువాయి)

సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ బలగాలు విధులను నిర్వహించాయి. అయితే, కొన్ని రోజులుగా డ్యాం భద్రత విధులను గతంలోలా తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు దళాలకు అప్పజెప్పి తిరిగి వెళ్లనున్నాయని ప్రచారం జరిగింది. కొన్ని నెలల కిందట సాగర్ డ్యాం భద్రత విధుల నుంచి ఉదయం వైదొలిగిన 39వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఒక్క రోజులోనే తిరిగి విధుల్లో చేరింది. నాలుగైదు రోజులుగా నాగార్జునసాగర్ డాం భద్రత విధుల నుంచి తాము వైదొలిగి వెళుతున్నట్టు.. దానికి సంబంధించి ఉత్తర్వులు వస్తున్నట్టు ప్రచారం జరిగింది. మంగళవారం సీఆర్‌పీఎఫ్ ఉన్నత స్థాయి అధికారుల నుంచి ఉత్తర్వులు రావడంతో నాగార్జునసాగర్ డ్యాం తెలంగాణ వైపు విధులు నిర్వహిస్తున్న 39వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ తాము భద్రతా విధులు నుంచి వైదొలుగుతున్నట్టు ఇరిగేషన్ ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం రాత్రి వారి రవాణాకు సంబంధించిన వాహనాలు క్యాంపు కార్యాలయానికి చేరుకోవడంతో సాగర్ నుంచి వెళ్లిపోవడానికి సమాయత్తం అయ్యారు. అయితే, కేంద్ర బలగాలు సాగర్ డ్యాం భద్రతా విధుల నుంచి వైదొలిగిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు బలగాలైన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డ్యాంను తమ ఆధీనంలోకి తీసుకోవాల్సి ఉండగా, ఆంధ్ర వైపున భద్రతా విధులు నిర్వహిస్తున్న 234వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ కేంద్ర బలగాల ఉన్నత స్థాయి అధికారుల ఉత్తర్వుల మేరకు తెలంగాణ వైపు కూడా అంటే నాగార్జునసాగర్ డ్యాంను పూర్తిస్థాయిలో తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. దీంతో నాగార్జునసాగర్ డ్యాం పూర్తిస్థాయిలో ఆంధ్ర ఆధీనంలోకి వెళ్లిందని ప్రచారం జరిగింది. ఈ విషయంలో కేంద్ర బలగాల అధికారులుగానీ, స్థానిక ఇరిగేషన్ అధికారులుగానీ ఏమీ చెప్పలేకపోయారు. ఈ సందర్భంగా స్థానిక ఇరిగేషన్ అధికారులు మాత్రం నాగార్జున సాగర్ డాం నిర్వహణ తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖనే నిర్వహిస్తుందని చెప్తున్నారు. అయితే, కృష్ణా నది యాజమాన్య బోర్డు(కెఆర్ఎంబి) నిర్ణయం మేరకు నాగార్జునసాగర్ డ్యాంపై ఆంధ్ర వైపున భద్రతా విధులు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలే తెలంగాణ వైపు కూడా బాధ్యతలను నిర్వర్తిస్తాయన్నారు.

10 నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

(మొదటిపేజీ తరువాయి)

వల్ల గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. డబుల్ రిజిస్ట్రేషన్లను నివారించడానికి చట్టాన్ని సవరించబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ చట్టంలో కొత్తగా సెక్షన్స్ 22 కి సవరణ చేస్తూ సెక్షన్ 22-బి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒకే సమయంలో ఎక్కువ దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం సమర్పించడం వల్ల జరిగే జాప్యాన్ని నివారించడానికి రోజు వారి పని వేళలను 48 స్లాట్లుగా విభజించడం జరిగిందని చెప్పారు. స్లాట్ బుక్ చేసుకోని వారికోసం అత్యవసర సందర్భాల్లో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు, ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తారనీ, నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులు స్వీకరిస్తారని తెలిపారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న కార్యాలయాల్లో అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామనీ, ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లను నియమించినట్టు పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రీ ఆర్గనైజేషన్ చేస్తున్నామని చెప్పారు. ముందుగా రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట సరూర్ నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధిని విలీనం చేయడం జరిగిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రజలు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా దస్తావేజులను తయారు చేసుకోవడానికి వెబ్ సైట్ లో ఒక మాడ్యూల్ ని ప్రవేశపెట్టామని చెప్పారు. సేల్ డీడ్ దస్తావేజుల కోసమే ఈ సౌకర్యం మొదటి దశలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. దశల వారీగా దీన్ని అన్నింటికి వర్తింపజేస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఇ-సంతకం ప్రవేశపెడుతున్నామనీ, ఈనెల చివరిలోగా అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.



భూకబ్జాలకు పాల్పడినట్టు నిరూపిస్తే..

- రాజకీయ సన్యాసంతో పాటు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా :ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- బీఆర్ఎస్ నాయకులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాటికొండ రాజయ్యకు సవాల్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/ ధర్మసాగర్

తాను భూకబ్జాలకు పాల్పడినట్టు నిరూపిస్తే.. రాజకీయ సన్యాసంతో పాటు తన ఎమ్మెల్యే పదవికీ రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ నాయకులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాటికొండ రాజయ్యకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ విసిరారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లా రాజేశ్వర్ రెడ్డి, రాజయ్య.. ఇద్దరూ కలసి రెవెన్యూ, అటవీ అధికారులను, రైతులను, మీడియా మిత్రులను తీసుకెళ్ళి ప్రజలందరి సమక్షంలో మీరే విచారణ చేపించండిని, మీ విచారణలో కడియం శ్రీహరి 2,000 ఎకరాలు కబ్జా చేశాడని తేలితే, తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మీ ఇండ్లలో గులాంగా పనిచేస్తానని తెలిపారు. నిరూపించకపోతే వారు తన ఇంట్లో గులామ్‌లుగా పని చేయాలన్నారు. ఈ సవాల్‌ను స్వీకరించండి, లేదంటే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ సవాల్, ప్రతిసవాళ్లు.. సోషల్ మీడియాలో హల్‌చల్ సృష్టించడంతో కడియం శ్రీహరి వర్గీయులు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాటికొండ రాజయ్య వర్గీయుల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో మండల ప్రజలు ఏది నిజమో, ఎంతవరకు ఎవరు ఎవరిది నిజమనేది తేల్చుకోలేక అయోమయానికి గురవుతున్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

2025 -26 అకడమిక్ నుంచి పూర్తి స్థాయిలో కోడింగ్ కోర్సులు

- టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి డాక్టర్ వీఎస్ అలగు వర్షిణి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గురుకులాల్లో 2025-26 అకడమిక్ నుంచి 238 పాఠశాలల్లో పూర్తి స్థాయిలో కోడింగ్ కోర్సుల శిక్షణ ఇవ్వనున్నట్టు టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి డాక్టర్ అలగు వర్షిణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు , వీలైనంత త్వరగా జీవితంలో మంచి హోదా , ఉజ్వల భవిష్యత్తుతో పాటు మంచి వేతనం ఉన్న ఉద్యోగాలవైపు ఇప్పటి యువత దృష్టి సారించిందని తెలిపారు. విద్యార్థుల అభిరుచులకనుగుణంగా టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ విద్యాసంస్థల్లో కోడింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. గతేడాది కేవలం ఒక్క మొయినాబాద్ పాఠశాలలో మాత్రమే ఈ కోడింగ్ శిక్షణ ఉండేదనీ, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విస్తరిచేందుకు కృషి జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ శిక్షణకు లండన్‌కు చెందిన ఆర్‌పీఎఫ్‌తో ఐదేళ్లకు గాను గురుకుల సంస్థతో ఒప్పందం (ఎం ఓ యూ) కుదుర్చుకుందని తెలిపారు.

మయన్మార్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసులు

- చెర నుంచి విముక్తి కల్పించాలని మహముత్తారం మండల వాసులు
- ఇండియాకు రప్పించాలని బాధిత కుటుంబాల వినతి

నవతెలంగాణ-మల్హర్ రావు(మహముత్తారం)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహముత్తారం మండలానికి చెందిన లావుడ్యా విజయ్, అజ్మీరా సంతోష్.. మయన్మార్ ఆర్మీ చేతిలో బందీలుగా ఉన్నారని, వారిని ఇండియాకు రప్పించాలని వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బాధిత కుటుంబ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. మహముత్తారం మండలంలోని నిమ్మగూడెం, దొబ్బలపాడు గ్రామాలకు చెందిన విజయ్, సంతోష్.. గతేడాది డిసెంబర్‌లో బతుకుదెరువు కోసం థాయిలాండ్‌లోని మయన్మార్‌కు వెళ్లినట్టు తెలిపారు. అక్కడ ఒక నెల తర్వాత కావాలని వారితో సైబర్ క్రైమ్ చేయించి ఆర్మీకి అప్పగించినట్టు చెప్పారు. వారు ఆర్మీ ఆధీనంలో ఉన్నారన్న విషయాన్ని తమకు ఆలస్యంగా సమాచారం ఇచ్చారన్నారు. అక్కడ ఆరోగ్యం బాగాలేదని, తిండి లేక పస్తులు ఉంటున్నామని బాధితులు ఫోన్‌లో తెలిపినట్టు తెలిపారు. ఉపాధి కోసం వెళ్లిన ఇద్దరిని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి చొరవ చూపి స్వగ్రామానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

పదిగంటలకుపైగా శ్రవణ్‌రావు విచారణ

- ఫోన్‌లలో లభించిన సమాచారంపైనే ప్రశ్నల వర్షం
- కీలక ప్రశ్నలకు మౌనమే సమాధానం
- తిరిగి విచారణ చేయాలని యోచిస్తున్న స్పెషల్ టీమ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడైన ఐ న్యూస్ సీఈఓ శ్రవణ్‌రావును జూబ్లీహిల్స్ ప్రత్యేక దర్యాప్తు టీమ్ అధికారులు మంగళవారం పదిగంటలకుపైగా విచారించారు. ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయానికి వచ్చిన శ్రవణ్‌రావును మొదట రెండు గంటల పాటు విచారించిన అధికారులు..తర్వాత గంట విరామం ఇచ్చారు. ఆ తర్వాత సుదీర్ఘ సమయం పాటు విచారణ జరిపారు. రాత్రి 10:05 వరకు శ్రవణ్‌రావును పలు కోణాల్లో అధికారులు ప్రశ్నించారు. ముఖ్యంగా నాలుగురోజుల క్రితం శ్రవణ్‌రావు నుంచి స్వాధీనం చేసుకున్న రెండు సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరీక్షించారు. పాత డాటాను సేకరించారు. అందులోనే తేలిన అంశాలపై అధికారులు ప్రశ్నల వర్షం కురిపించినట్టు తెలిసింది. ముఖ్యంగా 2023లో అప్పటి మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా కొందరు అధికారులు, ప్రభుత్వంలోని కీలక నేతలు ఇచ్చిన ఫోన్ నెంబర్ల ఆధారంగా ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడినట్టు ఆయన్ను నిలదీసినట్టు తెలిసింది. పైస్థాయి నుంచి వచ్చిన ఫోన్‌నెంబర్లను అప్పటి ఎస్ఐబీలోని ప్రణీత్‌రావుతో పాటు మరికొందరు అధికారులను పిలిచి ట్యాపింగ్ జరిపింది వాస్తవమేనా? అని స్పెషల్ టీమ్ అధికారులు ఆయన్ను సూటిగా ప్రశ్నించినట్టు తెలిసింది. ఆ వచ్చిన సమాచారాన్ని అప్పటి ఎస్ఐబీ ఐజీ ప్రభాకర్‌రావుతో పాటు ప్రభుత్వంలోని కొందరు కీలక నేతల్లో ఎవరికి సమాచారాన్ని అందజేశారనే విషయంపైనా అధికారులు సమాధానాలను రాబట్టే ప్రయత్నం చేసినట్టు తెలిసింది.

చాలా వరకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఇటు పోలీసు అధికారులకు, అటు రాజకీయ నేతలకు మధ్యవర్తిగా శ్రవణ్‌రావు వ్యవహరించారని స్పెషల్ టీమ్ అధికారులు అనుమానిస్తున్నారు. శ్రవణ్‌రావుకు చెందిన ఫోన్లలోని నార్మల్, వాట్సాప్ మెసేజ్‌లతో పాటు పలువురి ప్రముఖులకు చెందిన ఫోన్ నెంబర్లను అధికారులు పరిగణనలోకి తీసుకుని వాటి ద్వారా శ్రవణ్‌రావు పాల్పడ్డాడని భావిస్తున్న ఫోన్ ట్యాపింగ్‌లపై అధికారులు నిశితంగా ఆరా తీసినట్టు తెలిసింది. అధికారులు వేసిన పలు కీలక ప్రశ్నలకు శ్రవణ్‌రావు మౌనమే సమాధానమన్నట్టు వ్యవహరించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో మరోసారి విచారణకు కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకోవాలని కూడా అధికారులు యోచిస్తున్నట్టు తెలిసింది. ఏదేమైనప్పటికీ మొదటిసారి ఏడుగంటలు, రెండో సారి గంటపాటు మూడోసారి పదిగంటలకుపైగా శ్రవణ్‌రావును విచారించిన అధికారులు కొద్దిమేరకు తమకు అవసరమైన సమాచారాన్ని రాబట్టినట్టు తెలిసింది. విచారణ అనంతరం మంగళవారం రాత్రి పది గంటల తర్వాత ఆయన్ను పంపించిన అధికారులు తిరిగి విచారణకు పిలవాలా? ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే విషయంపై ఉన్నతాధికారులతో సంప్రదించినట్టు తెలిసింది.

టారిఫ్‌లపై 'మోడీ' మౌనం

(మొదటిపేజీ తరువాయి)

సెన్సార్ విధించింది. అమెరికా వంటి నిరంకుశ ఆధిపత్య శక్తుల నుంచి అవమానాలు ఎదురైనప్పుడు భారత సార్వ భౌమత్వాన్ని కాపాడుకోవడంలో మన అసమర్థతను ఇలాంటి ఉదంతాలు బయటపెడతాయి. భారత ప్రభుత్వ నిష్క్రియాపరత్వానికి ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తున్నాయి. మన పాలక వర్గాలు, వాటి రాజకీయ యంత్రాంగం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు విధేయులుగా వ్యవహరిస్తున్నాయి. సమకాలీన రాజకీయ వ్యవస్థను సరిగా అర్థం చేసుకోవడంలో మన వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సవాలు చేయడంలో మన పాలక పార్టీలు ఘోరంగా విఫలమవుతున్నాయి. ఇదిలావుంటే ట్రంప్ విధించిన సుంకాలు మనకు మేలు చేస్తాయని వాదించే నయా ఉదారవాదులు కూడా ఉన్నారు. ట్రంప్ ప్రారంభించిన సుంకాల యుద్ధం భారత్ ఏకపక్షంగా తన సొంత సుంకాలను తగ్గించుకునే అవకాశాన్ని అందిస్తుందన్నది వారి వాదన. అలాంటి తగ్గింపు దేశీయంగా పోటీని పెంచుతుందని, తద్వారా దేశ ఆర్థిక సామర్థ్యం మెరుగుపడుతుందని వారు చెబుతున్నారు. అయితే ఇది తర్కానికి నిలవని వాదన. బేషరతుగా సుంకాలను తగ్గించడం మెరుగైన ఫలితాలను ఇస్తే ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ అమెరికా వాటిని పెంచాలని ఎందుకు అనుకుంటుంది?

భారత్ కిమిర్‌నాస్తి

అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా భారత్ కూడా ప్రతీకార సుంకాలు విధించడం అవివేకమని కొందరి వాదన. దీనిని లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ ఆదాయంలో అమెరికా ఆర్థిక వ్యవస్థతో పోలిస్తే మన వాటా తక్కువే. అయినప్పటికీ ప్రపంచ వాణిజ్యంలో భారత ఎగుమతి దిగుమతుల వాటా మాత్రం తక్కువేమీ కాదు. కాబట్టి భారత్ తన ఎగుమతి దిగుమతుల ధరలను పాక్షికంగా నిర్ణయించుకోవచ్చు. ట్రంప్ మొదలెట్టిన వాణిజ్య యుద్ధానికి బలమైన ప్రతిస్పందనను సిద్ధం చేయడానికి బ్రిక్స్ వంటి వేదికలను భారత్ ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. అయితే బ్రిక్స్ చైనా ఆధిపత్యంలో ఉన్నదని, రెండు దేశాల ప్రయోజనాలు భిన్నంగా ఉన్నాయని కొందరు వాదిస్తున్నారు. అయితే ఇందులో ఏ మాత్రం పస లేదు. వాస్తవానికి అది చైనా, భారత్ మధ్య వాణిజ్య పరమైన అవరోధాలు సృష్టించేందుకు జరిపే ప్రయత్నం. ఇలాంటి వాదనలు అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యానికి సంబంధించి మన దేశం యొక్క బేరసారాల సామర్థ్యాన్ని బలహీనపరుస్తాయి.

అమెరికా మార్కెట్‌పై ఆధారపడే వైఖరినా..?

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించేందుకు మన ప్రభుత్వం ప్రయత్నించాల్సి ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి అమెరికా డిమాండ్లకు లొంగిపోతే రైతులు, వ్యవసాయ కార్మికులు మరింత పేదరికంలోకి వెళ్లిపోతారు.

తక్షణమే వెళ్లిపోండి...



శ్వేతసౌధం : అమెరికాలోని స్థానికేతరులు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ యంత్రాంగం.. స్వయంగా దేశం విడిచి వెళ్లిపోవాలని హెచ్చరిస్తోంది. తక్షణమే దేశం వీడాలని, లేదంటే చర్యలు తప్పవని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) నుంచి ఆదేశాలు వెలువడుతున్నట్టు సమాచారం. ఆదేశాలు వచ్చిన తర్వాత దేశాన్ని వీడకుంటే రోజుకు రూ.86వేల జరిమానా విధించనున్నారట. జరిమానా చెల్లించకుంటే వారి ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది.

ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులపై మరింత దూకుడుగా వ్యవహరిస్తున్న హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం.. సెల్ఫ్ డిపోర్టేషన్ యాప్ (సీబీపీ) ద్వారా నమోదు చేసుకొని వెళ్లిపోవాలని సూచిస్తోంది. స్వీయ బహిష్కరణ సురక్షితమని, లేదంటే పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని డీహెచ్ఎస్ అధికార ప్రతినిధి ట్రిసియా మెక్‌లాలిన్ మీడియాతో పేర్కొన్నారు. తుది ఆదేశాలు అందుకున్న తర్వాత కూడా దేశం వీడిపోకుంటే భారీ జరిమానా తప్పదన్నారు.

రోజుకు 998 డాలర్లు..

సెల్ఫ్‌డిపోర్టేషన్‌కు సంబంధించి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం మార్చి 31న సోషల్ మీడియాలో కీలక సమాచారాన్ని వెల్లడించింది. తమ తనిఖీల్లో పట్టుబడితే క్రమబద్ధీకరణకు ఎటువంటి అవకాశం ఉండదని, అప్పటివరకు సంపాదించుకున్న డబ్బును కూడా నష్టపోవాల్సి వస్తుందని తెలిపింది. బహిష్కరణ ఆదేశాలు అందుకున్న తర్వాత వెళ్లిపోని వారు రోజుకు 998 డాలర్ల జరిమానా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. సెల్ఫ్‌డిపోర్ట్ యాప్‌లో నమోదు చేసుకున్న తర్వాత దేశాన్ని వీడకుంటే వెయ్యి నుంచి ఐదు వేల డాలర్ల జరిమానా ఉంటుందని తెలిపింది. భవిష్యత్తులో అమెరికాకు తిరిగి వచ్చే అవకాశాన్ని కోల్పోతారని, జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

ఆ చట్టం ప్రకారం..

డోనాల్డ్ ట్రంప్ గతంలో అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే ఈ జరిమానాలకు సంబంధించి 1996లో తీసుకువచ్చిన చట్టాన్ని తొలిసారి అమలు చేశారు. తొమ్మిది మంది అక్రమ వలసదారులకు భారీ జరిమానా విధించినప్పటికీ.. అందులో కొందరిపై ఉపసంహరించుకున్నారు. ట్రంప్ తర్వాత అధికారం చేపట్టిన బైడెన్, జరిమానాలు విధించడాన్ని నిలిపివేశారు. ఈ తరహా ఫైన్లను కోర్టులో సవాలు చేసే అవకాశం ఉన్నప్పటికీ పెద్దగా ప్రయోజనం లేదని నిపుణుల అంచనా. అయితే, ఈ చట్టాన్ని అమలు చేయడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం కాదని, కేవలం భయాన్ని కలిగించడమేనని బైడెన్ హయాంలో పనిచేసిన ఇమిగ్రేషన్ నిపుణులు చెబుతున్నారు.

బీజేపీ డీఎన్‌ఏనే బీసీలకు, దళితులకు వ్యతిరేకం

అసెంబ్లీలో జ్యోతిబాఫూలే విగ్రహం ఏర్పాటు చేయాలి



- బీసీల బిల్లుల ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలి : తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ - ముషీరాబాద్

బీజేపీ డీఎన్ఏనే బీసీలకు, దళితులకు వ్యతిరేకమని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలపై వివక్ష కొనసాగుతున్నదని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. అసెంబ్లీలో జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ (యూపీఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనేవి కేవలం మాటల్లోనే ఉన్నాయన్నారు. దళిత నేత, రాజస్థాన్ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎమ్మెల్యే టికారాం జుల్లి ఇటీవల శ్రీరామనవమికి రాముడి గుడికి వెళ్తే గుడి మైలపడిందని సంప్రోక్షణ చేశారని తెలిపారు. అటువంటి దౌర్భాగ్యమైన పరిస్థితి దేశంలో ఉండటం దురదృష్టకరమన్నారు. బాన్సువాడ ప్రాంతంలో ఒక చాయ్ దుకాణంలో రెండు గ్లాసుల పద్ధతి ఉందని, బీసీలు, ఎస్సీలకు వేరే కప్పుల్లో చాయ్ పోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకే కాదు బీసీలకు కూడా ఇప్పటికీ అవమానాలు జరుగుతున్నాయని తెలిపారు. బీసీల కోసం ఎందుకు ధర్నాలు చేస్తున్నారని కొంత మంది ప్రశ్నిస్తున్నారని.. బీసీల సమస్యల పట్ల ఆవేశం, ఆవేదన నుంచి పుట్టికొచ్చినవే ఈ ధర్నాలు అన్నారు. ఈడబ్ల్యూఎస్ అమలుతో 50 శాతం రిజర్వేషన్ పరిమితి తొలగిపోయింది కాబట్టి 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించినా కోర్టులు అడ్డుకోలేవన్నారు.

కుల వివక్షకు వ్యతిరేకంగా జ్యోతిబాపూలే తీవ్ర కృషి చేశారని తెలిపారు. ఏప్రిల్ 11న జోతిబాపూలే జయంతి రోజున ఆయన విగ్రహాన్ని అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం పక్కన పెట్టాలని డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్ బిల్లు పంపి ఉంటే అపాయింట్‌మెంట్ వస్తుండేనని, బీజేపీతో లాలూచీ లేకపోతే బిల్లు ఆమోదమయ్యే విధంగా చూడాలని కోరారు. కుల గణన నివేదిక అసెంబ్లీలో పెట్టాలని డిమాండ్ చేశారు.

కుల గణనను ఏఐ ద్వారా తేల్చడం ఏంటని, ఏఐ అంటే అనుముల ఇంటెలిజెన్స్ అని ఎద్దేవా చేశారు. అనుముల ఇంటెలిజెన్స్‌తో హెచ్‌సీయూ విద్యార్థులను కూడా మోసం చేస్తున్నారని ఆరోపించారు. కర్నాటకలో పదేండ్ల కిందట కుల గణన చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. ఈ ధర్నా శాంపుల్ మాత్రమేనని, అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. మీలా దొంగ దీక్షలు, దొంగ ధర్నాలు చేయబోమన్నారు. బీసీ రిజర్వేషన్లపై న్యాయంగా పోరాడితే వారితో కలిసి పోరాటానికి సిద్ధమని తెలిపారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ మరకను తుడిచేయడానికి బీసీలపై కపట ప్రేమ

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తేజ గౌడ్



నవతెలంగాణ - ముషీరాబాద్

ఎమ్మెల్సీ కవిత తనపై పడిన లిక్కర్ మార్కను తుడిచేయడానికి బీసీ నినాదం ఎత్తుకున్నారని వారిపై కపట ప్రేమను చూపిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తేజ గౌడ్ అన్నారు. అసెంబ్లీ ఆవరణలో జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు కై ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద ఏర్పాటుచేసిన ధర్నాపై పత్రికా ప్రకటన ద్వారా స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. పది సంవత్సరాల మీ పాలనలో బీసీలను ఎప్పుడెప్పుడు అనగదొక్కాలని చూశారు తప్ప బీసీలకు ఏ విధంగా న్యాయం చేశారో చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ కవిత తమపై పడిన లిక్కర్ కేసు మరకను బీసీ నినాదంతో తొలగించుకోవాలని చూస్తే ప్రజలు అంత అమాయకులు కాదని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం కాలంలోనే జనగణలో కులగన చేసి దానిని అసెంబ్లీ సాక్షిగా బహిర్గతం చేశారన్నారు. కెసిఆర్ పాలనలో సకలజనుల సర్వేలో లెక్కలను ఎందుకు బహిర్గతం చేయలేదో తెలుపాలన్నారు. తమ పాలనలో గుర్తుకురాని మహనీయులు అంబేద్కర్ జ్యోతిబాపూలే అధికారం పోగానే ఇప్పుడు గుర్తుకు వచ్చారని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఆనాడు ఎందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదని ఆ మహనీయులను రాజకీయ స్వార్థం కోసం వాడుకోవడం తప్ప మీరు చేసింది ఏంటని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే బీసీ ఎస్సీ ఎస్టీలకు సముచిత న్యాయం జరుగుతుందని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్లో ప్రవేశపెట్టడానికి నడుం బిగించామని పార్లమెంట్లో బీసీ రిజర్వేషన్ లు సాధించి తీరుతామన్నారు. కెసిఆర్ పాలనలో ధర్నా చౌక్ ను ఎత్తివేసిన ఘనత తమరిదని ఇప్పుడు ఏం మొహం పెట్టుకొని ధర్నాకు దిగారని ప్రశ్నించారు. ఇక బీసీ ఎస్సీ ఎస్టీలను రాజకీయ పబ్బం గడుపుకోవడానికి వాడుకుంది చాలని వారి అభ్యున్నతి కోసం కలిసి పోరాటం చేయడానికి ముందుకు రావాలని కోరారు.

శ్మశానవాటికలో చెత్త డంపింగ్

- దుర్గంధంపై హైడ్రాకు స్థానికుల ఫిర్యాదు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హిందూ శ్మశానవాటికను రామ్‌కీ సంస్థ కబ్జా చేసి అందులో చెత్త డంపింగ్ చేయడంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మచ్చబొల్లారం రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జేఏసీ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో మచ్చ బొల్లారంలోని డంప్‌యార్డ్‌ను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నంబర్ 199లో మొత్తం 15.19 ఎకరాల స్థలాన్ని హిందూ శ్మశానవాటికకు కేటాయించగా, ఆ స్థలంలో రామ్‌కీ సంస్థ చెత్త డంపింగ్ చేయడాన్ని, అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. స్థానికులు కమిషనర్ పర్యటనలో పాల్గొన్నారు. మహిళలు కూడా వచ్చి సమస్యలు వివరించారు. ఇదే విషయంపై స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నుంచి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో సమస్యను పరిశీలించి, పరిష్కార మార్గాలు చూపాలని తనతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారని హైడ్రా కమిషనర్ మీడియాకు తెలిపారు. రామ్‌కీ సంస్థకు రెండెకరాల స్థలం కేటాయించినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అయితే, ఇక్కడున్న ప్రభుత్వ భూమి మూడు నాలుగు ఎకరాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించినట్టు చెప్పారు. తక్షణమే నిర్మాణాలను ఆపేయాలని రామ్‌కీ సంస్థను ఆదేశించామని, ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూస్తామని తెలిపారు. జనావాసాల మధ్య చెత్త డంపింగ్ యార్డును నిర్వహి స్తుండటంతో ఇబ్బందికర పరిసితులు నెలకొన్నాయన్నారు. చెత్త డంపింగ్ యార్డును తరలించాలన్న స్థానికుల ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కమిషనర్ చెప్పడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సీపీఎస్‌ను రద్దు చేయండి

ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించండి : మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటికి ఉద్యోగ జేఏసీ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, విప్ ఆది శ్రీనివాస్‌ను వేర్వేరుగా మంగళవారం హైదరాబాద్‌లో ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని 51 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను చెల్లించాలని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 57 సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, ఉద్యోగులు, పెన్షనర్ల సమాన సహకారంతో ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)ను అమలు చేయాలని కోరారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులకు 24 శాతం హెచ్ఆర్ఏను మంజూరు చేయాలని సూచించారు. స్పెషల్ టీచర్లకు (రూ.398) నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. వికలాంగుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనీ, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని పేర్కొన్నారు. 317 జీవోను సమీక్షించి బాధిత ఉద్యోగుల బదిలీల కోసం సూపర్ న్యూమరరీ పోస్టులను కల్పించి వీలైనంత త్వరగా స్థానికత కోల్పోయిన వారిని సొంత జిల్లా, జోన్‌కు కేటాయించాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ నిబంధనలను అమలు చేయాలని తెలిపారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ కో చైర్మెన్ జి సదానందంగౌడ్, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ, ఎ సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి బి శ్యామ్, నాయకులు రాధాకృష్ణ, తిరుపతి, ఎంబి కృష్ణ యాదవ్, రామారావు, శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఓ నెం 21ని రద్దు చేయాలి

విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ అధ్యాపకుల ధర్నా

ఒప్పంద అధ్యాపకులందర్నీ పర్మినెంట్ చేయాలని డిమాండ్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్ / వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీఓ నెం 21ని రద్దు చేయాలని, 12 విశ్వవిద్యాలయాల్లోని 1270 మంది కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు చేశారు. హైదరాబాద్ కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో, వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు అధ్యాపకులు తరగతులను బహిష్కరించారు. కోఠి మహిళా విద్యాలయం (బ్రిటిష్ రెసిడెన్సి) దర్బార్ హాల్ వద్ద ధర్నాలో విశ్వవిద్యాలయం కాంటాక్ట్ అధ్యాపకుల జేఏసీ కన్వీనర్ ఉపేందర్‌రావు మాట్లాడారు. కొత్తగా అధ్యాపకుల నియామకాల కోసం ప్రభుత్వం ఇచ్చిన జీఓ 21ను రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న 1270 మంది అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల సేవలను పూర్తి స్థాయిలో పర్యవేక్షించిన తర్వాతే మాత్రమే కొత్త నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో 25 నుంచి 30 ఏండ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో చాలీచాలని వేతనాలతో అధ్యాపకులు సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో రెగ్యులర్ అధ్యాపకుల సంఖ్య సుమారు 700 ఉంటే.. కాంట్రాక్టు అధ్యాపకుల సంఖ్య 1270 ఉందని వివరించారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏండ్లు కావస్తున్నా ఇంకా ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీ చట్టం 1994ను అనుసరిస్తున్నారని, ప్రత్యేకంగా తెలంగాణ యూనివర్సిటీల చట్టం తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ వినీత పాండే, డాక్టర్ రజిని, డాక్టర్ సనత్, డాక్టర్ రవి, డాక్టర్ సునీత, జ్యోతి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ కృష్ణాజి, డాక్టర్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ ఆనంద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీలో..

కాకతీయ విశ్వవిద్యాలయం ప్రధాన పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏప్రిల్ 4వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ కర్నాకర్‌రావు, డాక్టర్ శ్రీధర్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యా పకులను రెగ్యులరైజ్ చేయాలని గతంలో అనేకసార్లు గత ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. ఈ విషయంపై ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి రాగానే అమలు చేయకపోగా జీఓ 21ని విడుదల చేసిందని అన్నారు. దీని వల్ల ఒప్పంద అధ్యాపకులకు ఎలాంటి లాభం చేకూరదని, దాన్ని వెంటనే రద్దు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతోపాటు యూజీసీ సెవెంత్ పే బేసిక్, డీఏ, హెచ్ఆర్ఏ, 3 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ సమ స్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ధర్నా అనంతరం యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి స్పందిస్తూ.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఒప్పంద అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ ధూల్‌పేట్‌లో 102 కేసుల నమోదు

- 327 అరెస్ట్, 13 మంది బైండోవర్ :

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ వివి.కమలాసన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆపరేషన్ ధూల్‌పేట్ కార్యక్రమంలో 102 కేసులు నమోదు చేసి, 425 మందిని నిందితులుగా చేర్చామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ. కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఇందులో 327 మందిని అరెస్ట్ చేయగా, మరో 85 మంది తప్పించుక తిరుగుతున్నారని తెలిపారు. వారందరిని త్వరలో పట్టుకుంటామని పేర్కొన్నారు, అపరేషన్ ధూల్‌పేట ప్రారంభించిన 250 రోజుల్లో గంజాయి, డ్రగ్స్‌ను 90 శాతం అరికట్టామని తెలిపారు. భవిష్యత్‌లో ఈ ప్రాంత యువత మత్తు పదార్థాల అమ్మకం, రవాణా జోలికి పోకుండా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ధూల్‌పేట్‌లో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి దాడులు నిర్వహించామని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధి వరకు ఈ ఆపరేషన్‌ను విస్తరిస్తున్నట్టు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, హెచ్‌టీఎఫ్, డీటీఎఫ్ బృందాలను ఈ ఆపరేషన్‌ను నిరంతర పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు.

ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరగాలి

- రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరగాలని రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి అభిప్రాయపడ్డారు. పైలట్ ప్రాజెక్టు కింద రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని గడ్డమల్లయ్య గూడెం, చౌదరిగూడ, మొండిగౌరెల్లి గ్రామాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఇప్పటికే అధికారులు ఆయా గ్రామాల్లో అధికారులు పనులు ప్రారంభించారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్టును విజయవంతం చేసేందుకు త్వరలో కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. రైతులను ఉద్యానవన పంటల వైపు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఆ పంటలకు రాయితీలపై యాంత్ర పరికరాలు, బిందుసేద్యం పరికరాలను సమకూర్చుతామని వెల్లడించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, గడుగు గంగాధర్ తోపాటు మెంబర్ సెక్రెటరీ గోవిందు వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్, నాబార్డ్ అధికారులు, కమిషన్ డీపీవో సంధ్యారాణి, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్, ఎన్జీవోల ప్రతినిధులు హాజరయ్యారు.

గర్భిణులకు పోషకాలు అవసరం..



నవతెలంగాణ-ధూల్‌పేట్

గర్భిణీ మహిళలకు పోషకాలు అవసరమని అందుకను గుణంగా ఆహారం తీసుకోవాలని నాంపల్లి ప్రాజెక్ట్ అధికారి వెంకటస్వామి అన్నారు. బేగం బజార్ డివిజన్ ప్రాంతంలోని నగర్ సెక్టార్ గౌలిగూడ చెమన్ లోని అంగన్వాడీ సెంటర్‌లో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా ఉన్నటి వంటి అంగన్వాడీ సెంటర్ టీచర్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక బేగం బజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ కృష్ణ చైతన్య, సూపర్‌వైజర్ సునీత, బీజేపీ నాయకులు పాండు యాదవ్, కాంగ్రెస్ నాయకులు సతీష్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ప్రతి గర్భిణీ మహిళలకు సమయానికి ఆహారం తీసుకోవాలన్నారు. సంజయ్ నగర్ ఫీలఖానా, వాల్మీకి నగర్, మొగురం బస్తీ, ఇందిరానగర్ లకు సంభందించిన పిల్లలు వారి తల్లీ తండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు విద్యావతి, వనిత టాఖుర్, నాగలక్ష్మి, అర్చన, లక్ష్మి, శ్రీలక్ష్మి, ఆశ వర్కర్ లు బసంతి, కౌర్ సింగ్, జ్యోతి పాల్గొన్నారు.

ఈత సరదాకు ఇద్దరు బలి



నవతెలంగాణ-శామీర్‌పేట

సరదాగా ఈతకు వెళ్లి చెరువులో మునిగి విగత జీవులైన ఇద్దరు యువకులు శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. మంగళవారం కూకట్‌పల్లి, ఆల్విన్ కాలనీ, ఎల్లమ్మబండకు చెందిన పదిమంది స్నేహితులు జెప్టోలో డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. 7న (సోమవారం) శామీర్‌పేట కట్ట మైసమ్మ టెంపుల్‌కి వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. శామీర్‌పేట పెద్ద చెరువు కాలువ వద్ద మద్యం సేవించారు. కృష్ణ (32) యశ్వంత్ (24)లు సరదాగా ఈత కోసమని కాలువలో దిగారు. ఇద్దరికీ ఈతరానందున కొంచెం లోపలికి వెళ్లి ఒకరి చేతిని ఒకరు పట్టుకొని మునిగిపోయారు. గమనించిన వారి స్నేహితులు వెంట నే ప్రవీణ్, విష్ణులు వారిని బయటికి తీయడానికి ప్రయత్నించి చివరకు బయటకు తేలియున్న యశ్వంత్‌ను మాత్రమే బయటికి తీశారు అప్పటికే యస్వంత్ మృతి చెందాడు. పోలీసులు గజఈతగాళ్ళ సహాయంతో కృష్ణను కాలువలో నుండి బయటకు తీశారు. ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమ్మిళిత ప్రగతి పట్ల దృష్టి సారించాలి

- ఆచార్య శ్రీనివాస రెడ్డి



నవతెలంగాణ-ధూల్‌పేట్

సమ్మిళిత ప్రగతి పట్ల దృష్టి సారించాలని అరోరా బిజినెస్ స్కూల్ డీన్ ఆచార్య శ్రీనివాసరెడ్డి అన్నారు. సిటీ కాలేజీ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు ఐసీఎస్ఎస్ఆర్ సహకారంతో క్షేత్ర స్థాయిలో మహిళల నాయకత్వం సమగ్ర అభివృద్ధి, ప్రభావవంతమైన పాలన, లింగ సమానత్వంపై ప్రభావం, సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎంత ప్రగతి సాధించినా అందరినీ కలుపుకోవడంలో మనం వైఫల్యం చెందుతున్నామన్నారు. మహిళల సాధికారిత అనేక సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. మనందరం పితృస్వామ్య వ్యవస్థలో కూరుకు పోతున్నామని, ప్రతి మతంలో ఈ భావనలు ఉన్నాయన్నారు. పీర్జాదిగూడ కార్పొరేటర్ స్వాతి గౌడ్ మాట్లాడు తూ.. గతంలో కంటే సమకాలీన సమాజంలో మహిళల పాత్ర పెరుగుతుందన్నారు. మహిళలు ధైర్యంగా రాజకీయాల్లో రాణించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు వెంకటేష్ తమ కీలకోపన్యాసంలో స్థానిక సంస్థల నుండి పార్లమెంటు వరకు మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరిగితేనే సామాజిక ప్రగతి వేగవంతమవుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ.. ఈ కాలానికి అవసరమైన, ప్రసంగికత కలిగిన అంశంపై సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్.తిరుపతి మాట్లాడు తూ.. క్షేత్రస్థాయి నుండి మహిళలు అన్ని రంగాలలో ముందడుగు వేయాలన్నారు. ప్రారంభ సభను డాక్టర్.భాస్కర్ సమన్వయం చేయగా డాక్టర్.శంకర్ కుమార్, శాంతి, డా.శ్రీనివాస్, డా. సుదక్షణ, డా.భూపాల్, డా.శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పోషణ పక్షోత్సవాలు షురూ

- 22 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు కార్యక్రమాల నిర్వహణ
- పోషకాహారం విలువలను తెలియజేసేలా ప్రజల్లో అవగాహన
- 917 కేంద్రాల్లో 1.59లక్షల మంది లబ్దిదారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడంతో చిన్నారులు ఆరోగ్యంగా పెరుగుతారు. బలమైన ఆహారంతోనే గర్భిణుల్లో రక్త హీనత, ఇతర ఆరోగ్య సమస్యలు దారిచేరవు. ఇది పూర్తిస్థాయిలో పక్కగా జరిగినప్పుడే మెరుగైన ఫలితాలు ఉంటాయి. ఇదే లక్ష్యంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పక్షం రోజులపాటు 'పోషణ పక్షం' అనే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పోషకాహారం విలువలను తెలియజేసేలా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టనుంది. తద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పూర్తి స్థాయిలో పోషకాహారం అందేలా చర్యలు తీసుకోనున్నారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ



కేంద్రాలు మొదలుకుని, అన్ని మండల, వార్డుల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈనెల 22తో ఈ పక్షోత్సవాలు ముగుస్తాయి.

నాలుగు థీమ్‌లుగా..

పక్షం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలు ఈ ఏడాది 'మొదటి వెయ్యి రోజులపై దృష్టి' అనే థీమ్ ప్రామాణికంగా కొనసాగనున్నాయి.మొత్తం నాలుగు థీమ్‌లుగా.. ప్రతిరోజు ఓ కార్యక్రమం చొప్పున గర్భిణులకు బరువులు చూడటం, రెండేండ్ల కంటే తక్కువ వయసున్న పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, మొదటి 1000 రోజులపై అవగాహన, తల్లిపాల ప్రాముఖ్యత, కౌమార దశలోని బాలికలు, 6 ఏండ్లలోపు పిల్లల రక్తహీనతపై అవగాహన కల్పిస్తారు. పోషణ పండుగ ప్రతిజ్ఞ, కూరగాయల దినోత్సవం, పరిసరాల పరిశుభ్రతపై, విద్యార్థులకు పోటీ పరీక్షల నిర్వహణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. అంగన్‌వాడీ టీచర్లతో పాటు, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, ఇతర శాఖల అధికారులను భాగస్వాములను చేయనున్నారు.

అయిదు 'ఐసీడీఎస్' పరిధిలో ఇలా..

హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా అయిదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 917 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 0-6 ఏండ్లలోపు వారు 1,45,579 మంది చిన్నారులు, 14,244 మంది గర్భిణులు, బాలింతలు రిజిస్టర్ అయ్యారు. వీరందరికీ ప్రతిరోజు కేంద్రాల నుంచి గుడ్లు, బాలామృతం, పోషకాహారంతో కూడిన భోజనం, మురుకులు అందిస్తున్నారు. అయినా అవగాహన లేక ఆర్థిక స్థోమత లేని కారణంగా వయసుకు, పనికి తగ్గ పోషకాహారం తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇది పుట్టబోయే బిడ్డపై తీవ్ర ప్రభావం చూపనుంది. పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారుతోంది. జిల్లాలో సుమారు 2500-3వేల లోపు పిల్లలు తక్కువ ఎత్తు, బరువున్న పిల్లలున్నారని తెలిసింది. దీంతో పోషణ పక్షోత్సవాలు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉపయోగపడతాయని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో తప్పనిసరిగా షెడ్యూల్ కార్యక్రమాలు నిర్వహించేలా చూస్తామని తెలిపారు.

వరంగల్‌లో సిటీ యాక్ట్ ఇప్పుడు ఎందుకు తేవాల్సి వచ్చింది

- బీఆర్ఎస్ నేత ఎర్రబోలు నరసింహారెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

వరంగల్‌లో సిటీ యాక్ట్ ఇప్పుడు ఎందుకు తేవాల్సింది వచ్చిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ సభ పెడుతుందంటే కాంగ్రెస్ ఎందుకు భయపడుతుందని, బీఆర్ఎస్ సభ నేపథ్యంలోనే సిటీ యాక్ట్ తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రజా స్వామ్య దేశంలో పార్టీలు ఎక్కడైనా మీటింగులు పెట్టుకోవచ్చని, గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ మీటింగులు పెట్టుకోలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు చేస్తుందన్నారు. మీరు చేసే చెడు పరిపాలన ప్రజలకు తెలియదా? ప్రజలు అన్ని గమనిస్తున్నారని తెలిపారు. బహిరంగ సభ ఎప్పుడు జరుగుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా 27న పార్టీ సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవం జరిగి తీరుతుందని ఘంటాపథంగా తెలిపారు.

అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

- బహుజన్ ముక్తి పార్టీ, తెలంగాణ ప్రదేశ్ అధ్యక్షులు, అంసోల్ లక్ష్మణ్



నవతెలంగాణ-ముషీరాబాద్

మన మహాపురుషులను కించపరిచే విధంగా మాట్లాడిన ఆర్.ఎస్.ఎస్. - భాజాపా ద్వారా హెూం మంత్రిగా నియమించబడిన అమిత్ షా ని మంత్రి పదవి నుండి తొలగించాలని బహుజన్ ముక్తి పార్టీ, తెలంగాణ ప్రదేశ్ అధ్యక్షు లు అంసోల్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి సంపద, వనరులలో చట్ట సభ, ప్రభుత్వ నిర్వహణ, న్యాయ వ్యవస్థ, రక్షణ రంగం, సమాచార రంగం, దేశ బడ్జెట్‌లో మొదలగు వాటిలో ఏ వర్గం వాటా ఆ వర్గం సాధించుకోవాలంటే కులాల వారి జనాభా లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు. భారత్ ముక్తి మోర్చా దాని అనుబంధ సంఘాల ద్వారా 9న నిర్వహించనున్న దేశవ్యాప్త జైల్ భరో ఆందోళనకు బహుజన్ ముక్తి పార్టి (బీఎంపీ) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని బహుజన్ ముక్తి పార్టి సభ్యులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని ఆ ఆందోళనను విజయవంతం చేయడానికి మా వంతు సహాయ సహకారాలు అందించగలమని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యార్థి మృతి



నవతెలంగాణ-ముషీరాబాద్

గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర రక్తస్రావమై చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లెపల్లి ప్రాంతానికి చెందిన మొహమ్మద్ సాదుద్దీన్ (21) విద్యార్థి మంగళవారం నమాజ్ పూర్తిచేసుకుని రోజు మాదిరిగానే మార్నింగ్ వాక్ కోసం తన ద్విచక్ర వాహనం టీఎస్ 09 ఎఫ్ఎల్ 1694 నెంబర్ గల వాహనంలో అప్పర్ ట్యాంక్ బండ్ వద్ద గుర్తుతెలియని భారీ వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై రోడ్డు మీద పడి ఉండడం చూసి చుట్టుపక్కల వాహనదారులు మొహమ్మద్ సాదుద్దీన్ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి 108 అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించగా శరీరంపై తీవ్ర గాయాలు డాక్టర్ల సలహా మేరకు తదుపరి చికిత్స కోసం గ్లెన్‌ఫీల్డ్ మల్లా రెడ్డి బ్రెయిన్,హార్ట్ హాస్పిటల్, తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి మొహమ్మద్ సిరాజుద్దీన్ ఫిర్యాదు మేరకు దోమలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యూనివర్సిటీ తప్పిదం.. అభ్యర్థులకు శాపం కావొద్దు

- బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

యూనివర్సిటీ తప్పిదం విద్యార్థులకు శాపం కావొద్దని, అభ్యర్థులకు జరిగిన అన్యాయాన్ని వెంటనే సరిదిద్దాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ చైర్మెన్ కార్యాలయంలో అభ్యర్థులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పోస్టులకు టీజీపీఎస్సీ 2022 డిసెంబర్ 23న నోటిఫికేషన్ విడుదల చేసిందని, నోటిఫికేషన్ నాటికి బీఈడీ పాస్ అవ్వాలని నిబంధన ఉందన్నారు. నోటిఫికేష న్ తేది కంటే రెండు రోజుల ముందే (21 డిసెంబర్, 2022) నాటికి 11 మంది అభ్యర్థులు బీఈడీ పాస్ అయ్యారని, కానీ ఉస్మానియా యూనివర్సిటీ అధికారు లు మాత్రం డిసెంబర్ 30న పాస్ అయినట్లు టీజీపీఎస్సీకి తప్పుడు రిపోర్టు ఇచ్చారన్నారు. దాని కారణంగా 1:1 ఫైనల్ లిస్టులో టాప్ ర్యాంకులు సాధించిన దాదాపు 11 మంది అభ్యర్థుల పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీజీపీఎస్సీ చైర్మెన్ వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని ఫలితా లపై పున:సమీక్ష జరిపించి మెరిట్ సాధించిన అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు రాఘవేందర్, చంద్రయ్య కరుణాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తాం

- సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తా మని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలిపారు. మంగళవారం హిమాయత్ నగర్‌లోని కామ్రేడ్ ఎస్.సత్య నారాయణరెడ్డి భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లికంటి సత్యంను ఘనంగా స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ సీపీఐ పేద ప్రజల పక్షాన, కార్మిక వర్గానికి నిత్యం అందుబాటులో ఉండి కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో ఎల్లవేళల అందుబాటులో ఉంటానన్నారు. భారత కమ్యూ నిస్టు పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు ఏకగ్రీవంగా ఎన్నిక చేసి ఎమ్మెల్సీగా చేసినం దుకు భారత కమ్యూనిస్టు పార్టీకి, కాంగ్రెస్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏఐటీయూసీ నాయకత్వం ఘనంగా సన్మానించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వ అధికారులకు, మంత్రులకు, కార్మికుల సమస్యలను తీసుకెళ్ళి తప్పనిసరిగా పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యం.డి. యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య, కె.ఏసురత్నం, కార్యదర్శులు ఎస్.విలాస్, వై.ఓమయ్య బి.వెంకటేశం తదితరులున్నారు.

పెండింగ్ డీఏ వల్ల ఉద్యోగుల్లో అసహనం



- టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీష్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్ లో ఉన్నాయని, పెండింగ్ బకాయిలు, డీఏల వల్ల ఉద్యోగుల్లో అసహనం పెరిగిపోయిందని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్, హైదర్‌గూడలోని మున్సిపల్ చైర్మెన్స్ ఛాంబర్ కార్యాలయంలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ సెంట్రల్ ఫోరమ్ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మారం జగదీష్ హాజరై మాట్లాడారు పాలకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికార పక్షంలో ఉన్నప్పుడు ఒక మాట మాట్లాడుతూ ఉద్యోగులను స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నారన్నారు. రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి తమ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ ఉద్యోగుల ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుందన్నారు. సీనియర్ అసిస్టెంట్ నుండి సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ ఇవ్వకుండా మేనేజర్ గ్రేడ్ అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగుల జేఏసీ పక్షాన మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తామని మారం జగదీష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీకాంత్, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ సెంట్రల్ ఫోరమ్ అధ్యక్షులు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి వెంకట్, గోపాల్, కోశాధికారి శ్రీధర్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

- సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆర్ఎస్ఎస్, బీజేపీ కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఈనెల 8న అఖిలభారత నిరసన దినంగా పాటించాలని మాస్ లైన్ ఆల్ ఇండియా కమిటీ పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ కమిటీ మాస్ లైన్ ఆధ్వర్యంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ నాయకులు వీ.ప్రవీణ్ అధ్యక్షత మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన సభలో మాస్ లైన్ గ్రేటర్ కార్యదర్శి ఎం.హన్మేష్, పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ఎస్ఎల్. పద్మ మాట్లాడుతూ భారతదేశంలో ప్రజలందరూ అనేక సమస్యల మీద పోరాడుతూ ఉంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం మాత్రం మత ఉన్మాద, విద్వేషాలనే ప్రచారం చేస్తుందన్నారు. కార్మిక వర్గం తమ జీవిత భద్రత కోసం, జీతం కోసం, హక్కుల కోసం పోరాడుతుంటే, రైతాంగం గిట్టుబాటు ధర కోసం, ఎంఎస్‌పీ చట్టం, నూతన వ్యవసాయ చట్టాన్ని రద్దు పరచాలని,తదితర డిమాండ్లతో పోరాడుతుందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుసరిస్తున్నటువంటి ఈ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం, రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు, మేధావులు, ఆదివాసీలు, దళితులు, అన్ని రకాల ప్రజలు వీటికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్, పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్, గ్రేటర్ అధ్యక్ష, కార్యదర్శులు రాకేష్, హరీశ్, పీఓడబ్ల్యు జిల్లా నాయకులు లక్ష్మీబాయి, పుష్ప, నిర్మల, పీవైఎల్ నాయకులు రవికుమార్, కృష్ణ, శ్రీనివాస్, టీయుసీఐ నాయకులు లింగం గౌడ్, నారాయణ, నల్లన్న, నిస్సార్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

కవిత చేస్తున్న బీసీ ఉద్యమం రాజకీయ అవకాశాలకు పరాకాష్ట



- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేస్తున్న బీసీ ఉద్యమం రాజకీయ అవకాశాలకు పరాకాష్ట అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మెన్‌గా బీసీ కుల సంఘాల జేఏసీ కో-కన్వీనర్ చిన్న శ్రీశైలం యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలు, పూలే గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. వారికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ఏప్రిల్ 27న నిర్వహించే రజతోత్సవాల రోజున బీఆర్ఎస్ అధ్యక్షుడి గా ఒక బీసీ నాయకుడిని ప్రకటించాలని సవాల్ విసిరారు. గత 10 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడు బీసీల సమ స్యల గురించి మాట్లాడని ఆ పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవిత నేడు బీసీల జపం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 11న 'హలో బీసీ చలో ఫిలింనగర్' పేరుతో హైదరాబాద్ ఫిలింనగర్‌లో 10 వేల మందితో నిర్వహించే సామాజిక, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నాయకులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఫిలింనగర్ లో ఏడు అడుగుల పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చైర్మెన్‌గా ఎన్నికైన చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లా డుతూ తనకు అప్పగించిన ఈ బాధ్యతను విజయవంతంగా పూర్తి చేస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన జాజుల శ్రీనివాస్ గౌడ్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, ఈడిగ శ్రీనివాస్, కనకాల శ్యామ్ కుర్మ ఉపాధ్యక్షులు పానుగంటి విజయ్ కుమార్, యువజన సంఘం రాష్ట్ర నాయకులు తాటికొండ విక్రమ్ గౌడ్, నరేష్ ప్రజాపతి, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేషా చారి, నాయకులు భాస్కర్, నరసింహ, రాములు, ఎల్లయ్య యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కేర్ హాస్పిటల్‌లో వాక్ ఫర్ ఎ హెల్తీ బిగినింగ్



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నాంపల్లిలోని కేర్ హాస్పిటల్స్ ప్రత్యేక కార్యక్రమంగా 'వాక్ ఫర్ ఎ హెల్తీ బిగినింగ్' అనే నడకను చార్మినార్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డీజీపీ అన్వర్ ఉల్ హుదా, హైదరాబాద్ సిటీ మాజీ డీసీపీ కె. బాబు రావు, కార్పొరేటర్ సయ్యద్ సుహైల్ ఖాద్రీ, నాంపల్లి కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సమీ, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అమన్ సల్వాన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్, అనస్తీషియా నిపుణుడు డాక్టర్ ఇర్ఫాన్, సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ కిరణ్ కుమార్‌లు కలిసి వాక్‌లో స్థానిక వాసులు, డాక్టర్లు, స్థానిక నాయకులు కలిసి ఆరో గ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అన్వర్ ఉల్ హుదా మాట్లాడు తూ.. 'మన చరిత్రకు గుర్తుగా నిలిచే చార్మినార్ వద్ద ఇలాంటి ఆరోగ్య నడక కొనసాగించడం చారిత్రకమన్నారు. కార్పొరేటర్ సయ్యద్ సుహైల్ ఖాద్రీ మాట్లాడుతూ.. ఒక్క సమాజానికి నిజమైన సంపద అంటే ఆరోగ్యం అని, అది కేర్ హాస్పిటల్స్ ప్రజల ఆరోగ్యంపై మంచి దృష్టి పెట్టార న్నారు. సమాజం కోసం కలిసి పని చేయడమే నిజమైన శక్తి అని మాజీ డీసీపీ కె.బాబు రావు అన్నారు. చిన్న చిన్న మంచి పనులు మనకు పెద్ద ప్రయో జనం ఇస్తాయన్నారు. అందరూ ఆరోగ్యాన్ని ముఖ్యంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ చుట్టూ నడిచి, ప్రజలంతా కలసి ఆరోగ్యంగా ఉండాలనే సందేశాన్ని అందించారు. నిత్యం కాస్త నడక మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని గుర్తు చేశారు. నాంపల్లి కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సమీ మాట్లాడుతూ.. చార్మినార్ ఒక బలానికి చిహ్నం అని, ఇక్కడి నుంచే మన ఆరోగ్య ప్రయాణం ప్రారంభించడమే సరైన మార్గం అన్నారు. ప్రజల ఆదరణ కు ధన్యవాదాలని, ఆరోగ్య పరిరక్షణలో మా కట్టుబాటును చూపించగలిగామన్నారు. కేర్ హాస్పిటల్స్ తమ కొత్త మెంబర్‌షిప్ కార్డ్ 'సంగం'ను ప్రారంభించింది. డా.సమీ మాట్లాడుతూ ఈ కార్డ్‌తో సభ్యులకు ప్రాధాన్యత సహాయం, అత్యవసర సేవలు, 5 కిలోమీటర్ల పరిధిలో ఉచిత అంబులెన్స్ సేవ, ప్రత్యేక డిస్కౌంట్లు, 24/7 సహాయ కేంద్రం (040-68106541)తో సహాయం ఉంటుందన్నారు. కమ్యూనిటీ ఆరోగ్య కార్యక్రమాల్లో పాల్గొనడానికి అవకాశం వంటి ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయన్నారు. ఈ కార్డ్ కేర్ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉందన్నారు.

లిక్కర్ మరకలను తుడిచివేయడానికి బీసీలపై కపట ప్రేమ

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు తేజ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

లిక్కర్ మరకలను తుడిచివేయడానికి బీసీలపై కపట ప్రేమను ఎమ్మెల్సీ కవిత బీసీ నినాదం ఎత్తుకున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు తేజ గౌడ్ అన్నారు. అసెంబ్లీ ఆవరణలో జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటుకు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన ధర్నాపై పత్రికా ప్రకటన ద్వారా స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పది సంవత్సరాల మీ పాలనలో బీసీలను ఎప్పుడెప్పుడు అనగదొక్కాలని చూశారు తప్ప బీసీలకు ఏ విధంగా న్యాయం చేశారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం కాలంలోనే జనగణలలో కులగణన చేసి దానిని అసెంబ్లీ సాక్షిగా బహిర్గతం చేశారన్నారు. కెసిఆర్ పాలనలో సకలజనుల సర్వేలో లెక్కలను ఎందుకు బహిర్గతం చేయలేదో తెలపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత న్యాయం జరుగుతుందని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్ లో ప్రవేశపెట్టడానికి నడుం బిగించామని పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్‌లు సాధించి తీరుతామన్నారు. కెసిఆర్ పాలనలో ధర్నా చౌక్‌ను ఎత్తివేసిన ఘనత బీఆర్ఎస్‌ది అని ఇప్పుడు ఏం మొహం పెట్టుకొని ధర్నాకు దిగారని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలను రాజకీయ పబ్బం గడుపుకోవడానికి వాడుకుంటున్నారని, వారి అభ్యున్నతి కోసం కలిసి పోరాటం చేయడానికి ముందుకు రావాలని కోరారు.

ఆచార్య బిరుదురాజు రామరాజు శతజయంతి ఉత్సవం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

విద్యార్థి దశలో నిజాం వ్యతిరేక పోరాటయోధునిగా, దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి జానపద విజ్ఞాన పరిశోధకులుగా, తెలుగు ఆచార్యులుగా ఆచార్య బిరుదు రాజు రామరాజు చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కీర్తించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మంగళవారం పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు కళామందిరంలో ఆచార్య బిరుదు రాజు రామరాజు శతజయంతి ఉత్సవం జరిగింది. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షో పన్యాసం చేస్తూ రామరాజు తమకు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో స్నాతకోత్తర స్థాయిలో పాఠాలు బోధించారని గుర్తు చేసుకున్నారు. సురవరం ప్రతాపరెడ్డి జీవితం, సాహిత్యం అనే అంశంపై పరిశోధన సాగించి అందించిన పుస్తకం చదివి మెచ్చుకున్నారన్నారు. వక్తగా పాల్గొన్న శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం కార్యదర్శి టి.ఉదయవర్లు మాట్లాడుతూ రామరాజు గొప్ప పరిశోధకులుగా, అధ్యాపకులుగా, అనేక సంస్కృత, తెలుగు ప్రాచీన గ్రంథాల అన్వేషణ, పరిష్కరణ కర్తగా అందించిన సేవలు బహుముఖీనమైనవని తెలిపారు. రామరాజు మనుమరాలు, తెలుగు విశ్వవిద్యాలయ నృత్య శాఖ అధ్యక్షురాలు డాక్టర్ కే.రత్న శ్రీ మాట్లాడుతూ తాత డా.సి.నారాయణ రెడ్డితో కలిసి తొలినాళ్లలో కవితలు అందించి రామనారాయణ కవులలో ఒకరుగా పేరుపొందారన్నారు. సురవరం ప్రతాపరెడ్డి సూచనపై రాజకీయాలను, ఇతర రంగాలను వదిలి తెలుగు ఆచార్యులుగా, పరిశోధకులుగా కొనసాగారని తెలిపారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు.ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఏ. సిల్మా నాయక్ సమావేశ కర్తగా వ్యవహరించారు.

జీవో నెం 21ని రద్దు చేయాలని కాంట్రాక్ట్ అధ్యాపకుల ధర్నా..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కొత్తగా అధ్యాపకుల నియామకాల కోసం ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో నెం21ని రద్దు చేయాలని వీరనారి చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయం కాంటాక్ట్ అధ్యాపకుల జేఏసీ కన్వీనర్ ఉపేందర్ రావు అన్నారు. కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాల యంలో తరగతులు బహిష్కరించిన విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం కోఠిలోని మహిళా విద్యాలయం (బ్రిటిష్ రెసిడెన్సి) దర్బార్ హాల్ వద్ద ఆందోళనకు దిగారు. కొత్తగా అధ్యాపకుల నియామకాల కోసం ప్రభుత్వం ఇచ్చిన జీవో 21ను రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 12 విశ్వ విద్యాలయాలలో పని చేస్తున్న 1270 మంది అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 21 వెంటనే ఉపసంహరించుకోవాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు నినాదాలు చేశారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో గత 25 నుంచి 30 ఏండ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్న అధ్యాపకులు చాలీ చాలని జీతాలతో పని చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చేంత వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నాలు కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ వినీత పాండే, డాక్టర్ రజిని, డాక్టర్ సనత్, డాక్టర్ రవి, డాక్టర్ సునీత, జ్యోతి, డా.కృష్ణ వేణి, డా. కృష్ణాజి, డా.శేఖర్ రెడ్డి, డాక్టర్ ఆనంద్ పెద్ద ఎత్తున అధ్యాపకులు,తదితరులున్నారు.

పిట్టల నర్సింగరావు జ్ఞాపకార్థంగా చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండలం అంకుషాపూర్‌లో ముచుకుంద ఫౌండేషన్ ఉపాధ్యక్షులు చిలుక గణేష్ ఆధ్వర్యంలో జర్నలిస్టు పిట్టల నర్సింగరావు జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం మజ్జికను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందం కలిగిస్తుందన్నారు. పిట్టల నర్సింగరావు తన చిన్ననాటి మిత్రుడు అని, పాత్రికేయునుగా మంచి గుర్తింపు పొంది చిన్న వయసులో మరణించడం వారి కుటుంబానికి తీరనిలోటన్నారు. ప్రజల దాహం తీర్చడానికి చలివేంద్ర ఏర్పాటు అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, బాలరాజ్, పిట్టల వెంకటేష్, మాజీ వార్డ్ సభ్యులు. పిట్టల రాజు, పిట్టల మంగ, తెలంగాణ కోకిల, ప్రియాంక, పిట్టల శివ, గౌస్, బన్నీ, మహిళలు, తదితరులున్నారు.

ఏప్రిల్ 27న వరంగల్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

ఏప్రిల్ 27న వరంగల్ లో జరిగే పార్టీ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైఫల్యాలు, ప్రజా వ్యతిరేకత వరంగల్ సభ వేదికగా ఎండగట్టాలన్నారు. పార్టీ 27వ తేదీన ఉప్పల్ వ్యాప్తంగా గులాబీ జెండా ఎగరేయాలని కోరారు. రేవంత్ రెడ్డి పాలన ఫెయిల్ అయిందని తెలిపారు. హైడ్రా పేరుతో పేద ప్రజల జీవితాలు నాశనం చేశారని చెప్పారు. భూముల అమ్మకాల పేరుతో మూగ జీవాల గోస పోసుకున్నాడని మండిపడ్డారు. సగం రుణమాఫీ చేసి చేతులు ఎత్తేసిండని ఆయన తెలిపారు. వానకాలం రైతుబంధు ఎగొట్టిన 13 వేల కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున రావాలి అని ఆయన అన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు



- కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సామాజిక న్యాయం
- పీర్జాదిగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి

నవతెలంగాణ-బోడుప్పల్

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కట్రలు చేస్తుందని, అందుకు అంబేద్కర్‌పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు నిదర్శనమని, ఆయన వాఖ్యలకు నిరసనగా ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ పీర్జాదిగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు. మంగళవారం పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన "జై బాపు, జై భీం, జై సంవిధాన్" కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్ హాజరై భారత రాజ్యాంగం విశిష్టతను వివరించారు. బీజేపీ నేడు అన్ని వ్యవస్థలను తన గుప్పిట్లో ఉంచుకొని రాజ్యాంగంపై దాడి చేయాలని చూస్తుందన్నారు. అందులో భాగంగానే కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేశారని అన్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా వారి ఆటలు సాగనియ్యకుండా ఉండేందుకు రాజ్యాంగాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ జాతీయ కమిటీ జై బాపు - జై భీం- జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్,కార్పొరేషన్ డివిజన్ ఇన్‌చార్జిలు ఎండీ మజర్, శ్రీలత భద్రు నాయక్, సుదర్శన్ రెడ్డి, యసారం నగేష్,ముదిగొండ రమేష్, వంగూరి పరమేష్, మోహన్, చారి, కవిడె కుమార్,కుమార్ రెడ్డి, నాగరాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



- కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

నవతెలంగాణ - చర్లపల్లి,కాప్రా

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని కాలనీలు, బస్తీల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, వాటర్ లైన్‌మన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లో ప్రెషర్ లేకుండా సమర్థవంతంగా నీటి సరఫరా జరగాలని సూచించారు. కొన్ని కాలనీల్లో నీరు సకాలంలో విడుదల కావడం లేదన్న విషయాన్ని గుర్తుచేస్తూ, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మల్లాపూర్ డివిజన్‌కు తగినంత నీటిని విడుదల చేయించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

'కోనో కార్పస్ చెట్లు తొలగింపు



- డీసీ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్

నవతెలంగాణ - చర్లపల్లి

'కోనో కార్పస్ చెట్ల తొలగింపుపై స్పందించిన డీసీ జగన్‌కు కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం కుషాయిగూడ రహదారిపైన ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న కోనో కార్పస్ చెట్లను తొలగించాల్సిందిగా కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున కాప్రా మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జగన్‌కు వినతిపత్రం అందజేయగా తక్షణమే చెట్ల తొలగింపుపై చర్యలు చేపట్టినందుకు అసోసియేషన్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామని ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీసీ జగన్ మార్గదర్శకత్వంలో మున్సిపల్ సిబ్బంది కొన్ని చెట్లను తొలగించారని తెలిపారు. మిగతా చెట్లను పూర్తిగా తొలగించాలని అసోసియేషన్ తరపున డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. తొలగించిన చెట్ల స్థానంలో మంచి ఆక్సిజన్ విడుదల చేసే రాగి, యాప వంటి వృక్షాలను నాటాలని కోరారు. అంతకుముందు ఈ చెట్ల తొలగింపు పనులను కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ప్రభాకర్, గణేష్ గౌడ్, చల్లా వెంకటేష్, ఎల్.సి.టి.రాజు ముదిరాజ్, నల్లచెరువుల జనార్దన్, శ్రీకాంత్ తదితరులున్నారు.

వేసవి సెలవుల్లో తరగతులు నడిపే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కాప్రా, మేడ్చల్

ప్రభుత్వం జూనియర్ కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించినప్పటికీ నారాయణ, శ్రీ చైతన్య, ఇతర ప్రయివేటు కళాశాలు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారని, అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బ్యాగారి వెంకటేష్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కార్పోరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖ అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఇంటర్ సిలబస్ తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రోజు రోజుకి ఉష్ణోగ్రతలు పెరుగుతుంటే తరగతలు పేరుతో విద్యార్థుల ప్రాణాలను తీస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కనబడుతుందన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే కళాశాలలపై చర్యలు తీసుకొని వాటి గుర్తింపును రద్దు చేసి యాజమాన్యం పై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. లేని పక్షంలో విద్యా శాఖ కార్యాలయాల ముందు కళాశాలల ముందు పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

మరణించిన కేసులను అప్‌డేట్ చేయాలి

- స్పౌజ్‌కు పింఛన్ అందించేలా చూడాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



నవతెలంగాణ-సిటీబ్యూరో

చేయూత పింఛన్లలో పెండింగ్ కేసులను పరిశీలిస్తూ మరణించి కేసులను అప్‌డేట్ చేసి స్పౌజ్‌కు పింఛన్ అందించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరై ఫింఛన్లు, అంగన్‌వాడీ సెంటర్లు, ఇందిరమ్మ ఇండ్లు అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మండలాల వారీగా కొన్ని నెలలుగా పంపిణీ కాకుండా బ్యాంకుల్లో, పోస్టాఫీసుల్లో పెండింగ్‌లో ఉన్న చేయూత ఫించన్లను పరిశీలించి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఫించన్‌దారుని ఖాతాలోకి జమ కాకుండా పెండింగ్‌లో ఉండటానికి కారణలైన మరణ/వలస/ఆధార్ అప్‌డేట్ కేసులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని మండలాల్లో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్న కేసులపై మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి క్లియర్ చేయాలన్నారు. సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చిన అప్లికేషన్లను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు తమ తమ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించి అవసరమై మేరకు టాయిలెట్లు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌కు వాటర్ ఫిల్టర్లను పంపిణీ చేయాలన్నారు. కొన్ని మున్సిపాల్టీలోల శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పున:నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు తమ వద్ద ఉన్న జనరల్ ఫండ్స్ నుంచి ఎన్యూమరేటర్లుగా విధులు నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు ఇవ్వాలని ఆదేశించారు. మండలాల వారీగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల వివరాలను పరిశీలించి కొన్ని మండలాల మున్సిపల్ కమిషనర్లను పునర్ పరిశీలన చేయాలని ఆదేశించారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా కుట్టిస్తున్న విద్యార్థుల యూనిఫాంలను ఎప్పటికప్పుడు పరిశీలించాలనీ, నిర్దేశిత గడువులోగా యూనిఫాంలు కుట్టడం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ కాంతమ్మ, డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసిస్, హౌజింగ్ ఈఈ రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక రక్షణకు కార్పొరేటర్ చొరవ





నవతెలంగాణ-అల్వాల్

మచ్చ బొల్లారం 133వ డివిజన్ పరిధిలోని హిందూ శ్మశాన వాటికలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపి వేయాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి తన పరిధిలో విస్తృత ప్రయత్నాలు చేశారు. జేఏసీ సభ్యులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకు వెళ్లడంలో శాంతి శ్రీనివాస్ రెడ్డి సమన్వయంతో పనిచేశారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డంపింగ్‌యార్డ్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అసెంబ్లీలోనూ ఈ అంశాన్ని లేవనెత్తారు. అలాగే, అన్ని రాజకీయ పార్టీల నేతలు, మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ హైడ్రా కమిషనర్, మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెంటనే చర్యలు చేపట్టారు. ఆయన స్వయంగా హిందూ శ్మశాన వాటికను సందర్శించి, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ అల్వాల్ శ్రీనివాస్ రెడ్డికి తక్షణమే అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని ఆదేశించారు. ఒకవేళ నిర్మాణాలు కొనసాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హైడ్రా కమిషనర్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల జేఏసీ సభ్యులు, పలు కాలనీల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి తన పరిధిలోని సమస్యను ఉన్నత స్థాయికి తీసుకెళ్లి పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు ఉదయ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ పడాల, మెట్టు రాజశేఖర్ రెడ్డి, తోట అమరేందర్ రెడ్డి, వీరేందర్ రావు, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంను ఢీ కొట్టిన టాటా సఫారి

- ఇద్దరు మృతి, మరో ఐదుగురికి గాయాలు



నవతెలంగాణ -శామీర్‌పేట

ప్రమాదవశాత్తు డీసీఎం వాహనాన్ని టాటా సఫారి వాహనం ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారు జామున జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... సిద్దిపేట జిల్లా వర్గల్‌కు చెందిన రాజు (18) విద్యార్థి డీసీఎంలో పక్కన కూర్చోగా, శామీర్ పేట మండలం మురహరి పల్లికి చెందిన శ్రవణ్ (23) విద్యార్థి టాటా సఫారిలో వెళుతుండగా తెల్లవారుజామున హైదరాబాద్-సిద్దిపేట్ హైవేలో ఫారెస్ట్ గెస్టు హౌస్ సమీపములో రెండు వాహనాలు ఢీ కొన్నాయి. హైదరాబాద్ వైపు నుండి సిద్దిపేట్ వైపునకు వెళ్తున్న ఒక డీసీఎం (ఏపీ 15టీసీ 5440) వాహనాన్ని మురహరిపల్లి వైపు నుండి శామీర్ పేట వైపు వెళ్తున్న టాటా సఫారి వాహనం డీసీఎంను కొట్టగా డీసీఎంలో డ్రైవర్ పక్కనున్న రాజు, టాటా సఫారిలో ఉన్న శ్రవణ్ అక్కడికక్కడే మృతి చెందారు. డీసీఎం డ్రైవర్ కు, టాటా సఫారిలో ఉన్న ఐదుగురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తము ఆర్‌వీఎం హాస్పిటల్‌కు తరలించారు. దశరత్ ఫిర్యాదు మేరకు జీనోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతి చెందిన శ్రవణ్, రాజుల మృత దేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం మేడ్చల్ హాస్పిటల్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

భూ గర్భ డ్రయినేజీ పనులు ప్రారంభం



- ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుంది
- మాజీ మేయర్ అమర్ సింగ్

నవతెలంగాణ-బోడుప్పల్

గతంలో వర్షాల కారణంగా నీట మునిగిన కాలనీలకు వరద సమస్య నుండి పరిష్కారం చూపేందుకే భూ గర్భ డ్రయినేజీ పనులు ప్రారంభించామని మాజీ మేయర్ అమర్ సింగ్ అన్నారు. మంగళవారం పీర్జాదిగూడ కార్పొరేషన్ 2వ డివిజన్ ధరణి కాలనీలో నూతనంగా నిర్మించ తలపెట్టిన భూ గర్భ డ్రయినేజీ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ కాలనీ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో వరదలు వచ్చినప్పుడల్లా ఈ కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని ప్రస్తుతం చేపట్టిన పనులు త్వరగా పూర్తయితే ఎలాంటి ఇబ్బందులు ఉండయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్, నాయకులు పప్పుల అంజిరెడ్డి,బండారి రవీందర్, యాసారం మహేష్, తవిటి ప్రశాంత్,మాజీ కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మహిళ నాయకురాలు శ్రీలత, కాలనీ అధ్యక్షులు మంచాల ప్రకాష్, ప్రధాన కార్యదర్శి తండా శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు వేణు, మాజీ అధ్యక్షులు పురుషోత్తం, సుకుమార్, చంద్రశేఖర్ మహిళలు, తదితరులున్నారు.

కేజీఆర్ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

- భారీ సంఖ్యలో హాజరైన విద్యార్థులు
- ఎంపికైన వారికి ఆఫర్ లేటర్ అందజేత





నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని కెజీఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎంబీఏ, ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. యశోద హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పి.రామారావు, మానవ వనరుల అభివృద్ధి శాఖ హెడ్ హేమచందర్ ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి ఆఫర్ లెటర్లు అందజేశారు. అనంతరం కేజీఆర్ కళాశాల చైర్మెన్ కె. గోవింద రెడ్డి , డైరెక్టర్ ప్రొఫెసర్ పి. వి. రమణారావు లు మాట్లాడుతూ.. ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ విజయవంతం కావడం ద్వారా విద్యార్థులకు ఉత్తమ ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సంస్థ సంకల్పం, పరిశ్రమలతో ఉన్న అనుసంధానాన్ని స్పష్టంగా చూపిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విజయలక్ష్మి ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు ప్రొఫెసర్ సునీత, ప్రొఫెసర్ శిల్పికా పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ఎస్సీసెల్ కన్వీనర్‌గా బక్కని నర్సింగ్‌రావు

- నియామక పత్రం అందజేసిన వజ్రేష్ యాదవ్, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి





నవతెలంగాణ-కీసర

కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్‌గా దమ్మాయిగూడ మున్సిపాలిటీ చీర్యాల గ్రామానికి చెందిన బక్కని నర్సింగ్ రావు నియామకం అయ్యారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు బక్కని నర్సింగ్ రావుకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతీ కార్యకర్తకు అధిష్టానం గుర్తించి పదవులను ఇస్తుందన్నారు. పార్టీకి ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్నందున తనను గుర్తించి మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్‌గా నియమించినందుకు పార్టీ అధిష్టానానికి , రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నాగరిగారి ప్రీతంకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దళితుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోలా కృష్ణ యాదవ్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రమేష్ గుప్తా, నాయకులు శ్రీనివాస్, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తుల వేణుగోపాల్, ఎమార్పీ ఎస్ రాష్ట్ర నాయకులు మీసాల మల్లేష్, చీర్యాల మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్, సంతోష్ తదితరులున్నారు.

తమ్మినేని వీరభద్రంను కలిసిన దళిత జన సమితి నాయకులు



నవతెలంగాణ - చర్లపల్లి

హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద ఉన్న సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అఖిల భారత కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రంను దళిత జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొజ్జ యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొజ్జ యాదగిరి మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని వర్గాలకు సమాన హక్కులు అందేలా రిజర్వేషన్ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, దళిత బహుజన సమాజ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. సమాజంలో హక్కుల సమానత్వం కోసం అన్ని వర్గాల సమన్వయం అవసరమని తమ్మినేని అభిప్రాయపడ్డారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండె సంపత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిడిశెట్టి చంద్రమౌళి, రాష్ట్ర కార్యదర్శి భావండ్లపల్లి గంగాధర్, బీసీ సంఘాల రాష్ట్ర నాయకులు ఎదునూరి సంపత్, అశోక్, గంధమాల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

చీర్యాల బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానం



నవతెలంగాణ-కీసర

చీర్యాల గ్రామంలోని ఈనెల 24 నుండి 27 వరకు నిర్వహించే లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతంకు ఆలయ ఫౌండర్ చైర్మెన్ మల్లరపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిలు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

వీధికుక్కల సమస్యపై పకడ్బందీ చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు తుంగతుర్తి రవి విజ్ఞప్తి

నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో ఉన్న వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పీర్జాదిగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో అనేక డివిజన్లలో వీధి కుక్కల కారణంగా అ మార్గాల ద్వారా ప్రయాణించడానికి ప్రజలు, విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తక్షణమే వీధి కుక్కల నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు తమ కాలనీల్లో వీధి కుక్కలు ఉన్నట్లయితే కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

ఇల్లు కాలిపోయిన బాధితులకు కార్పొరేటర్ చేయూత



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్‌లో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయి రోడ్డు పాలైన రాజు, బాలమణి దంపతులకు గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ దంపతులు అండగా నిలిచారు. ఈనెల నాలుగో తేదీ శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని నిత్యావసర సరుకులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ దంపతులు మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితురాలు బాలమణికి రూ.10 వేలు అందజేశారు. వారికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాము యాదవ్, స్థానిక నాయకులు, తదితరులున్నారు.

మానవాళి మనుగడకు జలమే ఆధారం



● కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మానవాళి మనుగడకు జలమే ఆధారమని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి ఉన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం డివిజన్ పరిధిలో భవాని నగర్‌లో వికాస్ గ్రామర్ హై స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన "సేవ్ వాటర్ సేవ్ లైఫ్ "కార్యక్రమానికి హాజరై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ ఇంటింటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నీటి ఎద్దడి రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు నీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రచ్చ శ్రీకాంత్, స్థానిక నాయకులు ప్రతాప్ రెడ్డి, ఆదిశేషు, వెంకటేష్, సాబేర్, చంద్రశేఖర్, సిహెచ్.శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి

● సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలనీ, పేదల మీద భారం మోపే పద్ధతిని మానుకోవాలని సీపీఐ(ఎం) మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులతో కుటుంబాలు పోషించుకోలేక ఇబ్బంది పడుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ పైన రూ.50 పెంచడం దుర్మార్గమైన చర్య అనీ, పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకుని పేదలపై భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ వంట గ్యాస్‌పై సబ్సిడీని అన్ని కుటుంబాలకు వర్తింప జేయడం లేదనీ, సబ్సిడీని పేదలందరికీ వర్తించే విధంగా చర్యలు తీసుకుని పెంచిన ధరలను తగ్గించే విధంగా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం పేదలపై భారాలు మోపే ప్రయత్నం, పజా వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం) పార్టీ నిర్వహించే పోరాటాల్లో ప్రజలంతా కలిసి రావాలనీ, సంఘటితమై పోరాడాలకు పిలుపునిచ్చారు.

ప్రొ. ఇస్లావత్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో నూతనంగా నియమితులైన ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్ డైరెక్టర్‌గా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఇస్లావత్ రాంజీ నాయక్ పదవీ బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా బంజారా విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు వారి ఛాంబర్‌లో శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. బంజారా విద్యార్థి సంఘం నాయకులు భాను ప్రకాశ్ నాయక్, బానోత్ ఆకాశ్ నాయక్ మాట్లాడుతూ జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటిలో సీనియర్ గిరిజన ప్రొఫెసరును గుర్తించి డైరెక్టర్‌గా నియమించిన, వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు తీసుకున్నా తరువాత ఇద్దరు గిరిజన ప్రొఫెసర్లకు డైరెక్టర్లుగా నియమించినందుకు వైస్ ఛాన్సలర్ టీ.కిషన్ కుమార్ రెడ్డికి బంజారా విద్యార్థి సంఘం తరుపున బంజార విద్యార్థుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారా విద్యార్థి సంఘం నాయకులు తేజవత్ రాహుల్, డీఎస్ సురేష్, సుశాంత్, జీవన్, సాయి కిరణ్ నాయక్ తదితరుల పాల్గొన్నారు.

గడ్డం ప్రసాద్‌ను కలిసిన శేరి సతీష్ రెడ్డి





పట్నం మహేందర్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి..

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ని మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి కలిశారు. అనంతరం పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మేకల మైఖేల్, ఆదరణ ఫౌండేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ డాక్టర్. రఘునాథ్ బాబు అరిగేలా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల మైఖేల్, ఆదరణ ఫౌండేషన్ ఫౌండర్ , ప్రెసిడెంట్ డాక్టర్. రఘునాథ్ బాబు అరిగేలా పాల్గొన్నారు.

దేశాన్ని పాలించే హక్కు బీజేపీకి లేదు



● సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్

● సీపీఐ,ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలపై ధరల భారాలు మోపుతున్న బీజేపీకి పాలించే హక్కు లేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్ విమర్శించారు. ఇటీవలే వంట గ్యాస్ సిలిండర్ పై రూ.50 పెట్రోల్ డీజిల్‌పై రెండు రూపాయల చొప్పున పన్ను ధరలను పెంచి ప్రజలను హింసిస్తున్న బీజేపీ పాలన తీరుపై నిరసిస్తూ మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి జగద్గిరిగుట్ట అవుట్ పోస్ట్ చౌరస్తాలో సీపీఐ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో... గ్యాస్ సిలిండర్లతో నిరసన చేపడుతూ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటాన్ని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అంతర్జాతీయ వ్యాప్తంగా చమురు ధరలు,గ్యాస్ ధరలు తగ్గుతుంటే ఇక్కడి బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు గ్యాస్ సిలిండర్ పైన పెట్రోల్ డీజిల్ పైన ధరలు ఎందుకు పెంచాల్సి వస్తుందో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలో బ్యారేల్ ధర రూ. 120 ఉన్నప్పుడు లీటర్ పెట్రోల్‌కి 65 ఉండేదని.. నేడు అదే చమరు బ్యారెల్ ధర రూ. 60 ఉంటే పెట్రోల్, డీజిల్ ధరలు రూ.100 రూపాయలు పైబడి ఉన్నాయని మోడీ ధరలు తగ్గిస్తానని చెప్పి ఎన్నికల్లో గెలిచారన్నారు. మాట తప్పి ధరలను పెంచుకుంటూ పోతున్నాడని బిజెపి ప్రభుత్వం అంటేనే సామాన్య ప్రజల పైన ధరలు పెంచి వారిని తిండికి, విద్యకు దూరం చేసిందన్నారు. జాతీయ మహిళా సమైక్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ)మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు వి.హైమావతి మాట్లాడుతూ ఇప్పటికే ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే మళ్లీ బిజెపి ప్రభుత్వం ధరలు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థికంగా చాలా నష్టమని తెలిపారు. పెరిగిన ధరలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు డి.రాములు, శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, మహిళా సమైక్య నాయకురాలు జయమ్మ ప్రమీల, కావ్య, సీపీఐ నాయకులు ఇమామ్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్..!

- రేపటి నుంచి అమల్లోకి స్లాట్ బుకింగ్ విధానం
- ప్రయోగాత్మకంగా మేడ్చల్ ఆర్ఓ, కుత్బుల్లాపూర్, వల్లభ్‌నగర్, రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు
- ఇక నుంచి డబుల్ రిజిస్ట్రేషన్‌కు చెక్..!



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజలకు సమర్థవంతంగా, సులువుగా, వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతి రహితంగా మరింత మెరుగైన సేవలందించేందుకు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరించనున్నారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించే పని లేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా స్లాట్ బుకింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. అధిక రద్దీ కార్యాలయాల్లో అదనపు సిబ్బంది నియామకంతోపాటు స్వయంగా డాక్యుమెంట్లు తయారు చేసుకునే వెలుసుబాటును కల్పించనున్నారు. దీనితోడు ఒకే ప్లాటు ఇద్దరు వ్యక్తుల పై రిజిస్ట్రేషన్ కాకుండా చెక్ పెట్టేందుకు చట్టాన్ని సైతం సవరించనున్నారు.

10 నుంచి ప్రయోగాత్మకంగా..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను మొదటి దశలో ప్రయోగాత్మకంగా మేడ్చల్ ఆర్ఓ, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరిలోని వల్లభ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 10వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకే రోజు ఒకే సమయంలో ఎక్కువ దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం సమర్పించడం వల్ల జరిగే జాప్యాన్ని నివారించడానికి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ రోజు వారి పని వేళలను 48 స్లాట్లుగా విభజించారు. ప్రజలు నేరుగా registration.telangana.gov.in వెబ్-సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని ఆ రోజు నిర్దేశించిన సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని వెంటనే వెళ్లిపోవచ్చు. స్లాట్ బుక్ చేసుకోని వారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాల్లో ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు, ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తారు. నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులను స్వీకరిస్తారు.

అదనపు సిబ్బంది నియామకం..

పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేయడానికి, 48 స్లాట్స్ కన్నా ఎక్కువ స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాల్లో ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తారు. ప్రయోగాత్మకంగా కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బందిని ఇప్పటికే నియమించారు. దీని వల్ల కుత్బుల్లాపూర్ కార్యాలయంలో 144 స్లాట్స్ అందుబాటులో ఉంటాయి. స్లాట్ బుకింగ్ విధానాన్ని దష్టిలో పెటుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రీ ఆర్గనైజేషన్ చేస్తున్నారు. ఇందులో భాగంగా అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని అనుసంధానం చేసి పని భారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసుకోనున్నారు. ఈ విధానాన్ని ముందుగా రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట, సరూర్‌నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధిని విలీనం చేశారు. ఇది విజయవంతమైతే మిగతా చోట్ల కూడా అమలు చేయనున్నారు.

స్వయంగా దస్తావేజుల తయారు..

రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రజలు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా దస్తావేజులను తయారు చేసుకోవడానికి వెబ్‌సైట్‌లో ఒక మాడ్యూల్‌ని ప్రవేశపెట్టారు. మొదటగా సేల్ డీడ్ దస్తావేజుల కోసమే ఈ సౌకర్యం ఉంటుంది. ఇది కూడా ఐచ్ఛికమే. రిజిస్ట్రేషన్ సమయంలో దస్తావేజుపైన అమ్మినవారు, కొన్నవారు, సాక్షులు, సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగతంగా/భౌతికంగా సంతకాలు చేయడానికి చాలా సమయం పట్టడం వల్ల దస్తావేజు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా ఆలస్యమవుతుంది. దీని వల్ల ప్రజల సమయం వథా అవడం ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని నివారించడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఈ-సంతకం ప్రవేశపెడుతున్నారు. ఈనెల చివరిలోగా అందుబాటులోకి తీసుకురానున్నారు.

డబుల్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణ..

ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట తమ ఆస్తి డబుల్ రిజిస్ట్రేషన్ జరి గిందనే ఫిర్యాదులు ప్రజల నుంచి ఎక్కువగా వస్తున్నాయి. డబుల్ రిజిస్ట్రేషన్‌లను నివారించడానికి చట్టాన్ని సవరించనున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వివిధ రాష్ట్రాలు ఇప్పటికే చట్టాలను సవరించుకున్నాయి. అలాగే తెలంగాణలోనూ చట్టసవరణ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ చట్టంలో కొత్తగా సెక్షన్స్ 22కి సవరణ చేస్తూ సెక్షన్ 22-బీ తీసుకురానున్నారు. దీంతో ఇక నుంచి డబుల్ రిజిస్ట్రేషన్ అనే మాటే ఉండదు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి



● మేడ్చల్ జిల్లా డీఎఫ్‌సీఎస్ ఛైర్మెన్ మన్నె రాజు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మత్స్య వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల, మత్స్యకారుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా డీఎఫ్‌సీఎస్ ఛైర్మెన్ మన్నె రాజు అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ గ్రామంలో మత్స్య శాఖ సంఘానికి ప్రొసీడింగ్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్- మన్నె రాజు ,మత్స్యశాఖ అధికారి సుకీర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా మన్నె రాజు మాట్లాడుతూ మత్స్యకారుల, మత్స్య కార్మిక సంఘం సంక్షేమానికి పెద్ద పీట వేయాలని కోరారు. జల వనరులలో ఉన్న మత్స్య సంపదప్రకృతి వ్యపరీత్యాలు, పారిశ్రామికాభివృద్ధి పేరిట పట్టణాల నుంచి రసాయనిక డ్రయినేజీ నీళ్లు చెరువులు, గుంటలలో కలవడంతో మత్స్య సంపద అంతరించిపోతుంద న్నారు. జలవనురులను కబ్జాలు, కాలుష్యం కొరలో నుంచి మత్స్య సంపదను వృత్తిదారులను కాపాడాలని కోరారు. కాలుష్యంతో చనిపోతే ఎలాంటి నష్టపరిహారం ఇవ్వడం లేదని అందోళన వ్యక్తం చేశారు. 50 ఏండ్లు నిండిన మత్స్యకారులకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలన్నారు. జిల్లాలోని చెరువులో కుంటలు ఎండిపోతున్నాయని ప్రభుత్వం బోర్లు వేయించి మత్స్యకారుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ గ్రామం మత్స్యశాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, శ్రీశైలం, కృష్ణ, సత్యనారా యణ సుమారు 200 మందికి పైగా మత్స్యశాఖ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు

సన్నబియ్యం పంపిణీ అభినందనీయం



నవతెలంగాణ-నిజాంపేట్

కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ అభినందనీయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి అన్నారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ సైదాపూర్ ఉమామహేశ్వరి లక్ష్మణ్ దంపతులు ఇంట్లో కొలను హనుమంత్ రెడ్డి ఇంట్లో భోజనం చేశారు. కాంగ్రెస్ తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం సప్లై ఇటీవల చేపట్టడంతో పేదల ఇండ్లల్లో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై సానుకూలమైన దృక్పథం ఏర్పడిందని ఈ సందర్భంగా కోలన్ అన్నారు. దేశంలోనే తొలిసారిగా తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ దే అని కొనియాడారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి లక్ష్మణ్ దంపతులు మాట్లాడుతూ కొలను తమ ఇంటికి భోజనానికి రావడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తమలాంటి పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం సంతోషంగా భావిస్తున్నామన్నారు. డి.సి.సి ఉపాధ్యక్షుడు ధమ్మని శ్రవణ్ కుమార్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, బహదూర్ పల్లి మాజీ సర్పంచ్ మైసి గారి శ్రీనివాస్, సిద్దినోళ్ళసంజీవరెడ్డి, మల్లికార్జున్, గఫార్ పాల్గొన్నారు.

యువ వికాస్ పథకానికి

కుత్బుల్లాపూర్‌లో ప్రత్యేక కేంద్రాలు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం కోసం నిరుద్యోగ యువత, యువకులు నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. దరఖాస్తులు స్వీకరణ ఈనెల 14వ తేదీ వరకు కొనసాగుతుంది. అభ్యర్థుల యొక్క వయసు 21 -60 సంవత్సరాల వరకు ఆమోదిస్తారు.

కుత్బుల్లాపూర్‌లో..

రాజీవ్ యువ వికాస్ పథకం దరఖాస్తు చేసుకోవడం కోసం కుత్బుల్లాపూర్ పరిధిలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు.

☞ కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉంది.

☞ సుభాష్ నగర్ డివిజన్‌లో గణేష్ గ్రౌండ్, సుభాష్ నగర్‌లో ఉంది.

☞ కుత్బుల్లాపూర్ డివిజన్‌లో పద్మా నగర్ రింగ్ రోడ్డు శివాలయం సమీపంలో ఉంది.

☞ జీడిమెట్ల డివిజన్ గాయత్రి నగర్ వార్డు కార్యాలయంలో సేవలు అందుబాటులో ఉన్నాయి.

దరఖాస్తుకు కావాల్సిన ధృవపత్రాలు...

1. ఆధార్ కార్డు
2. రేషన్ కార్డ్/ ఆధాయ ధ్రువీకరణ పత్రం
3. కుల ధృవీకరణ పత్రం (తెలంగాణ ప్రభుత్వం ద్వారా జారీ చేసి ఉండాలి)
4. శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకం కోసం)
5. పట్టాదార్ పాస్ బుక్ (వ్యవసాయ పథకం కోసం)
6. సదరం సర్టిఫికెట్లు (ఔజం)
7. పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో.. ఆసక్తి గలవారు మీసేవ కేంద్రాలు, ప్రజాపాలన సేవ కేంద్రాలు (పురపాలక సంఘ కార్యాలయం) లలో దరఖాస్తు చేసుకోవచ్చు.

మహిళ అదృశ్యం..

నవతెలంగాణ-బాలానగర్

ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరసింహారాజు తెలిపిన వివరాల ప్రకారం బాలానగర్ పారిశ్రామికవాడలో నివాస ముండే వివాహిత ఈ నెల 6న ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఈ నేపథ్యంలో భర్త పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో బాలిక అదృశ్యం...

ఫతేనగర్‌కు చెందిన బాలిక అదృశ్యమైన ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. సోమవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి బాలిక ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిపిన వారికి, స్నేహితులకు విచారించినా ఆచూకీ లభించలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే

మెరుగైన విద్యావిధానం



● టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే మెరుగైన విద్యావిధానం అమలవుతుందని ఎన్ని కష్టాలు వచ్చినా చదువుకు దూరం కావొద్దని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. మంగళవారం గాజులరామారం డివిజన్ గాజులరామారం గ్రామంలో గల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి సంపక్తి భోజనం చేస్తూ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యకు చాలా ప్రాధాన్య తేవడం జరుగుతుందన్నారు.రాబోయే రోజుల్లో నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ని కూడా ప్రారంభించబోతున్నామని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు లాల్ మొహమ్మద్, మరలింగ, పవన్, హర్భజన్ సింగ్, అన్వర్, సాయికాంత్, సందీప్ పాల్గొన్నారు.

బస్తీలో సమస్యలపై కార్పొరేటర్ పర్యటన..



నవతెలంగాణ-బాలానగర్

మూసా పేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో బస్తీ సమస్యలపై కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఏఆ రాధకృష్ణతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌మాట్లాడుతూ డివిజన్ పరిధిలో కొంత భాగం రోడ్డు దెబ్బతినడంతో నూతనంగా రోడ్డు నిర్మాణం నిర్మించాలని బస్తీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. బస్తీ వాసుల విజ్ఞప్తి మేరకు వెంటనే స్పందించిన కార్పొరేటర్ అతి త్వరలో రోడ్డు వేయిస్తామని హామీ హామీ ఇచ్చారు. అదేవిధంగా బస్తీలలో వీధి దీపాలు వెలగడం లేదని, సమస్యను వివరించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కంచి స్వామి, కంచి పాండు, శ్యామ్ గౌడ్, రాము గౌడ్, కోట సురేష్, కోట కమల్, కోట కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

10

బుధవారం | ఏప్రిల్ 09, 2025 | www.navatelangana.com

సాయి నగర్ నూతన కమిటీ



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్‌లోని లాలాపేట్‌లోని సాయి నగర్ (డబుల్ బెడ్ రూం) బస్తీకి నూతన కమిటీ గౌరవ దిశ కమిటీ సభ్యురాలు శారదా మల్లేష్ పర్యవేక్షణలో సాయి నగర్ బస్తీవాసులు అధ్యక్షులుగా ఆంజనేయులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నర్సింగరావు సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా, పద్మ, రవిని ఎన్నుకున్నారు. నూతన కమిటీకి శారదా మల్లేష్ శుభాకాంక్షలు తెలిపారు. బస్తీ సమస్యలను పరిష్కారానికై కృషి చేస్తానని చెప్పారు.



అసెంబ్లీలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట కవిత చేపట్టిన పూలే విగ్రహ సాధన దీక్షలో ఆమెకు జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్ మద్దతు పాల్గొన్న ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నవతెలంగాణ-బంజారాహిల్స్

మహనీయుల జయంత్యోత్సవాలకు స్పీకర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-ఓయూ

మహనీయుల జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఓయూ ఏర్పాట్లు చేస్తోంది. మహాత్మా జ్యోతిబా పూలే, బాబూ జగ్జీవన్ రామ్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌లకు ఘనంగా నివాళులర్పిస్తూ నిర్వహించే జయంత్యోత్సవాలకు ముఖ్య అతిథిగా శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ హాజరు కానున్నారు. ఈ మేరకు సభాపతి నివాసంలో ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం, రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేందర్ కుమార్ నాయక్‌లు ఆయన్ని ఆహ్వానించారు. ఈ నెల 10 నుంచి 13 వరకు నాలుగు రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఈ సందర్భంగా స్పీకర్‌కు వివరించారు. ఓయూలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి ప్రణాళికలను తెలియజేశారు. మహనీయుల జయంత్యోత్సవాల నిర్వహణపై స్పీకర్ ప్రసాద్ కుమార్ ఓయూ వీసీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓయూ ఆహ్వానం పట్ల సానుకూలంగా స్పందించారు. కార్యక్రమానికి హాజరు కానున్నట్టు తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులు తరగతుల బహిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో 12 యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకి ఉద్యోగ భద్రత కల్పించాలని మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఓయూలో తరగతులు బహిష్కరించి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ముందు కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా. విజేందర్ రెడ్డి, డా. ధర్మతేజ మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ భద్రతతో కూడిన స్కేల్ ఇవ్వాలని లేనిపక్షంలో యూనివర్సిటీలలో మరో తెలంగాణ ఉద్యమంలా ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. రేపటి నుంచి యూనివర్సిటీలలో తరగతులను బహిష్కరించి ఉద్యమం చేయాలనీ నిర్ణయించడం జరిగిందన్నారు. యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ సమస్య పరిష్కరించకుండా జీవో 21ని తీసుకురావడం జరిగిందన్నారు. ఈ జీవో యూజీసీకి విరుద్ధంగా ఉందని తక్షణమే జీవో 21ని రద్దు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డా. సీమర్ల విజేందర్ రెడ్డి, డా. ధర్మతేజ, రేష్మారెడ్డి, డా. మోడెమ్ రవి, డా. ఓ. కృష్ణయ్య, డా. తాలపల్లి వెంకటేష్, డా. మహేందర్, డా. అరుణ్, డాక్టర్ కిరణ్, డాక్టర్ అశోక్ ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

మాతృ భాష కన్నా గొప్పది ఏది లేదు



- గోర్ బోలిని 8వ షెడ్యూల్‌లో చేర్చండి
- గోర్ బోలి పరిరక్షణ సమితి

నవతెలంగాణ-బంజారాహిల్స్

మాతృ భాష కన్న గొప్పది ఏది లేదనీ, దేశంలోని బంజారా, లంబాడిలా ఆత్మ గౌరవనికి తగిన ప్రాదన్యత ఇస్తూ తిర్మంచిన రాష్ట్ర ప్రభుత్వన్నీ అభినందిస్తూ, కేంద్ర ప్రభుత్వన్ని గోర్ బోలిని 8వ షెడ్యూల్‌లో చేర్చలనీ గోర్ బోలి పరిరక్షణ సమితి కోరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మేనేజింగ్ ట్రస్టీ ఎస్‌కే రామచందర్ నాయక్, మెంబర్ అఫ్ ట్రస్ట్ సభ్యులు మాజీ ఐఏఎస్, డీటీ నాయక్, ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ జీవన్ లాల్ లావద్య, హరి కిషన్, భీమా నాయక్ మాట్లాడారు. 12 కోట్ల జనాభా కలిగిన బంజారా, లంబాడిలా గౌరవానికి ప్రాధాన్యత ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తమ జాతి బిడ్డల మాతృ భాష గోర్ బోలినీ గుర్తించి, హిందీ తర్వాత అత్యధికంగా మాట్లాడే భాష కాబట్టి లిపి లేకున్నా ఇండో యూరప్ భాష కాబట్టి దాన్ని గుర్తించి 8వ షెడ్యూల్లో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో భానోత్ నెహ్రూ నాయక్, వీరన్న, అమర్ సింగ్, వెంకటేష్ చౌహాన్, ఎస్ కె ప్రసాద్‌లు తదితరులు పాల్గొన్నారు.

విశ్వాస జీవి ఆత్మీయ నేస్తం శునకం



- పెట్స్ అందించే ప్రేమ అమూల్యం
- సినీ గేయ రచయిత చంద్రబోస్

నవతెలంగాణ-బంజారాహిల్స్

శునకం మనిషికి అత్యంత ఆత్మీయ నేస్తమని నిస్వార్థంగా మనల్ని ప్రేమించే వాటిని తిరిగి ప్రేమించడం బాగోగులు చూడడం మన బాధ్యతని టాలీవుడ్ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ అన్నారు. నగరంలోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 11లో ఏర్పాటు చేసిన కొత్త, అత్యాధునిక డాగీ విల్లే ని వ్యవస్థాపకురాలు అమృత వర్షిణితో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాగీ విల్లేలో ముఖ్యంగా శునకాలను ఎక్కడా బంధించి ఉంచకుండా స్వేచ్ఛగా విహరించే వాతావరణం కల్పించడం బాగుందన్నారు. శునకం పరిమాణం, వయస్సు స్వభావాన్ని బట్టి వాటికి వేర్వేరు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం ప్రశంసనీయమన్నారు. ఈ సెంటర్‌ను చూసి తనలో కలిగిన భావోద్వేగాలని ఆయన అప్పటికప్పుడు ఓ పాట రూపంలో ఆకట్టుకునేలా పాడి వినిపించారు. డాగీ విల్లేలో కేజ్-ఫ్రీ బోర్డింగ్, డేకేర్, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, స్పా, బిహేవియర్ థెరపీ, డాగ్ బోర్డింగ్, గ్రూమింగ్, డాగ్ వాకర్, స్పా వంటి అనేక రకాల సేవలు అందిస్తున్నామని మీడితో మాట్లాడుతూ.. డాగీ విల్లే వ్యవస్థాపకురాలు అమృత వర్షిణి తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వమే ..

అత్యధికంగా నిధులు మంజూరు చేసింది

- గత ప్రభుత్వం పదేండ్లలో రూ.3652 కోట్లు మాత్రమే..
- ఒక్క ఏడాదిలో జీహెచ్‌ఎంసీకి రూ.2752 కోట్లు విడుదల
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్‌ఎంసీకి నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మకమైన రికార్డు నమోదు చేసిందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్‌ఎంసీకి సుమారుగా రూ.6045 కోట్లు కేటాయించగా, ఇప్పటి వరకు రూ.2752 కోట్ల నిధులను విడుదల చేసిందని తెలిపారు. అందులో బడ్జెట్‌లో కేటాయించిన రూ.2,965.61 కోట్లలో రూ.1552.52 కోట్లు విడుదల చేయగా, స్టాంప్ డ్యూటీ అమౌంట్ రూ.1150 కోట్లు, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్స్ రూ.49.36 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం జీహెచ్‌ఎంసీకి పది సంవత్సరాల కాలంలో (2014-2023) కేవలం రూ.3652 కోట్ల నిధులు విడుదల చేసిందని, అందులో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ గ్రాంట్ రూ.1415.39 కోట్లు కాగా, స్టాంప్ డ్యూటీ రూ.1776.53 కోట్లు, కేటాయించిన బడ్జెట్‌లో రూ.460.79 కోట్ల నిధులు మాత్రమే విడుదల చేసిందన్నారు. గత ప్రభుత్వం జీహెచ్‌ఎంసీకి 10 సంవత్సరాలలో ఇచ్చిన మొత్తం కంటే ప్రస్తుత ప్రభుత్వం ఒక్క సంవత్సరంలోనే ఎక్కువ నిధులు విడుదల చేయడం జీహెచ్‌ఎంసీ అభివృద్ధికి కీలకమైన సంకేతంగా చెప్పవచ్చన్నారు. నిధుల కేటాయింపు, విడుదల నగర మౌలిక వసతుల అభివృద్ధికి, ట్రాఫిక్ నియంత్రణ పనులకు, వివిధ ప్రాజెక్టులకు, నగర శుభ్రతకు, ప్రజల భద్రతకు ఘననీయంగా తోడ్పడతాయని మేయర్ తెలిపారు. ప్రజాపాలన రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించడం ఇందుకు నిదర్శనమని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. నగరాభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మేయర్ నగర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలపై సుదీర్ఘ చర్చ.. పలు అంశాలు ఆమోదం

- హాజరైన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలో సమస్యలు పరిష్కారం కోసం అభివృద్ధి పనులు చేపట్టేందుకు మంగళవారం బోర్డు కార్యాలయంలో బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ నంజుండేశ్వర అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే శ్రీ గణేష్ సమావేశంలో సీఈవో మధుకర్, బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మద మల్లికార్జున్‌లు బోర్డు అధికారులు పాల్గొన్నారు. రోడ్లు, నీటి వసతి, శవరేజ్ పైప్ లైన్, ఎలక్ట్రిసిటీ, లాంటి మౌలిక వసతులపై చర్చించారు. సమావేశానంతరం వారు వేరువేరుగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ..

లాల్ బజార్లోని గాంధీ కమ్యూనిటీ హాల్ పేదవాళ్లు పెండ్లీ చేసుకునేందుకు ఉపయోగంగా ఉండేదాన్ని దానిని డంప్ యార్డ్ చేశారు. దానిని వెంటనే షిఫ్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. కంటోన్మెంట్‌లో ఇండ్లు కట్టుకోవడానికి ఇప్పుడు ఉన్న నిబంధనలు మార్చేందుకు కేంద్రం అనుమంతించింది. కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపించాలని బోర్డును కోరామన్నారు. బోర్డ్‌కు కరెంటు, ప్రజలకు నీళ్ళ సమస్య లేకుండా చేయాలని సూచించారు. సఫాయి కార్మికులకు కారుణ్యనియామకాలలో 5 శాతం ఉన్న సీలింగ్ ఎత్తివేయాలని, కరోనా సమయంలో చెనిపోయిన వారి కుటుంబాలందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని కోరడం జరిగింది. ఆ పేదలందరికీ కంపాషినేట్ పోస్టింగ్స్ అందిస్తాం. మిలటరీలలో పనిచేయడానికి ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి వచ్చిన వారికి 60 గజాల స్థలాలు లీజుకు ఇచ్చారు. వారికి పదే పదే నోటీసులు ఇస్తున్నారు. ఇల్లు కూలగొడతామని అంటున్నారు. అలాంటి పిచ్చి పనులు చేయవద్దని చెప్పామని తెలిపారు

ఎమ్మెల్యే శ్రీ గణేష్ మీడియాతో మాట్లాడుతూ..

బోర్డు సమావేశం అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మీడియాతో మాట్లాడుతూ.. బోర్డులో ఉన్న సమస్యలు తీరాలంటే బోర్డును జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం లేదా ఎన్నికలు జరిపించాలని అన్నారు. అప్పుడేతక్షణమే ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఉంటుందని నామినేటెడ్ మెంబర్‌తో పాలన ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం అన్నారు. సమావేశంలో సర్వీస్ ఛార్జెస్ ఎంత బకాయి ఉందో రోడ్డు సమావేశంలో పలు అంశాలపై అధికారులతో చర్చించామన్నారు. కంటోన్మెంట్‌లో నిర్మాణాలకు సంబంధించి బిల్డింగ్ బై లాస్, వేసవి కాలం నేపథ్యంలో నీటి సరఫరా, బోర్డ్ పరిధిలోని వాటర్ బోర్‌లకు కరెంట్ కనెక్షన్, సర్వీస్ ఛార్జెస్ , కంటోన్మెంట్ పరిధిలో చేపడుతున్న పలు అక్రమకట్టడాల విషయంలో చర్యలు తీసుకోవల్సిన అంశం పై చర్చించమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ అసెంబ్లీలో సాయిబాబా నగర్ లో టాయిలెట్ల నిర్మాణం కోసం మాట్లాడిన నేపథ్యంలో టెండర్ ఖరారయిందని ఆ ప్రాంత ప్రజల సమస్య త్వరలోనే తీరుతుందని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయండి

- ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన దళిత చైతన్య సంఘం



నవతెలంగాణ-బంజారాహిల్స్

గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్‌ఎంసీలో అవినీతి నిలయంగా మారిన టౌన్ ప్లానింగ్ విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని ప్రభుత్వానికి దళిత చైతన్య సంఘం విజ్ఞప్తి చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైతన్య సమితి అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్, మధుసూదన్, శేషాద్రి మాట్లాడారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అంతులేని అవినీతి చోటు చేసుకుంటుందని, చైన్ మెన్లు సెక్షన్ ఆఫీసర్లు ఏండ్ల తరబడి ఒకే ప్రాంతంలో తిష్ట వేసుకుని కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. ఇప్పటికే అవినీతికి పాల్పడుతున్న చైన్ మెన్లను బదిలీ చేయాలని జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహానగరంలో ఎలాంటి నిబంధనలు పాటించకుండా అక్రమ నిర్మాణాలు జరగడానికి టౌన్ ప్లానింగ్‌లోని అవినీతి ఉద్యోగులు అధికారులే కారణమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజాపాలన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీహెచ్ శాంతికుమారిలు జీహెచ్‌ఎంసీలో జరుగుతున్న అవినీతిపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్రంగా ప్రక్షాళన చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే నేరుగా ప్రభుత్వ పెద్దలను కలిసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ విషయంలో నగర మేయర్ నగర ప్రజా ప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని 20 గజాల్లో నాలుగు ఫ్లోర్లు 30 గజాలు ఐదు ఫ్లోర్లు నిర్మాణం చేపట్టి నగరాన్ని భ్రస్టు పట్టిస్తున్నారని, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ.. మంచినీటి ఎద్దడి మురుగునీటి కష్టాలు, ఎక్కడ చూసినా వ్యర్థాలు నగర జనజీవనాన్ని పూర్తిగా అనారోగ్యాల పాలు చేసేలా ఈ నిర్మాణాలు జరగడం నాణ్యతలేని నిర్మాణాలు కుప్పకూలి నిరుపేదలు మృతి చెందడం కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

దొంగ ప్రాణాలు కాపాడిన కాలనీవాసులు

- చోరి చేసి పారిపోతూ కిందపడి తలకి గాయం.. ఆస్పత్రిలో చేర్చిన కాలనీవాసులు

నవతెలంగాణ-బేగంపేట్

ఓ వ్యక్తి మద్యం మత్తులో సెల్ ఫోన్ దొంగతనానికి వచ్చి ఇంట్లో వాళ్ల నిద్రలేవడంతో పట్టుకుంటారేమోనని భయంతో పారిపోతూ మెట్లపై నుంచి జారి పడి తీవ్ర గాయాలపాలై స్పృహతప్పి పడిపోయాడు. దొంగేకదా చితకబాదుతామన్న ఆలోచన చేయకుండా ఆ కాలనీ వాసులు స్పృహతప్పిన దొంగను పోలీసుల సహకారంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటన గోపాలపురం పీఎస్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. పేషంట్ కోలుకొని, ఇంటికి వెళ్ళిపోయినట్టు సీఐ నరేశ్ తెలిపారు. గోపాలపురం ఇన్‌స్పెక్టర్ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రెజిమెంటల్ బజారు మనోహర్ థియేటర్ సమీపంలోని ఓ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి ఫుల్లుగా మద్యం తాగి దొంగతనానికి యత్నించాడు. మెట్లు ఎక్కి పైకివెళ్ళిన అతడు కిటికీలో నుంచి సెల్ ఫోన్‌ను దొంగిలించాడు. ఇదే సమయంలో అలికిడి కావడంతో ఇంట్లో వారు నిద్రనుంచి మేల్కొనగా ఇది గమనించిన అతడు పారిపోయేందుకు ప్రయత్నం చేశాడు. మెట్ల నుంచి కిందకు పరుగెత్తుతుండగా మెట్ల నుంచి జారి పడి గాయాలు కావడంతో పాటు స్పృహ కోల్పోయాడు. ఇది గమనించిన స్థానికులు దొంగను పట్టుకుని దేహశుద్ధి చేయకుండా మానవతా దృక్పదంతో పోలీసులకు సమాచారం అందించి గాయాలపాలైన దొంగను ఆస్పత్రికి తరలించారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా ఆస్పత్రిలో చికిత్స అనంతరం సదరు సెల్ ఫోన్ దొంగకు కుటుంబసభ్యులు ఎవరు లేకపోడంతో తానే ఒంటరిగా ఇంటికి వెళ్లిపోయినట్టు తెలిసింది.

దొంతికి మంత్రి పదవి ఇవ్వాలి



- ఓయూ జేఏసీ కో కన్వీనర్ ఉండ్రాతి శ్రీను యాదవ్

నవతెలంగాణ-ఓయూ

నర్సంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని కష్టాల్లో కాపాడిన దొంతి మాధవరెడ్డి మాత్రమేనని ఓయూ జేఏసీ కన్వీనర్ కో కన్వీనర్ ఉండ్రాతీ వీరుయాదవ్, శ్రీను యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కూడా నర్సంపేట నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించి, టికెట్ రాకపోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచిన గొప్ప నాయకుడని, ప్రజలను నమ్ముకుని ఒకే పార్టీకి సేవ చేస్తున్న ప్రజల నాయకుడు దొంతి అని అన్నారు. తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేస్తు, ప్రజల సమస్యలు తీర్చడంలో గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ సారి నూతన మంత్రి వర్గ విస్తరణలో తప్పకుండా దొంతికీ మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. వెంట సతీష్, శ్రవణ్, నవీన్, లెనిన్, అశోక్, ఉమేష్, గని, అనిల్, శ్రీను పాల్గొన్నారు.

అప్ గ్రేడ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి

- తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల సమావేశము తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలు కార్యవర్గము తీర్మానాలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు అందరిని వెంటనే అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్టుగా అప్ అప్‌గ్రేడ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వము ఇటీవల విడుదల చేసినటువంటి జీవో 21లో పార్ట్ టైం అధ్యాపకులకు వెయిటేజ్ ఇవ్వకపోవడం, పార్ట్ టైం టీచర్ల పట్ల వివక్షత చూపడం, కాబట్టి పార్ట్ టైం అధ్యాపకులు దీనిని వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వము వెంటనే పార్ట్ టైం అధ్యాపకులు అందరిని అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్ట్‌గా అప్‌గ్రేడ్ చేసేంతవరకు ఎటువంటి నోటిఫికేషన్‌కు వెళ్లకూడదని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో 12 యూనివర్సిటీలకు చెందిన పార్ట్ టైం అధ్యాపక ప్రతినిధులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఎండాకాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు కంటోన్మెంట్ 7వార్డు తిరుమలగిరిలో సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు నాగినేని సరిత టీచర్స్ కాలనీ లాల్ బజార్ బస్ స్టాప్‌లో చలివేంద్ర కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలంలో వివిధ పనుల మీద బయటికి వచ్చే ప్రజలకు స్వచ్ఛమైన, చల్లని మంచినీరు ఉచితంగా అందించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కాంగ్రెస్ నాయకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కంటోన్మెంట్ వ్యాప్తంగా క్యాంపులు ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్యే హర్షం వక్తం చేశారు. మానవ సేవే మాధవ సేవ అని, అన్ని కులాలు మతాల కన్నా మానవత్వమే గొప్పదని అన్నారు. మరింతమంది దాతలు ముందుకు వచ్చి ఇలాంటి సేవా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ కాలనీ ప్రెసిడెంట్ బిక్షపతి, కాలనీ వాసులు కాంగ్రెస్ నాయకులు బంగారు సదానంద్, మారుతీగౌడ్, సంతోష్ యాదవ్, వైష్ణవి, రేమండ్, ప్రదీప్, రంజిత్, శ్రీను, మహేష్, సాంసన్ రాజు, సత్యనారాయణ, మారుతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటుకు చేయూతనందిస్తా



- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-ఓయూ

లష్కర్ జిల్లా సాధనకు తనవంతు చేయూతను అందిస్తానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. మంగళవారం లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధుల బృందం బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ప్రజలకు పాలనను మరింత చేరువలో ఉంచేదుకే ఆనాడు కేసీఆర్ రాష్టంలో పలు జిల్లాలను ఏర్పాటు చేశారాని ఆమె గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని తప్పకుండ సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ విషయంపై ముఖ్యమంత్రికి లేఖ రాయడంతో పాటు వచ్చే అసెంబ్లీ సమావేశంలో కౌన్సిల్ ఈ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తానని కవిత లష్కర్ సాధన సమితి ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, జీఎస్ బాలరాజ్ యాదవ్, శైలందర్, సునీల్ ముదిరాజ్, శ్రీకాంత్ రెడ్డి, అశోక్ చారి, కృష్ణ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

అహ్మదాబాద్ బయలుదేరిన కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో జరుగుతున్న ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సమావేశాలకు కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులూ, ముఖ్యనాయకులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఏఐసీసీ సభ్యురాలు డా.కోట నీలిమ కూడా పాల్గొనడానికై అహ్మదాబాద్ బయలుదేరారు. పార్టీ పునరుజ్జీవన వ్యూహం, రాజకీయాలపై చర్చలు, అన్నీ రాష్ట్రాలలో పార్టీ పటిష్టత, భవిష్యత్ కార్యాచరణే ధ్యేయంగా ఈ మీటింగ్ నిర్వహించబడుతోందని ఈ సందర్భంగా డా.కోట నీలిమ అన్నారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్రం



- తెలంగాణ జమాతే ఇస్లామి హింద్

నవతెలంగాణ-బంజారాహిల్స్

లోక్ సభలో వక్ఫ్ సవరణ చట్టం-2025 ఆమోదం పొందడాన్ని తెలంగాణ జమాతే ఇస్లామి హింద్ (జేఐహెచ్) ఉపాధ్యక్షుడు అబ్దుల్ మజీద్ షోయిబ్ తీవ్రంగా ఖండిస్తూ.. దీనిని మత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్ చట్టం ఆమోదం పొందడం ఖండనీయం, దేశంలో మత స్వేచ్ఛ రాజ్యాంగ హక్కులపై ప్రత్యక్ష దాడి అని జేఐహెచ్ ఉపాధ్యక్షుడు మీడియాకు ఇచ్చిన ప్రకటనలో తెలిపారు. ఈ చట్టం వివక్షతతో కూడుకున్నది, ఎందుకంటే ఇది ముస్లింలు తమ మతపరమైన ఆస్తులను సంరక్షించడంలో స్వయంప్రతిపత్తిని హరింపజేస్తుంది. అదే సమయంలో ఇతర వర్గాల మతపరమైన ట్రస్టులు ప్రభావితం కావు. ఈ చట్టం 1995 వక్ఫ్ చట్టంలో భారీ మార్పులను తీసుకువస్తుంది, ఇది వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ప్రభుత్వ జోక్యాన్ని పెంచుతుంది. మతపరమైన మైనారిటీలకు వారి స్వంత మత సంస్థలను నిర్వహించే హక్కును కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను బలహీనపరుస్తుంది. పార్లమెంటరీ చర్చ సందర్భంగా అధికారపక్ష సభ్యులు చేసిన తప్పుడు వాదనలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అనేక రాష్ట్రాలు హిందూ, సిక్కు ఎండోమెంట్‌ల కోసం ప్రత్యేకమైన చట్టాలను కలిగి ఉన్నాయని, పర్యవేక్షక అధికారులు సంబంధిత మత వర్గాలకు చెందినవారు మాత్రమే ఉంటారని ఆయన గుర్తు చేశారు. వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగాన్ని పరిష్కరించడానికి చట్టంలో ఎటువంటి నిర్దిష్ట చర్యలు లేవు. బదులుగా, ముస్లిమేతర సభ్యులను చేర్చడం, ప్రభుత్వం నామినేట్ చేసిన అధికారులకు నియంత్రణను బదిలీ చేయడం సమస్యను పరిష్కరించదు.

గర్భిణికి క్లిష్టమైన శస్త్రచికిత్స

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బాలానగర్‌లో నివసిస్తున్న నిండు గర్భిణి తీవ్ర రక్త స్రావంతో ఈనెల 5న అమీర్‌పేట్‌లోని ప్రభుత్వ సీహెచ్‌సీ హాస్పటల్‌కు ఆమె బంధువులు తీసుకొచ్చారు. వెంటనే డాక్టర్స్ అన్ని పరీక్షలు నిర్వహించి ఎనిమిది నిమిషాలలో ఆపరేషన్ నిర్వహించి తల్లి బిడ్డను రక్షించారు.హాస్పిటల్ సూపరింటెండెం ట్ డా. మహమ్మద్, ఆర్ఎంఓ వినాయక్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. గర్భిణీ స్త్రీకి గర్భంలో మాయ విడిపోయి అధిక రక్తస్రావంతో హాస్పటల్‌కి రావటం జరిగిందని, వెంటనే గైనకాలజిస్ట్ డాక్టర్ బృందం, అనస్థీషియా డాక్టర్‌లు ఆపరేషన్ చేసిడెలివరీ చేసి తల్లి బిడ్డను కాపాడారు. మంగళవారం తల్లి బిడ్డను పరీక్షించిన డాక్టర్‌లు ఇద్దరు క్షేమంగా ఉన్నారని ఆరోగ్యంగా ఉన్నారని, త్వరలో డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపిస్తామని చెప్పారు. మహిళ కుటుంబ సభ్యులు ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వ హాస్పిటల్లో ఎంతో విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించి తల్లి బిడ్డకు ప్రాణదానం చేశారని, ప్రయివేటు హాస్పిటల్‌కు వెళ్లి ఉంటే లక్షల రూపాయలు ఖర్చు చేయవలసి వచ్చేదని, పేదవారమైన మాకు అమీర్‌పేట్ ప్రభుత్వ హాస్పిటల్ డాక్టర్స్ చేసిన మేలు ఎప్పటికీ మరిచిపోమని డాక్టర్స్‌ను అభినందించారు. అమీర్‌పేట్‌లో 50 పడకల హాస్పిటల్ అన్ని వైద్య పరీక్షలు నిర్వహించే సామాగ్రితో, సామర్థ్యంతో అధునాతన పరికరాలతో నిర్మించడం జరిగిందని, ప్రతి ఒక్కరూ అమీర్‌పేట్ ప్రభుత్వ హాస్పిటల్‌ను వినియోగించుకోవాలని కోరుతున్నారు.

నవతెలంగాణ
హైదరాబాద్
HMDA
బుధవారం | ఏప్రిల్ 09, 2025 | www.navatelangana.com

హుస్సేన్ సాగర్‌లో దూకిన యువతిని కాపాడిన హైడ్రా



నవతెలంగాణ-సిటీబ్యూరో

హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించిన యువతిని హైడ్రా డీఆర్ఎఫ్ బృందం మంగళవారం కాపాడింది. బాలానగర్ రాజీవ్ గాంధీ కాలనీ చెందిన మెర్రి అనే మహిళ కుటుంబ కలహాల కారణంగా మంగళవారం హుస్సేన్ సాగర్లోకి దూకి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు ఈ సమాచారాన్ని హైడ్రాకు ఫోన్ చేసి చెప్పగా వెంటనే డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. తాళ్ళ సాయంతో సిబ్బంది ఆమెను సురక్షితంగా కాపాడారు. తర్వాత కుటుంబ సభ్యులకు ఆమెను అప్పగించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేదలు, వృద్ధులు, వికలాంగులకు సహాయ సహకారాలు అందజేస్తూ వస్తున్న సెవెన్ రేస్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ సారా పేద విద్యార్థులనూ ఆదుకుంటున్నారు. ఇటీవల ఫీజులు చెల్లించి మరీ పేద విద్యార్థులను ఆయా కాలేజీల్లో చేర్పించి సారా నేడు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను అండగా నిలుస్తున్నారు. మంగళవారం మల్కాజిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల)లో 9వ తరగతి చదివే విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు.

టీబీ గుర్తింపులో ఏఐ విప్లవం..!

- కిమ్స్ హాస్పిటల్ అతిపెద్ద పరిశోధన
- 16,675 మంది చెస్ట్ ఎక్స్-రేల విశ్లేషణ
- టీబీ ఉన్నట్టు 88.7శాతం,లేదని 97శాతం ఖచ్చితత్వం



నవతెలంగాణ-సిటీబ్యూరో

చెస్ట్ ఎక్స్-రేలను ఉపయోగించి క్షయ వ్యాధి (టీబీ)ని గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి కిమ్స్ హాస్పిటల్ అతిపెద్ద పరిశోధన చేసింది. ఎక్కడా మానవ ప్రమేయం లేకుండా, క్యూఎక్స్ఆర్ అనే అత్యాధునిక ఏఐ టూల్‌ను ఉపయోగించి మొత్తం 16,675 మంది పేషెంట్ల చెస్ట్ ఎక్స్-రేలను విశ్లేషించారు. ఇందులో ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి పెట్టారు. ముందుగా ఏఐ ద్వారా టీబీని గుర్తించడం, ఆ తర్వాత రేడియాలజిస్టులు దాన్ని నిర్ధారించడం.

88.7శాతం ఉన్నట్టు.. 97శాతం లేనట్టు..

టీబీ కేసులను గుర్తించడంలో ఏఐ టెక్నాలజీ అత్యంత సమర్థమైనదని ఈ పరిశోధన ద్వారా తెలిసినట్టు వైద్యులు గుర్తించారు. మొత్తం గుర్తించిన కేసుల్లో 88.7శాతం ఖచ్చితమైనవిగా తేలింది. దీంతో వ్యాధిని త్వరగా గుర్తించడంలో ఏఐ కీలకపాత్ర పోషిస్తుందని వైద్యులు నిర్ధారణకు వచ్చారు. దానికితోడు.. ఇందులో టీబీ లేదని నిర్ధారించడంలో 97శాతం ఖచ్చితత్వాన్ని ఏఐ సాధిస్తే.. ఏఐ టూల్ స్పెసిఫిసిటీ 69.1శాతంగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ప్రమాణాలను ఇది అందుకుంటోంది.

నిర్ధారించిన రేడియాలజిస్టులు

ఏఐ గుర్తించిన కేసులన్నింటినీ నిపుణులైన రేడియాలజిస్టులు కూడా నిర్ధారించడం ఇందులో మరో కీలకమైన అంశం. అందువల్ల క్లినికల్ డయాగ్నసిస్‌లో ఏఐ సామర్థ్యం, దాని ఖచ్చితత్వాలకు ఇది నిదర్శనంగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న టీబీ కేసుల నేపథ్యం, సంప్రదాయ రేడియోగ్రఫీతో దాన్ని నిర్ధారించడానికి ఎక్కువ సమయం పడుతున్నందు వల్ల ఇది మెరుగైన ప్రత్యామ్నాయం కానుందని వైద్య నిపుణులు అంచనా వేస్తున్నారు.

పెరుగుతున్న ఏఐ పాత్ర

వైద్య పరీక్షలను విప్లవాత్మకం చేయడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర పెరుగుతున్న విషయాన్ని ఈ పరిశోధన నిర్ధారిస్తోంది. క్యూఎక్స్ఆర్ లాంటి ఏఐ టూల్స్ అంతర్జాతీయ టీబీ గుర్తింపు ప్రమాణాలను అందుకోవడంతో రోజువారీ చికిత్సా విధానాల్లో వాటిని జతచేయడం వల్ల వ్యాధులను త్వరగా గుర్తించి, మెరుగైన చికిత్సా ఫలితాలు సాధించవచ్చు. ఏఐ రోజురోజుకూ మరింత వృద్ధి చెందుతుండడంతో టీబీ లాంటి సాంక్రమిక వ్యాధులపై సమరం మరింత సమర్థంగా చేయొచ్చు. దీనివల్ల మరింత సమర్థమైన చికిత్సలను అందించేందుకు వీలుంటుందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

ఇది గేమ్ ఛేంజర్ కానుంది

టీబీ గుర్తింపులో ఏఐ టూల్ సామర్థ్యం, దాని ఖచ్చితత్వం చాలా బాగున్నాయి. ఇది గేమ్ ఛేంజర్ కానుంది. ముఖ్యంగా నిపుణులైన రేడియాజిస్టులు ప్రతిసారీ అందుబాటులో లేని పరిస్థితుల్లో ఇలాంటివి ఎంతగానో ఉపయోగపడతాయి.

డాక్టర్ లతా శర్మ,
పల్మోనాలజీ విభాగాధిపతి, కిమ్స్ హాస్పిటల్స్

లోతుగా పరిశీలించేందుకు సులువైన సమయం

మానవ నైపుణ్యానికి ఏఐ ప్రత్యామ్నాయం కాలేదు గానీ, ప్రాథమిక పరీక్షల విషయంలో మాత్రం అది చాలా ఆధారపడదగ్గ పరికరంగా ఉపయోగపడుతుంది. అందువల్ల సంక్లిష్టమైన కేసుల్లో లోతుగా పరిశీలించేందుకు అవసరమైన సమయం వైద్యులకు దొరుకుతుంది.

– డాక్టర్ చైతన్య ఇసమళ్ల, సీనియర్ కన్సల్టెంట్ రేడియాలజిస్ట్, కిమ్స్ హాస్పిటల్

నిబంధనలు పాటించని హాస్టల్ యజమానులు

- నేరాలు జరిగితే హాస్టల్ యజమానులపై చర్యలు తీసుకుంటాము
- మధురానగర్ పోలీస్ అధికారుల హెచ్చరిక

నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మధురానగర్, వెంగళరావు నగర్, యూసుఫ్ గూడా పరిధిలో అనేక బాలికల ,బాలుర హాస్టల్స్ నడుపుతున్నారు . అనేకసార్లు మధురానగర్ పోలీస్ స్టేషన్ లో హాస్టల్ యజమానులతో సమావేశాలు ఏర్పాటు చేసి, హాస్టల్లో నేరాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ,సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని, అన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టాలని హెచ్చరించినప్పటికీ, హాస్టల్ యజమానులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. అదే విధంగా హాస్టల్స్ రూములలోనికి ప్రవేశించి లాప్టాప్స్, విలువైన వస్తువులు, బంగారు చైన్లు దొంగిలించిన సంఘటనలు జరిగినవి . ఇప్పటికే రెండు కేసులు నమోదు చేయగా సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో పని చేయనందున, నేరం చేసిన వ్యక్తులను గుర్తించుటకు ఆలస్యం జరుగుతున్నదని, దర్యాప్తు చేస్తున్నామని త్వరలో పట్టుకుంటామని మధుర నగర్ పోలీస్ అధికారులు తెలిపారు. హాస్టల్స్ పరిసరాలలో నేరాలు జరిగితే హాస్టల్ యజమానులపై చర్యలు తీసుకుంటామని, యజమానులపై కేసులు నమోదు చేసి u/s 125 బి.ఎన్.ఎస్ చట్ట ప్రకారం యజమానులకు మూడు నెలల జైలు శిక్ష , రూ. 2500/ జరిమానా విధించవచ్చని, హాస్టల్ యజమానులను హెచ్చరించారు .ప్రతి ఒక్క హాస్టల్ యజమాని పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కెమెరాలు 24 గంటలు పని చేయునట్లు పర్యవేక్షణ ఉండాలని ,24 గంటలు మూడు షిఫ్టులలో సెక్యూరిటీ గార్డులు ఉండాలని, హాస్టల్ నిర్వాహకుల వలన చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా యజమానులు జాగ్రత్తగా ఉండాలని, హాస్టల్ యజమానులకు హెచ్చరిక నోటీసులు ఇచ్చారు.

పోలీసుల అదుపులో వ్యభిచార ముఠా

నవతెలంగాణ - జవహర్ నగర్



గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నడిపిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్న సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడ లోని అంజనాద్రి నగర్ కాలనీలో ఒక ఇంట్లో గత కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఖాదర్ అలీముల్లా , నీమాన్ అలియాస్ రాజు పటేల్ , రుబీనా ఫూజిలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు చుట్టుపక్కల విచారణ చేయగా ఇక్కడ గత కొంతకాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఇట్టి ప్రాంతంలో విటుడు అయినా మహమ్మద్ రెహాన్ అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు. గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. విక్టిమ్స్ ఇద్దరినీ ప్రజ్వల హోం కి తరలిస్తామని తెలిపారు.



హైదరాబాద్ జిల్లాలోని మండలాలు, వార్డుల వివరాలు, విస్తీర్ణంతో కూడిన వివరాలతో తయారు చేసిన జిల్లా మ్యాప్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఆయన ఛాంబర్‌లో కలిసి డిస్ట్రిక్ సర్వే ఆఫీసర్ వి.శ్రీరామ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, కలెక్టర్ సీసీ వెంకట్రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో



శివాలయం చైర్మెన్ కన్నుమూత

- నివాళ్లర్పించిన ఎస్‌సీఆర్పీ సొసైటీ కమిటీ సభ్యులు

నవతెలంగాణ - సిటీబ్యూరో

నేరడమెట్ ప్రధాన రోడ్డులో ఉన్న శ్రీ అన్నపూర్ణ సాహిత కాశీ విశ్వనాథ దేవాలయం చైర్మెన్ బడే వెంకట్రావు మంగళవారం ఉదయం 9:30కు తుది శ్వాస విడిచారు. కొంతకాలంగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ గత నెల రోజులుగా తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గత నాలుగు రోజులుగా తీవ్ర అస్వస్థతకు లోనై పరిస్థితి విషమించడంతో కార్డియాక్ అరెస్టుతో తుది శ్వాస విడిచారు. ఈ విషయమై నేరేడ్‌మెట్ ప్రధాన రోడ్డులో ఉన్న ఎస్‌సీఆర్పీ సొసైటీ కమిటీ సభ్యులు అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో బడే వెంకట్రావు చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సొసైటీ జాతీయ అధ్యక్షులు రాజు వస్తాదు మాజీ అధ్యక్షులు డాక్టర్ రమేష్ అధ్యక్షులు పి.ఎస్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గంగాధరి కృష్ణ , ఎంఆర్ సుధాకర్ ఎలిమేల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యాప్రాల్‌లో యువకుడు హత్య

- తోటి స్నేహితులే చితక బాదడంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి
- నిందితులను రిమాండ్‌కు తరలింపు.

నవతెలంగాణ-జవహర్ నగర్



తోటి స్నేహితులే చితక బాదడంతో, రెండు రోజులుగా మృత్యువుతో పోరాడుతూ చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం యాప్రాల్ భగత్ సింగ్ కాలనీలో పుల్లూరి వెంకట్ నర్సయ్య భార్య ముగ్గురు కుమారులతో కలిసి నివసిస్తున్నారు. రెండో కుమారుడు ప్రణీత్(21) స్థానికంగా డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే కాలనీలో ఉంటున్న గోవర్ధన్ గంజాయి అమ్ముతున్నాడని ప్రణీత్ కాలనీలో చుట్టుపక్కల ప్రాంతాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాడని గోవర్ధన్ కోపం పెంచుకున్నాడు. అతని కోసం వేచి చూసి ఈనెల 5న రాత్రి గోవర్ధన్, జశ్వంత్, విన్సెంట్, ముగ్గురు కలిసి ప్రణీత్ తో మాట్లాడాలని పిలిపించుకున్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న గోవర్ధన్ , జశ్వంతులు, బైక్ పై ప్రణీత్ ను తీసుకెళ్లి కర్రలతో దారుణంగా చితకబాదారు. దీంతో ప్రణీత్ అపస్మారస్థితిలోకి వెళ్లడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు కుటుంబ సభ్యులకు జవహర్ నగర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న ప్రణీత్ కుటుంబ సభ్యులు అతని స్థానిక ప్రయివేటు హాస్పిటల్ కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 6న గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ఏ1 గోవర్ధన్, ఏ2జశ్వంత్, ఏ3విన్సెంట్లను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించామని ఎస్ హెచ్ ఓ సైదయ్య తెలిపారు.



ఈ నెల 12న శ్రీ హనుమాన్ విజయ యాత్ర నేపథ్యంలో హైదరాబాద్ పోలీసు అధికారులతో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ డీజీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలోవీర హనుమాన్ విజయ యాత్ర సందర్భంగా జరిగిన సంఘటనలు , బందోబస్తు ఏర్పాట్ల విషయమై చర్చించి వారికి తగిన సూచనలు అందజేశారు. కార్యక్రమానికి విక్రమ్ సింగ్ మాన్ , అడిషనల్ కమిషనర్ పోలీస్ లా అండ్ ఆర్డర్, ఎస్.చైతన్య కుమార్ స్పెషల్ బ్రాంచ్ డీసీపీ, పుష్ప డిసిపి ఐటి సెల్, వర్చువల్ గా జోనల్ డీసీపీలు, ఇన్‌స్పెక్టర్లు ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు. నవతెలంగాణ - సిటీబ్యూరో



న్యాయవాది ముజ్తబా అలి పై దుండగులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ మల్కాజ్ గిరి జిల్లా న్యాయస్థానం బార్ అసోసియేషన్ అధ్యక్షులు అమరేందర్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన నిరసన కార్యక్రమం నిర్వహించారు. అలాగే కమిటీ ఆధ్వర్యంలో బాధితున్ని హాస్పిటల్ లో పరామర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మాధవి, ప్రధాన కార్యదర్శి బాపిరెడ్డి కమిటీ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. నవతెలంగాణ -కాప్రా

జిమ్ ట్రైనర్ దారుణ హత్య

- చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి

నవతెలంగాణ-బోడుప్పల్



జిమ్ ట్రైనర్ పై డంబెల్ తో దాడి చేసిన సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి ఇందిరానగర్ కాలనీకి చెందిన ఏర్పుల సాయికిషోర్(34) జిమ్ నిర్వహిస్తున్నాడు.సోమవారం సాయంత్రం 7:30 సమయంలో తన అన్న స్నేహితుడు అయిన చంటితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు జిమ్ వద్దకు వచ్చి జిమ్‌లో ఉపయోగించే డంబెల్స్ తో విచక్షణారహితంగా దాడి చేశారు. అ దాడిలో తీవ్రంగా గాయపడిన కిషోర్ ను బోడుప్పల్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు.తన సోదరుడు సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి తెలిపారు.



కుషాయిగూడకు చెందిన మాజీ వార్డు సభ్యురాలు శ్రీదేవి మాతృమూర్తి అరుణకుమారి ఇటీవల పరమపదించిన విషయం తెలుసుకొని, మంగళవారం చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు ఏఎంసి డైరెక్టర్ బాల్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ తదితరులు ఉన్నారు. నవతెలంగాణ-చర్లపల్లి

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

ఎమ్మెల్యే బలాల



నవతెలంగాణ - మలక్‌పేట్

ప్రస్తుత వేసవికాలంలో నగరవాసులకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే బలాల అన్నారు. నియోజకవర్గంలోని హిల్స్ పార్క్ సలీం నగర్ కాలనీలో పైపులైన్లు లీకేజీ ఉండటంతో కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంటనే పైపు లీకులను సరిచేయాలని ఆదేశించారు. డ్రైనేజీలపై మూతలు వేయాలని కోరారు. ప్రతిరోజు మురుగు పూడికలు తీయాలని, దోమల నిర్మూలన మందు పిచికారి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట హెచ్ఎండబ్ల్యూఎస్, జీహెచ్ఎంసీ, కాలనీవాసులు ఉన్నారు.



తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్దదైన హైదరాబాద్ ఇంటర్ మూల్యాంకనం క్యాంప్-22 విజయవంతంగా పూర్తి చేసిన శుభ సందర్భంగా మంగళవారం హైదరాబాద్ జిల్లా క్యాంప్ ఆఫీసర్(డీఐఈవో) దాసరి ఒడ్డెన్నను టీజీజేఎల్ఏ-475 రాష్ట్ర సంఘం తరఫున వర్కింగ్ ప్రెసిడెంట్ కె.పి.శోభన్ బాబు కలిసి అభినందించారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

బీజేపీ అధికారంలోకి వచ్చాక

మహిళలపై పెరిగిన దాడులు



భారత జాతీయ మహిళా సమాఖ్య నాయకురాలు ప్రేమ్ పావని

నవతెలంగాణ- నాగోల్

బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు పెరిగాయని భారత జాతీయ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు ప్రేమ్ పావని, గ్రేటర్ హైదరాబాద్ సీపీఐ కార్యదర్శి ఛాయా దేవిలు అన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నాగోలు డివిజన్లోని సాయి నగర్ ధర్మభిక్షం భవనంలో భారత జాతీయ మహిళా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ సాయి నగర్ నూతన శాఖను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాయిదా బేగం అధ్యక్షతన జరిగిన నూతన కమిటీ సభకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపైన దాడులు పెరిగిపోయాయని, నాగాలాండ్ లో జరిగిన ఘటనలు చాలా దుర్మార్గంగా సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకునేలా ఉన్నాయని వారన్నారు. సమాజంలో సగ భాగమైన మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిత్యం దాడులకు గురవుతున్నారని ఆరోపించారు. అంతేకాదు అత్యాచారాలు, అవమానాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు అనేక సమస్యలపై పోరాటం చేసిందని, ఎన్ని చట్టాలు వచ్చినా, ఎన్ని ప్రభుత్వాలు మారినా మహిళల బతుకులు మారలేదని మండిపడ్డారు.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.చందు, భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి ఫమీద, గ్రేటర్ హైదరాబాద్ మహిళా సమైక్య అధ్యక్షురాలు నలినిలు మాట్లాడుతూ నూతన కమిటీ బలోపేతానికి మా సహాయ సహకారాలు, అండదండలు ఉంటాయని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని ఆరు, గ్యారెంటీల అమలు కోసం పోరాటం చేయాలని, మహిళలను చైతన్యవంతం చేసి పోరాటాలు చేసేవిధంగా ఈ కమిటీ కృషి చేయాలని అన్నారు. నూతన కమిటీ లో సహేదబేగం, ధనమ్మ, యస్ పద్మ, అచ్చాలి, కమిలి ప్రమీల,హేమలత అంజమ్మ బాలమని, పద్మ, నిర్మలమ్మ, పి.విజయలక్ష్మి, చిన్నమ్మ మణమ్మ, హేమలత, లక్ష్మి, లావణ్య షమీం, పల్లవి, అరుణ, సాయమ్మ, సరోజ తదితరులను ఎన్నుకున్నట్టు తెలిపారు.

నిధులు మంజూరు.. పనులు నిల్





- అసంపూర్తిగా నాదర్‌గుల్ ప్రధాన రహదారి నిర్మాణ పనులు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- నిధులు మంజూరైనా పూర్తి కాని నిర్మాణ పనులు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న స్థానికులు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్ గుల్ ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. దీంతో ప్రజలు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఆ ప్రధాన రహదారిని అభివృద్ధి చేయడం కోసం జనవరి నెలలో జరిగిన జనరల్ బాడి సమావేశంలో రూ.1కోటీ 50లక్షల నిధులను మంజూరు చేయించడం జరిగింది. ఆ నిధులతో నాదర్ గుల్ గ్రామంలోని బస్ స్టాండ్ ఆవరణంలో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను గ్రామానికి చెందిన మాజీ కార్పొరేటర్లు నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, తోట శ్రీధర్ రెడ్డి, ఇంద్రసేనల ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేశారు. నాదర్ గుల్ నుండి బడంగ్ పేట్ వైపు ఉన్న కల్వర్టు వద్ద ప్రధాన రహదారి పూర్తిగా గుంతల మయంగా మారి వాహనదారుల రాకపోకలకు ఆటంకం మారింది. ఈ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయడం కోసం నిధులు ఉన్న అధికారుల, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో తెలియదు కానీ రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాదు ఈ గుంతల రోడ్డుతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదే విధంగా ఆగష్టు నెలలో స్మశాన వాటికల అభివృద్ధి కోసం రూ.50లక్షలు, రూ.25 లక్షల నిధులు కేటాయించి సిద్ధంగా ఉన్నా ఆ పనులను పూర్తి స్థాయిలో చేయించలేక పోతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్లు అసంపూర్తిగా నిలిచి పోయిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి మాజీ కార్పొరేటర్లు ఎన్ని సార్లు తీసుక వెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మా గ్రామం నుండే మున్సిపల్ కార్పొరేషన్ అధిక మొత్తంలో వివిధ రకాల పన్నులు వసూలు చేయడం జరిగిందని అంటున్నారు. అయినా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.







అభివృద్ధి పనుల్లో వివక్ష చూపుతున్న అధికారులు



నాదర్ గుల్ గ్రామ అభివృద్ధి పనుల కోసం మంజూరైన నిధులతో పనులు పూర్తి చేయకుండా అధికారులు వివక్ష చూపుతున్నారు. గత ఆరు నెలల కిందట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మంజూరు చేసిన నిధులతో అసంపూర్తిగా నిలిచి పోయి ఉన్న అభివృద్ధి నిర్మాణ పనులను పూర్తి చేయించలేక పోతున్నారు. కొన్ని డివిజన్లలో అభివృద్ధి పనులకు టెండర్లు వేయకుండానే ముందస్తుగా అభివృద్ధి పనులను పూర్తి చేయిండం జరిగింది.

- నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్

అసంపూర్తి పనులను త్వరలో పూర్తి చేయిస్తా



నాదర్ గుల్ గ్రామంలో సంపూర్తిగా ఉన్న వివిధ అభివృద్ధి పనుల త్వరలో పూర్తి చేయిస్తా. అనివార్య కారణాల వలన అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. ఇటీవల నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ సంపూర్తి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి.. త్వరగా పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాను.

- కమిషనర్ సరస్వతి

నిరుపేద అమ్మాయి పెండ్లికి ఉప్పల చేయూత



నవతెలంగాణ - నాగోల్

ఉప్పల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓ నిరుపేద అమ్మాయి వివాహానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా సహాయ, సహకారాలు అందజేసి చేయూతనిచ్చారు. మహబూబాబాద్ జిల్లా రామన్నగూడెం గ్రామానికి చెందిన ప్రతాపని రమేష్-రాణిల కుమార్తె స్వప్న వివాహానికి సహాయాన్ని అందించి ఆదుకోవాలని కోరుతూ మంగళవారం ఉప్పల శ్రీనివాస్ గుప్తను నాగోలులోని తన క్యాంపు కార్యాలయంలో మర్యాపూర్వకంగా కలిశారు. స్పందించిన శ్రీనివాస గుప్తా వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత తన క్యాంపు కార్యాలయంలో తమ కుమారుడు ఉప్పల సాయికిరణ్, కోడలు శర్వారీ, ఆయన సతీమణి ఉప్పల స్వప్నతో కలిసి మంగళసూత్రం,మెట్టెలు,గాజులతో పాటు చీరలను అందజేశారు. అనంతరం శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు తన వంతుగా ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక మందికి సహాయ సహకారాలను అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేశ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

పార్కును అభివృద్ధి చేయాలని వినతి



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడ 3వ డివిజన్ రామిడి మల్లారెడ్డి నగర్ కాలనీకి సంబంధించి 800 చదరపు అడుగులు ఉన్న ప్రభుత్వ పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సభ్యులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డిల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సరస్వతిని కలసి వినతి పత్రం అంద జేశారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ హెచ్ఎండీఏ నిధులతో ప్రభుత్వ పార్క్ ను అభివృద్ధి చేయిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పార్కులు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎక్కడైనా పార్కులను ఎవరైనా అన్యాక్రాంతం చేసినా ప్రజలు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వారు తమ దృష్టికి తీసుకరావాలని కోరారు. ప్రభుత్వ పార్కులు,ఓపెన్ స్థలాలను ఎవరైనా ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షులు రామిడి శ్రీనివాస్ రెడ్డి, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నవతెలంగాణ -హయత్ నగర్

ఓ రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ లోని కాకతీయ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న బుగత ఎల్లయ్య(52). మంగళవారం హయత్ నగర్ బస్ స్టాండ్ వద్ద తహసీల్దార్ కార్యాలయం మెయిన్ రోడ్డు వద్ద ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వెళ్తున్న ఆటోను వెనుక నుండి అతి వేగంతో వస్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ఎల్లయ్యకు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. అదేవిధంగా ఆటో డ్రైవర్ జంగయ్య అనే వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పీటీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మల్లిఖార్జున్ రెడ్డి, శారద ఎన్నిక

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(పీటీఏ) తెలంగాణ నూతన రాష్ట్ర కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల పరిశీలకుడు ఏఐపీటీఎఫ్ జాతీయ కార్యదర్శి వైఎస్ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో ప్రకటించారు. ప్రాథమిక పాఠశాలల బలోపేతంతో పాటు ఉపాధ్యాయుల ఆత్మ గౌరవం కోసం ఈ కొత్త పీటీఏ రాష్ట్ర కమిటీ పని చేస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా కె. మల్లికార్జున్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.శారదా, చీఫ్ పాట్రన్ జీ.వీ.బద్రి నారాయణ రావు, కె.ఎస్.ప్రకాష్ రావు, ఫైనాన్స్ సెక్రటరీగా సీహెచ్. శౌరీ, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా సీహెచ్ ప్రభాకర్, పి.పార్థసారథి ఎన్నికయ్యారు. పీఆర్సీ, అయిదు డీఏలు వెంటనే ప్రకటించాలనీ, పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుల, ఉద్యోగల రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే చెల్లించాలి. ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతులు



ప్రారంభించాలనీ తరగతికి ఒక్క ఉపాధ్యాయుడిని నియమించడంతో పాటు పలు తీర్మానాలు చేసింది. ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు డి. నాగేష్, రాష్ట్ర మహిళల వింగ్ చైర్ పర్సన్ ఆర్.వరలక్ష్మి, సభ్యురాలు ఏ.ఆర్ బబితా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు

నవతెలంగాణ-హయత్ నగర్

కాంగ్రెస్ పేద ప్రజలకు అందిస్తున్న ప్రజా పాలనను చూసి బీఆర్ఎస్ నుండి పలువురు కాంగ్రెస్ లోకి చేరుతున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ అన్నారు. హస్తినాపురంలో జరిగిన భారీ బహిరంగ సభలో నాగోల్ డివిజన్ నాంచారమ్మ బస్తీ నుండి సుమారు 50 మంది జగన్నాథం గంగయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్లో చేరారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో సామాన్యులకు, పేదలకు సముచిత న్యాయం జరుగుతుందని, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయనే ధీమాతో బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ లోకి పలువురు చేరినట్లు తెలిపారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎరుకల నాంచారమ్మ బస్తీ వాసులకు ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదని, వారికి మౌలిక వసతులు,పింఛన్లు, రేషన్ కార్డులు, డబల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చేలా చూస్తానని తెలిపారు.



నేడు తెలంగాణ గిరిజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా మహాసభ

నవతెలంగాణ-చంపాపేట్

నేడు నిర్వహించనున్న తెలంగాణ గిరిజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర సీనియర్ నాయకులు రాత్లావత్ శంకర్ నాయక్ కోరారు. సైదాబాద్ మండలం సింగరేణి కాలనీలోని గిరిజన సమాఖ్య కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్లావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలో గిరిజనుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించినట్టు తెలిపారు. పొట్ట చేత పట్టుకొని జీవనం సాగించేందుకు హైదరాబాద్‌కు వలసలు వచ్చిన అన్ని జిల్లాల గిరిజనులు నేడు నిర్వహించనున్న గిరిజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గిరిజనులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు తదితర సమస్యలపై ఈ మహాసభలో చర్చించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో గిరిజన సమాఖ్య హైదరాబాద్ నగర నేతలు రమావత్ హరినాయక్, ఆంగోత్ రఘుపతి నాయక్, నేనావత్ రూప్సింగ్ నాయక్, వాంక్డోత్ దస్ృనాయక్, నేనావత్ రాజునాయక్, వడిత్య దస్ృనాయక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయండి



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధి శ్రీరామ కాలనీ పరిధిలోని బృందావన కాలనీలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం నిధులు మంజూరు చేయాలని మాజీ కౌన్సిలర్ కే.లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు జల్ పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వేంకట్రాంకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ఏర్పడిన నాటినుండి డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వలన కాలనీ ప్రజలు మురుగు నీటితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలో ఎన్నోసార్లు వినతి పత్రాలను అందజేసినట్టు తెలిపారు. వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుక వెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. వినతి అందజేసిన వారిలో కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

ఇట్ల చేద్దాం

నిమ్మరసం, లేదా వెనిగర్ తీసుకుని దానిలో డిష్ వాష్ లిక్విడ్, వేడినీళ్ల పోసి బాగా కలపాలి. దానిని స్ప్రేబాటిల్లో వేయాలి. ఇప్పుడు మిక్సీ నాబ్, రంధ్రాలు ఉన్న ప్రదేశాలను ప్లాస్టర్తో మూసివేయాలి. ఈ



మిశ్రమాన్ని స్ప్రే చేసి పది నిమిషాలు నాననిచ్చి తరువాత వస్త్రంతో గట్టిగా తుడిస్తే మరకలన్నీపోతాయి. మిక్సీజార్ పెట్టే ప్రాంతంలో కూడా మిశ్రమాన్ని కొద్దిగా వేసి టూత్ బ్రష్తో రంధ్రాలు, ఆన్ ఆఫ్ బటన్ దగ్గర ఇయర్ బడ్స్ రుద్దితే మిక్సీ కొత్తదానిలా మెరిసిపోతుంది.

రాగి వస్తువులు నల్లగా మారితే .. ఉప్పులో వెనిగర్ వేసి కలపాలి. ఈ మిశ్రమంలో దూది ముంచి రాగి వస్తువులపై రుద్దితే నలుపంతా పోయి పాత్రలు తళతళలాడుతాయి.



చిత్ర కళే ఊపిరిగా...

చిత్రలేఖనం కృషి, సృజనాత్మకతతో కూడుకున్న కళ. చిత్రించవలసిన దానిని అవగతం చేసుకోవడం, ఆపై రంగులతో అందంగా తీర్చిదిద్దడం సాధనతోనే సాధ్యపడుతుంది. అలాంటి కళను చిన్న తనం నుండి వారసత్వంగా అందిపుచుకున్నారు గాయత్రి కనుపర్తి. ఎప్పటికప్పుడు తనలోని కళను మెరుగుపరుచుకుంటూ కళాభిమానుల అభిరుచికి తగ్గట్టుగా బొమ్మలు గీస్తూ దాదాపు వందకుపైగా ఎగ్జిబిషన్స్‌లో పాల్గొని క్షణం కూడా తీరిక లేకుండా చిత్రలేఖనమే ఊపిరిగా జీవిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



గాయత్రి తండ్రి శ్రీకంఠ వీరభద్రరావు, తల్లి రాజ్యలక్ష్మి. ఈమెకు ఒక తమ్ముడు శ్రీధర్. వీరి సొంత ఊరు ప్రకాశం జిల్లాలోని ఒంగోలు. చీరాలలో పుట్టి పెరిగారు. గాయత్రి తండ్రి జీవించి ఉన్నప్పుడు Assistant Treasury Officer (A.T.O)గా చేసేవారు. వారు కూడా చిత్రకారులే. కేవలం రాధాకృష్ణ ఒకే సబ్జెక్ట్ తీసుకొని కనీసం యాభై భంగిమలు చిత్రించారు. ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ బాధ్యతలతో ప్రవృత్తిగా వేస్తున్న చిత్రకళకు ఆయనకు సమయం దొరికేది కాదు. అయినా తనకెంతో ఇష్టమైన కళను వీలు చిక్కినప్పుడల్లా గీస్తుండేవారు. ఆయన సాహిత్యం కూడా బాగా చదివే వారు.

భర్త ప్రోత్సాహంతో...

గాయత్రి BAPATLA ENGINEERING COLLEGE లో M.sc (A.o) maths చేసారు. చదువు పూర్తి అయిన వెంటనే వివాహం చేశారు. గాయత్రిలోని కళా తృష్ణను గుర్తించిన భర్త ఉదయ్ భాస్కర్ ఆమెనెంతో ప్రోత్సహించారు. ఆమెకంటూ ఒక ప్రత్యేకత ఉండాలని భార్య కళను ప్రపంచానికి చూపించేందుకు తనవంతు సహకారం అందించారు. భర్త ఇచ్చిన ఈ ప్రోత్సాహంతో ఆమె తన దృష్టిని చిత్రలేఖనం మీదనే కేంద్రీకరించారు. 'నా జీవితంలో నాన్న హీరో అయితే.. ఆ తర్వాత స్థానం నా భర్తదే. నాన్నలో ఉన్న కళ నాకు వారసత్వంగా వస్తే, నన్ను ప్రోత్సాహించింది మాత్రం నా భర్తనే' అంటూ గర్వంగా చెబుతారు ఆమె. గత 15ను ఏండ్లుగా ఒక చిత్రకారిణిగా తన కళను నలుగురికి తెలిసేలా చేసింది ఆమె భర్తనే. ఉదయ్ భాస్కర్ తన భార్యకు మంచి సలహాలు ఇస్తూ ఒక ఫిలాసఫర్‌గా మారారు. అందేకాదు ఆమె కళకు దిశ నిర్దేశాలు చేస్తున్న ఒక దార్శనీకుడు.



వంద ఎగ్జిబిషన్లలో...

గాయత్రి దాదాపు అన్నిరకాల చిత్రాలు వేస్తారు. పొట్రైట్స్, పెన్సిల్ స్కెచెస్, అక్రలిక్ పెయింటింగ్స్, ఆయిల్ పెయింటింగ్స్ ఇలా ఏదైనా ఆమె చేతిలో ఎంతో అందంగా తీర్చిదిద్దబడుతుంది. కళాభిమానుల అభిరుచిని బట్టి వాళ్ళకి కావాల్సిన రీతిలో చిత్రాలను అందచేస్తారు. చిత్రకళలో ఆమె మొదటి గురువు అనంత నారాయణ. తర్వాత ప్రముఖ చిత్రకారుడు అంబరీష్ దగ్గర కొన్ని మెళుకువలు నేర్చుకున్నారు. ఇప్పటివరకు భారతదేశ వ్యాప్తంగా సుమారు వంద ఎగ్జిబిషన్స్‌లో ఆమె పాల్గొన్నారు.

ఆదరణ ఇంకా పెరగాలి

నేటి యువ చిత్రకారులకు ఏదైనా సందేశం ఇవ్వమంటే తాను ఇంకా అంత ఎదగలేదని అయితే మనలోని ఆత్మవిశ్వాసాన్ని యువత ఎప్పుడూ కోల్పోకూడదని బలంగా చెబుతున్నారు. అలాగే కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలని అదే మనల్ని నిలబెడుతుందని అంటున్నారు. నేటి సమాజంలో కళల పట్ల ఆదరణ కాస్త తక్కువే ఉందనీ, సమాజంలో కళల పట్ల మంచి అవగాహన కలిగి ఆదరణ ఇంకా పెరగాలని ఆమె అంటున్నారు. అన్ని రంగాల మాదిరిగా ఈ రంగంలో కూడా అనేక సమస్యలు ఉన్నాయని ఆమె అంగీకరిస్తున్నారు. అయినా వాటిని అధిగమించి చిత్రకళపై ఉన్న మక్కువతో ముందుకు పోతున్నానని అంటున్నారు.

సాహిత్య కారిణిగా...

చిత్రకళతో పాటు గాయత్రికి సాహిత్యం అన్నా ఎంతో మక్కువే. 2017లో జనని సంస్థ ద్వారా వెన్నెల గంటి, భువన చంద్ర సమక్షంలో తన కవితా సంపుటి 'ఇట్లు..నీ' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆమెకు సంతృప్తి కలిగించే విషయమేంటని అడిగితే కళలు లేదా కవిత్వంలో నిష్ణాతుల దగ్గర నుండి వచ్చే నిజమైన ప్రశంసలు లేదా సలహాలు అంటారు. తనలోని చిత్రకళకు గాయత్రి అనేక పురస్కారాలు సైతం అందుకున్నారు. బాపు బొమ్మల పురస్కారం, యువకవితా సత్కారం, శ్రీ ధాత్రి పురస్కారం, ఉగాది పురస్కారం, నవరత్న మహిళా పురస్కారం ముఖ్యమైనవి. మహిళలు తమలోని శక్తి , సామర్థ్యాలను గుర్తించి ఉన్న సమయాన్ని వృథా చేసుకోకుండా ఇష్టమైన రంగంలో రాణించడానికి కృషిచేయాలని ఆమె అంటారు.



ఈ టిప్స్ పాటిస్తే...



అందంగా ఉండాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. అయితే ఎప్పుడూ బ్యూటీ పార్లర్‌కు వెళ్లి డబ్బులు ఎక్కువగా ఖర్చు పెట్టడం కంటే.. ఇంట్లో కూడా మనం ముఖాన్ని మెరిపించుకోవచ్చు. పెద్దగా ఖర్చు కూడా ఉండదు. రెండు, మూడు రోజుల మెరుపును తీసుకొచ్చే ఫేషియల్స్ కంటే.. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంతో పాటు మెరుపును, రంగును పెంచే కొన్ని హోమ్ మేడ్ టిప్స్ గురించి చూద్దాం.

ట్యానింగ్ చేసుకోండి:

ట్యానింగ్ అంటే.. ముఖంపై ఉండే మురికిని పోగొట్టుకోవడం. ఇందు కోసం ట్యాన్ రిమూవర్ క్రీమ్స్ బయట మార్కెట్లో ఉంటాయి. అవి తెచ్చుకుని ముఖానికి రాసి రుద్ది క్లీన్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ముఖంపై పేరుకుపోయిన మురికి పోతుంది. రాత్రి నిద్రపోయేముందు మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఉదయం మామూలు నీళ్ళతో కడుక్కోవాలి. ఇలా చేయడం వల్ల ముఖంమెరుస్తూ కనిపిస్తుంది.

పాలు - రోజ్ వాటర్:

బయట క్రీమ్స్ వద్దు అనుకునేవారికి ఇంట్లో కూడా చర్మాన్ని మెరిపించే క్రీమ్స్ ఉన్నాయి. కొద్దిగా పాలలో రోజ్ వాటర్, అలోవెరా జెల్ కలపండి. దీన్ని ఇప్పుడు ముఖానికి పట్టించి.. చేతితో మసాజ్ చేసి.. ఓ పది నిమిషాలు ఆరనివ్వండి. ఇలా చేయడం వల్ల మురికి పోతుంది.

బియ్యం పిండి:

చర్మంపై ఉండే మురికిని వదిలించడంలో బియ్యం పిండి, శనగ పిండి చక్కగా పని చేస్తాయి. ఏదో ఒకటి తీసుకుని ఇందులో కొద్దిగా పెరుగు, టమాటా గుజ్జు కలిపి ముఖానికి అప్లై చేయండి. పది నిమిషాలు ఉంచి ముఖాన్ని క్లీన్ చేసుకోవాలి. ఇలా చేస్తే మెరిసే చర్మం మీ సొంతం.

ముల్తానీ మట్టి:

ముల్తానీ మట్టి కూడా చర్మాన్ని క్లీన్ చేస్తుంది. చర్మంపై ఉండే మురికిని తొలగిస్తుంది. కొద్దిగా ముల్తానీ మట్టి, పాలు, గంధం పొడి, తేనె మిక్స్ చేసి ముఖానికి అప్లై చేయాలి. చర్మాన్ని తడి చేసి ఈ ఫేస్ ప్యాక్ అప్లై చేయాలి. చేతులు, కాళ్లపై కూడా రాసుకోవచ్చు. ఓ పావుగంట ఉంచి ముఖాన్ని క్లీన్ చేసుకోవాలి.

లేబర్ కోడ్‌లు మరణ శాసనం

(మొదటిపేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ దేశంలో మెజార్టీ ప్రజలైన కార్మికుల హక్కులను కొద్ది మంది కార్పొరేట్లు నిర్ణయిస్తున్నారని అన్నారు. చట్టాలు చేసే ప్రజాప్రతినిధులైన ఎంపీల్లో 80 శాతం మంది పెట్టుబడి దారులు, పారిశ్రామిక వేత్తలేనని గుర్తు చేశారు. ఫలితంగా కార్మికుల ప్రయోజనాల కోసం పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలకు ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 95 శాతం మంది కార్మికులు కనీస వేతనాలు లేకుండా పని చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ మే 20న తలపెట్టిన సమ్మె విజయవంతానికి కార్మిక సంఘాలన్నీ ఐక్య కార్యచరణతో ముందుకు పోవాలని సూచించారు. యాజమాన్యాలకు సమ్మె నోటీసిచ్చేటప్పుడు గెలిచిన సంఘాలే కాకుండా రిజిస్టర్ సంఘాలను కలుపుకుని పోవాలని అన్నారు. టీయూసీఐ ప్రధాన కార్యదర్శి కె.సూర్యం మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినా ఎందుకు పేదరికం పోలేదని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వలన కేవలం ఐదు శాతం మంది పెట్టుబడిదారుల వద్ద 70 శాతం సంపద కేంద్రీకృతం అయిందని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు కార్మిక, పేద ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌ఎంఎస్ నాయకులు అమ్జద్ మాట్లాడుతూ లేబర్ కోడ్ల రద్దుకు ఐక్య కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ మాట్లాడుతూ దేశంలోని సహజ సంపదను కొల్లగొట్టి జిందాల్, అంబాని, అదానీలకు బీజేపీ సర్కార్ కట్టబెడుతోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను చంపుతున్న కేంద్రం, భవిష్యత్‌లో ప్రజా ఉద్యమాలపై కూడా ఉక్కు పాదం మోపనుందని ఆందోళన వ్యక్తం చేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంకే.బోస్ మాట్లాడుతూ లేబర్ కోడ్ల అమలును కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఏఐయూటీయూసీ నాయకులు భరత్ మాట్లాడుతూ కార్మికుల పోరాటాన్ని పక్కదారి పట్టించేందుకు మతోన్మాదాన్ని బీజేపీ ముందుకు తెస్తున్నదని ఆరోపించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు విజయకుమార్ యాదవ్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ.యూసఫ్ టీయూసీఐ (ఎస్‌ఎల్ పద్మ), బీఆర్‌టీయూ (మారయ్య), ఐఎఫ్‌టీయూ(శివబాబు), టీఎన్‌టీయూసీ (శివబాబు) అధ్యక్షత వహించగా, ఏఐటీయూసీ నాయకులు నర్సింహ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్. ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట విరుద్ధం... ఏకపక్షం

(మొదటిపేజీ తరువాయి)

మేము చెబుతున్నాం. రాజకీయ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఓ స్నేహితుడిగా, తత్వవేత్తగా, దయతో తన పాత్రను నిర్వహించాలి. రాజ్యాంగంపై చేసిన ప్రమాణపు పవిత్రతను కాపాడుతూ నిర్మోహమాటంగా వ్యవహరించాలి' అని చురకలు వేసింది.

గవర్నర్ ఎలా ఉండాలంటే...

సుప్రీంకోర్టు తన తీర్పులో గవర్నర్ పాత్రను వివరిస్తూ 'వివాదాలు వచ్చినప్పుడు ఏకాభిప్రాయానికి కృషి చేయాలి. సమస్య పరిష్కారానికి మార్గనిర్దేశం చేయాలి. అంతేకానీ రాష్ట్ర యంత్రాంగాన్ని స్తంభింపచేయకూడదు. ఉత్ప్రేరకంగా ఉండాలే తప్ప నిరోధకంగా ఉండకూడదు. తాను నిర్వహించే ఉన్నత రాజ్యాంగ పదవి యొక్క గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని చర్యలు చేపట్టాలి. గవర్నర్ పదవిని చేపట్టే వ్యక్తి రాజ్యాంగాన్ని, పరిపాలనను పరిరక్షిస్తానని, రాష్ట్ర ప్రజలకు సేవ చేయడానికి, వారి శ్రేయస్సుకు అంకితం అవుతానని ప్రతిజ్ఞ చేస్తారు. తన సామర్థ్యం మేరకు విధులు నిర్వహిస్తానని చెబుతారు. కాబట్టి ఆయన చర్యలన్నీ ఆ ప్రమాణానికి అనుగుణంగా ఉండాలి. రాజ్యాంగం ప్రకారం తన విధులను నిర్వర్తించాలి' అని చెప్పింది. రాష్ట్ర రాజ్యాంగ అధిపతిగా ఉండే గవర్నర్ ప్రజల ఆకాంక్షలకు, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్ర యంత్రాంగానికి అనుగుణంగా నిజాయితీగా పనిచేయాలని సూచించింది. అంతేతప్ప రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజాభీష్టాన్ని అడ్డుకోవడానికి, శాసన సభ విధులకు అడ్డంకులు సృష్టించడానికి, దాని గొంతు నొక్కడానికి ప్రయత్నించకూడదని సుద్దులు చెప్పింది.

'శాసనసభ ఎన్నుకునే వ్యక్తులు రాష్ట్ర ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుంటారు. కాబట్టి ప్రజల ఎంపికకు విరుద్ధంగా ఎలాంటి చర్య తీసుకున్నా అది శాసనసభను, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. ఉన్నత పదవులను అధిష్ఠించే వారు రాజ్యాంగ విలువల ప్రకారం నడచుకోవాల్సి ఉంటుందని మేము అభిప్రాయ పడుతున్నాం' అని న్యాయమూర్తులు పేర్కొన్నారు.

కాలపరిమితికి కట్టుబడి ఉండాల్సిందే

2020 జనవరి నుండి తన వద్ద పెండింగులో ఉన్న బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఫిబ్రవరి 10న తీర్పును రిజర్వ్ చేసింది. దీనిపై మంగళవారం తీర్పును వెలువరించిన న్యాయస్థానం బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి గవర్నర్లకు కాలపరిమితిని కూడా నిర్దేశించింది. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 200ను ప్రస్తావించింది. 'మొదటిసారి గవర్నర్ ఆమోదం పొందకుండా తిరిగి వచ్చిన బిల్లులను శాసనసభ రెండోసారి ఆమోదించి పంపితే దానిని పరిశీలన కోసం గవర్నర్ రిజర్వ్ చేయకూడదు. రెండోసారి పంపిన బిల్లు మొదటిసారి పంపిన బిల్లుకు భిన్నంగా ఉన్నప్పుడు మాత్రమే దీనికి మినహాయింపు ఉంటుంది. రాష్ట్ర క్యాబినెట్ సలహాకు భిన్నంగా రాష్ట్రపతి పరిశీలన కోసం బిల్లులను రిజర్వ్ చేసినప్పుడు గవర్నర్ గరిష్టంగా మూడు నెలల వ్యవధి మాత్రమే తీసుకోవాలి. పున్హపరిశీలన తర్వాత కూడా శాసనసభ రెండోసారి బిల్లును పంపినప్పుడు గవర్నర్ గరిష్టంగా ఒక నెల రోజులలో దానిని ఆమోదించాల్సి ఉంటుంది' అని స్పష్టం చేసింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ తన విధులను నిర్వహించేటప్పుడు రాష్ట్ర మంత్రిమండలి అందించే సూచనలకు కట్టుబడి ఉండాల్సిందేనని తేల్చి చెప్పింది.

ఇది చారిత్రాత్మకం

(మొదటిపేజీ తరువాయి)

విరుద్ధంగా వ్యవహరించారు' అని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో తెలిపింది.

సుప్రీంకోర్టు తీర్పు కేరళ సహా అన్ని రాష్ట్రాలకూ ఒక ప్రమాణాన్ని నిర్దేశించిందని సీపీఐ (ఎం) తెలియజేసింది. శాసనసభలు ఆమోదించిన అనేక బిల్లులకు ఆమోదముద్ర వేయకుండా గవర్నర్లు వాటిని తమ వద్ద అట్టే పెట్టుకుంటున్నారని గుర్తు చేసింది. సుప్రీంకోర్టు తీర్పుపై సీపీఐ (ఎం) హర్షం వ్యక్తం చేస్తూ మన రాజ్యాంగంలోని సమాఖ్య సూత్రాలను బలోపేతం చేయడానికి ఇది దోహదపడుతుందని అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు తీర్పు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి ఊతమిచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాపాడిందని తెలిపింది.

ప్రజలపై భారం వేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేసింది. వంటగ్యాస్ ధరల పెంపునకు వ్యతిరేకంగా బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించి ఆ ఫలితాలను అందించాలని తెలిపారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణమని విమర్శించారు. దీనివల్ల ఉజ్వల పథకం లబ్దిదారులు, సాధారణ వినియోగదారులతోపాటు, మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై కూడా పెద్ద భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలనీ, దీనికోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం, అన్ని రకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్యాస్ సిలిండర్ ధరలు 130.57 శాతం పెంచడంతోపాటు, సబ్సిడీని కూడా తగ్గించుకుంటూ వచ్చిందని తెలిపారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలిస్తూ, రాష్ట్రంలోని వినియోగదారులపై ఏటా రూ.400 కోట్ల భారం మోపుతున్నదని విమర్శించారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టాలని పార్టీ శాఖలు, ప్రజలకు జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు.

సిలిండర్ ధర పెంపును వ్యతిరేకిస్తూ నేడు ధర్నా

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచడం వల్ల మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు అయ్యిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ఖాళీ సిలిండర్లతో బుధవారం నిరసన ధర్నాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మేలు చేయడానికి రూ.500కే గ్యాస్ సిలిండర్లు ఇస్తూ ఉంటే కేంద్రం తన ఇష్టానుసారంగా ధరలు పెంచుకుంటూ పోతోందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు, బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ ప్రజల మీద మాత్రం బారాలు మోపుతున్నదని ఆయన విమర్శించారు.



దేశం కోసం పోరాడిన నేతలపై బీజేపీ..ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించుకోవడం హస్యాస్పదం. బీజేపీ- ఆర్‌ఎస్‌ఎస్ కలిసి జాతీయ నాయకులపై కుట్ర పన్నుతున్నాయి. దేశంలో మతపరమైన విభజనలకు ప్రయత్నిస్తున్నారు. భారత్‌లోని ప్రాథమిక సమస్యల నుంచి ప్రజల ద ృష్టి మళ్లిస్తున్నారు" అని ఖర్గే ఆరోపించారు.

"కాంగ్రెస్ పార్టీ 140 ఏండ్లుగా దేశ సేవలో నిమగ్నమై ఉంది. స్వాతంత్ర్య సమరంలో ఎంతో పోరాడింది. అలాంటి పార్టీకి ప్రస్తుతం దేశంలో వ్యతిరేక పరిస్థితులను స ృష్టిస్తున్నారు. మన పార్టీని అంతం చేయాలని చూస్తున్నారు. స్వతంత్ర దేశం కోసం ఏమీ సాధించని వారే ఇదంతా చేస్తున్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూ మధ్య మంచి అనుబంధం ఉండేది. ఆ నేతలిద్దరు దేశం కోసం కలిసికట్టుగా పని చేశారు. అలాంటిది.. ఆ నాయకులు ఒకరితో మరొకరు వ్యతిరేకంగా ఉండేవారని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు" అని మండిపడ్డారు. "నెహ్రూ-పటేల్ మధ్య నిత్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవి. అన్ని విషయాలపై నెహ్రూ ఆయన సలహాలు తీసుకునే వారు. పటేల్ అంటే ఆయనకు అమితమైన గౌరవం. ఏదైనా సలహా తీసుకోవాల్సి వస్తే స్వయంగా నెహ్రూనే పటేల్ ఇంటికి వెళ్లేవారు. పటేల్ సౌలభ్యం ద ృష్టి ఉంచుకుని సీడబ్ల్యూసీ సమావేశాలు ఆయన ఇంట్లోనే నిర్వహించేవారు. అలాంటి గొప్ప నాయకులపై బీజేపీ- ఆర్‌ఎస్‌ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయి" అని ఆరోపించారు.

5గురికి 'ఉరే' సరి

(మొదటిపేజీ తరువాయి)

పేలుళ్లకు 18 మంది చనిపోగా.. 131 మంది గాయాలపాలయ్యారు. ఈ కేసులో ఎ-1 రియాజ్ భత్కల్ పరారీలో ఉన్నాడు. పాక్‌లో ఉన్నాడని ఎన్ఐఏ చెబుతోంది. మిగిలిన ఐదుగురు ఎ-2 అసదుల్లా అక్తర్, ఎ-3 జియా ఉర్ రెహ్మాన్ (పాకిస్తాన్ పౌరుడు), ఎ-4 తెహసీన్ అక్తర్, ఎ-5 మొహమ్మద్ అహ్మద్ సిద్దిభాపా అలియాస్ యాసిన్ భత్కల్, ఎ-6 ఎజాజ్ షేక్‌లకు ఎన్ఐఏ స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఉరిశిక్ష విధింపును హైకోర్టు ఆమోదించింది. ఈ కేసును సుమారు రెండేండ్లపాటు ఎన్ఐఏ కోర్టు చర్లపల్లి కోర్టు ఆవరణలో కట్టుదిట్టమైన భద్రత మధ్య విచారణ జరిపింది. 157 మంది సాక్ష్యాలను విచారించింది 502 పత్రాలను పరిశీలించింది. 201 ఆధారాలను పరిశీలిచింది. అయిదుగురు దోషులేనని 2016 డిసెంబర్ 13న కింది కోర్టు ప్రకటించింది. వారం తర్వాత ఆ ఐదుగురికి ఉరి శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఐదుగురు అదే ఏడాది డిసెంబర్ 24 హైకోర్టులో అప్పీల్ చేశారు.

పేలుళ్ల ప్రధాన సూత్రధారి మహ్మద్ రియాజ్ అలియా రియాజ్ బక్తల్‌గా గుర్తించారు. కర్ణాటక బక్తల్‌కు చెందిన రియాజ్ బక్తల్ పాకిస్తాన్‌లో ఉన్నాడని తేల్చిన ఎన్ఐఏ రెడ్ కార్నర్ నోటీసులిచ్చింది. మూడు చార్జిషీట్లు వేసింది. దేశసమగ్రత, సమైక్యతను దెబ్బతీసే కుట్రలో భాగంగా పేలుళ్లకు పాల్పడ్డారని అందులో పేర్కొంది. నిందితులపై వేరే కేసులు కూడా ఉన్నట్టు చెప్పింది. ఎన్ఐఏ వాదనను కింది కోర్టు ఆమోదించగా, ఆ తీర్పును హైకోర్టు సైతం సమర్థించింది.

దోషులు దాఖలు చేసిన అప్పీళ్లను డిస్మిస్ చేసింది. ఉరి వేస్తూ వెలువడిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఆస్కారం లేదని స్పష్టం చేసింది. వివిధ సెక్షన్ల కింద ఎన్ఐఏ కోర్టు విధించిన మరణశిక్ష, జీవిత ఖైదు, ఇతర శిక్షల్లో జోక్యానికి తావు లేదంది. అప్పీళ్లు దాఖలు చేసిన వాదనలకు ఆధారాలు లేవంది. ఎన్ఐఏ అధికారులు సేకరించిన ఆధారాలు, సాక్ష్యాధారాలను పరిశీలిస్తే దోషులకు ఉరి శిక్ష సరైనదేనని తేల్చి చెప్పింది. సీఆర్‌పీసీ సెక్షన్ 366 ప్రకారం విధించిన ఉరి శిక్షలో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. కునాల్ మజుందార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్తాన్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కూడా అప్పీళ్లలో జోక్యానికి ఆస్కారమే లేదని చెప్పింది. దోషులు అత్యంత క్రూరంగా, హేయంగా బాంబు దాడులకు పాల్పడ్డారనీ, ఇలాంటి దోషుల విషయంలో శిక్ష విధించడం ద్వారా సభ్య సమాజానికి కచ్చితమైన సంకేతాలు పంపాల్సిన అవసరం ఉందని చెప్పింది. దారుణ మారణకాండకు తలబడ్డవాళ్లకు ఉరి శిక్ష సరైనదని చెప్పింది. బాంబు దాడుల ఘటనల్లో అభం, శుభం తెలియని అమాయకులు మరణించారనీ, మారణహోమానికి ఒడిగట్టిన చర్యల ప్రభావం బాధితులపైనే కాదని సభ్య సమాజంపై ఉందని పేర్కొంది.

దోషుల ప్రవర్తన, వాళ్ల గత చరిత్ర, నేర తీవ్రత, మృతుల కుటుంబసభ్యుల మనోవేదన, గాయపడిన వాళ్ల గోడు.. అన్నింటినీ పరిశీలిస్తే ఉరిని రద్దు చేయాలనే అప్పీళ్లను ఆమోదించలేమని స్పష్టం చేసింది. దారుణ మారణహోమానికి పాల్పడిన వాళ్లలో మార్పు వస్తుందనీ, సంస్కరణల దిశ కోణంలో ఉరిని రద్దు చేయాలనే అప్పీల్‌దారుల వాదన తిరస్కరిస్తున్నామని ప్రకటించింది. ఒకే కేసులో అయిదుగురు నిందితులకు ఒకేసారి ఉరి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పడం అరుదు. ఇదొక సంచలన తీర్పుగా చెబుతున్నారు. తీర్పు కాపీని దోషులకు ఇవ్వాలని రిజిస్ట్రీకి ధర్మాసనం ఆదేశించింది.

పూరన్, మార్ష్ దంచికొట్టారు

- కోల్‌కతపై 4 పరుగులతో లక్నో విజయం
- సూపర్‌జెయింట్స్ 238/3, నైట్‌రైడర్స్ 234/7

ఛేదనలో రహానె, అయ్యర్ పోరాటం వృథా



ఈడెన్ గార్డెన్స్‌లో పరుగుల వరద. నికోలస్ పూరన్ (87 నాటౌట్), మిచెల్ మార్ష్ (81) మోత మోగించగా లక్నో సూపర్‌జెయింట్స్ 238 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో అజింక్య రహానె (61), వెంకటేశ్ అయ్యర్ (45), రింకు సింగ్ (38 నాటౌట్) పోరాడినా నైట్‌రైడర్స్ 234 పరుగులే చేసింది. 4 పరుగుల తేడాతో లక్నో ఉత్కంఠ విజయం సాధించింది.

నవతెలంగాణ-కోల్‌కత

బ్యాటర్లు ఫోర్లు, సిక్సర్లతో దండయాత్ర చేసిన ఈడెన్‌గార్డెన్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కత నైట్‌రైడర్స్‌పై లక్నో సూపర్‌జెయింట్స్ 4 పరుగుల తేడాతో విజయం సాధించింది. 239 పరుగుల భారీ ఛేదనలో కోల్‌కత నైట్‌రైడర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 234 పరుగులే చేసింది. కెప్టెన్ అజింక్య రహానె (61, 35 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీతో కదం తొక్కగా.. వెంకటేశ్ అయ్యర్ (45, 29 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), రింకు సింగ్ (38 నాటౌట్, 15 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెప్పించారు. ఆఖరు 12 బంతుల్లో కోల్‌కతకు 38 పరుగులు అవసరం కాగా.. రింకు సింగ్ విధ్వంసంతో ఆతిథ్య జట్టు 34 పరుగులు పిండుకుంది. అవేశ్ ఖాన్, రవి బిష్ణోయ్‌లు చివరి రెండు ఓవర్లలో లక్నోను నిలబెట్టారు. సూపర్‌జెయింట్స్ బౌలర్లలో ఆకాశ్ దీప్ (2/55), శార్దుల్ ఠాకూర్ (2/52) రెండు వికెట్ల ప్రదర్శన చేశారు. నికోలస్ పూరన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఐపీఎల్18లో కోల్‌కతకు ఇది మూడో పరాజయం కాగా.. లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఇది మూడో విజయం.

ఆ ఇద్దరు ఫటాఫట్ :

తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన లక్నోకు టాప్-3 బ్యాటర్లు భారీ స్కోరు అందించారు. ఓపెనర్లు ఎడెన్ మార్‌క్రామ్ (47, 28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (81, 48 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) అదరగొట్టారు. తొలి వికెట్‌కు ఈ జోడీ 99 పరుగులు జోడించారు. అర్ధ సెంచరీ ముంగిట మార్‌క్రామ్ అవుటైనా.. నికోలస్ పూరన్ (87 నాటౌట్, 36 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) విశ్వరూపంతో సూపర్‌జెయింట్స్ స్కోరు దూసుకెళ్లింది. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 36 బంతుల్లోనే మార్ష్ అర్ధ సెంచరీ సాధించగా.. రెండు ఫోర్లు, ఆరు సిక్సర్లతో 21 బంతుల్లోనే నికోలస్ పూరన్ ఫిఫ్టీ అందుకున్నాడు. 30 బంతుల్లోనే 71 పరుగులు చేసిన పూరన్, మార్ష్ నైట్‌రైడర్స్ బౌలర్లను ఉతికారేశారు. స్లాగ్ ఓవర్లలోనూ పూరన్ ఫటాఫట్ జోరు కొనసాగటంతో లక్నో 238 పరుగుల భారీ స్కోరు చేసింది. కోల్‌కత బౌలర్లలో హర్షిత్ రానా (2/51) రెండు వికెట్లు పడగొట్టగా.. ఆండ్రీ రసెల్ (1/32) ఓ వికెట్ తీసుకున్నాడు. మిస్టరీ స్పిన్నర్లు సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి మాయ పని చేయలేదు.

షెఫాలీకి చుక్కెదురు

- తెలుగమ్మాయి అరుంధతి రెడ్డికి చోటు
- ముక్కోణపు సిరీస్‌కు భారత జట్టు



ముంబయి : ధనాధన్ ఓపెనర్ షెఫాలీ వర్మకు మరోసారి నిరాశే ఎదురు కాగా.. తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి తిరిగి జాతీయ జట్టులో చోటు దక్కించుకుంది. యువ ప్లేయర్లు కాశ్వీ గౌతమ్, శ్రీ చరణి, సుచి ఉపాధ్యాయ్‌లు తొలిసారి భారత జట్టులో చోటు సాధించారు. శ్రీలంక వేదికగా జరుగనున్న ముక్కోణపు వన్డే సిరీస్‌కు భారత మహిళల జట్టును సీనియర్ సెలక్షన్ కమిటీ మంగళవారం ఎంపిక చేసింది. భారత్, శ్రీలంక, దక్షిణాఫ్రికా మహిళల జట్లు పోటీపడుతున్న ముక్కోణపు వన్డే సిరీస్ ఏప్రిల్ 27 నుంచి ఆరంభం కానుంది. డబుల్ రౌండ్ రాబిన్ పద్ధతిలో సాగే టోర్నమెంట్‌లో లీగ్ దశలో ప్రతి జట్టు ఇతర జట్లతో రెండుసార్లు తలపడనుంది. టాప్-2లో నిలిచిన జట్లు ఫైనల్లో పోటీపడతాయి. ఏప్రిల్ 27న భారత్, శ్రీలంక తలపడనుండగా.. 29న భారత్, దక్షిణాఫ్రికా.. మే 4న శ్రీలంక, భారత్.. మే 7న భారత్, దక్షిణాఫ్రికా ఆడనున్నాయి. మే 11న ఫైనల్ జరుగుతుంది. ముక్కోణపు సిరీస్‌కు కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా నిలువనుంది.

షెఫాలీ వర్మను సీనియర్ సెలక్షన్ కమిటీ మరోసారి పక్కనపెట్టింది. జాతీయ జట్టులో అవకాశాలను షెఫాలీ సద్వినియోగం చేసుకోలేదు. కానీ ఇటీవల మహిళల ప్రీమియర్ లీగ్‌లో షెఫాలీ తొమ్మిది ఇన్నింగ్స్‌ల్లో 152.76 స్ట్రయిక్‌రేట్‌తో 304 పరుగులతో మెరిసింది. డబ్ల్యూపీఎల్‌లో గొప్పగా రాణించినా షెఫాలీకి జాతీయ జట్టులో చోటు దక్కలేదు. ఇటీవల జట్టుకు దూరమైన హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి తిరిగి చోటు సాధించింది. 21 ఏండ్ల కాశ్వీ గౌతమ్ డబ్ల్యూపీఎల్‌లో 11 వికెట్లు పడగొట్టి సత్తా చాటింది. లెఫ్టార్మ్ స్పిన్నర్లు శ్రీ చరణి, సుచి ఉపాధ్యాయ్‌లు సైతం డబ్ల్యూపీఎల్ మాయజాలంతో తొలిసారి జాతీయ జట్టులో నిలిచారు. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా కొనసాగనుండగా.. స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా ఎంపికైంది. ఈ ఏడాది సెప్టెంబర్-అక్టోబర్‌లో భారత్‌లో జరుగనున్న ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ ముంగిట ఈ సిరీస్ టీమ్ ఇండియాకు కీలక కానుంది.

భారత మహిళల వన్డే జట్టు :

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతికా రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రొడ్రిగస్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ, అమన్జోత్ కౌర్, కాశ్వీ గౌతమ్, స్నేహ్ రానా, అరుంధతి రెడ్డి, తేజల్ , శ్రీ చరణి, సుచి.

వారెవా బోపన్న

ఏటీపీ మాస్టర్స్ 1000 మ్యాచ్ నెగ్గిన అతిపెద్ద వయస్కుడిగా రికార్డు

రొక్యూబ్రునే కాప్ మార్టిన్ (ఫ్రాన్స్)



భారత టెన్నిస్ వెటరన్ ఆటగాడు రోహన్ బోపన్న సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న మోంటేకార్లో మాస్టర్స్ టోర్నమెంట్ తొలి రౌండ్లో విజయం సాధించిన రోహన్ బోపన్న.. ఏటీపీ మాస్టర్స్ 1000 ఈవెంట్‌లో ఓ మ్యాచ్‌లో గెలుపొందిన అతిపెద్ద వయస్కుడిగా నిలిచాడు. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) వెల్లడించింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో రోహన్ బోపన్న..అమెరికా ఆటగాడు బెన్ షెల్టన్ జతగా 6-3, 7-5తో ఫ్రాన్సికో, టాబిలో జోడీపై విజయం సాధించాడు. 69 నిమిషాల మ్యాచ్‌లో అలవోక విజయం సాధించిన రోహన్ బోపన్న.. ఏటీపీ రికార్డు పుస్తకాలకు ఎక్కాడు. 45 ఏండ్ల 30 రోజుల వయసులో రోహన్ బోపన్న ఈ రికార్డు సాధించగా.. గతంలో ఈ రికార్డు ఎవరి పేరిట ఉన్న విషయాన్ని ఏటీపీ పంచుకోలేదు. గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ విజయంతో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన అతిపెద్ద వయస్కుడిగా నిలిచిన బోపన్న.. తాజాగా ఏటీపీ రికార్డును సైతం ఖాతాలో వేసుకున్నాడు. తొలి రౌండ్లో ఐదు ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో మెరిసిన షెల్టన్, బోపన్న జోడీ రెండో రౌండ్లో మూడో సీడ్ ఇటలీ ఆటగాళ్లతో తలపడనుంది.

మెద్వదేవ్ ముందంజ : పురుషుల సింగిల్స్‌లో రష్యా స్టార్ ఆటగాడు డానిల్ మెద్వదేవ్ ముందంజ వేశాడు. తొలి రౌండ్లో సహచర రష్యా ఆటగాడు కారెన్ కచనోవ్‌పై 7-5, 4-6, 6-4తో మూడు సెట్ల మ్యాచ్‌లో విజయం సాధించాడు. ఇటలీ ఆటగాడు లోరెంజో ముసెటి 4-6, 7-5, 6-3తో చైనా ప్లేయర్ బుపై గెలుపొందాడు. గ్రిగర్ దిమిత్రోవ్ 6-3, 6-4తో వరుస సెట్లలో నికోలస్ జారీపై నెగ్గగా.. రాబర్టో బటిస్టా ఆగట్ 6-2, 6-4తో బ్రాండన్‌ను చిత్తు చేశాడు.

ప్రియాన్ష్ శతకం

నవతెలంగాణ-ముల్లాన్‌పూర్

- చెన్నైపై పంజాబ్ కింగ్స్ గెలుపు
- పంజాబ్ 219/6, చెన్నై 201/5



ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్ పరాజయాల పరంపర కొనసాగుతుంది. ఛేదనలో వరుసగా విఫలమవుతున్న సూపర్‌కింగ్స్ ముల్లాన్‌పూర్‌లోనూ చేతులెత్తేసింది. 220 పరుగుల భారీ ఛేదనలో 201 పరుగులే చేసింది. 18 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్ చేతిలో పరాజయం పాలైంది. ఐపీఎల్18లో ఐదు మ్యాచుల్లో చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఇది నాల్గో పరాజయం కాగా నాలుగు మ్యాచుల్లో పంజాబ్ కింగ్స్‌కు ఇది మూడో విజయం.

పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (103, 42 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్స్‌లు) శతక మోత మోగించాడు. సూపర్‌కింగ్స్ బౌలర్లపై విశ్వరూపం చూపించిన ప్రియాన్ష్ ఆర్య ఏడు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లతో 39 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. లోయర్ ఆర్డర్‌లో శశాంక్ సింగ్ (52 నాటౌట్, 36 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), మార్కో జాన్సెన్ (34 నాటౌట్, 19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సైతం మెరవటంతో చెన్నై సూపర్‌కింగ్స్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 219 పరుగుల భారీ స్కోరు చేసింది. పంజాబ్ టాప్, మిడిల్ ఆర్డర్ విఫలమైనా.. ప్రియాన్ష్ ఆర్య, శశాంక్ సింగ్ ఆ జట్టుకు భారీ స్కోరు అందించారు. ప్రభుసిమ్రన్ సింగ్ (0), శ్రేయస్ అయ్యర్ (9), మార్కస్ స్టోయినిస్ (4), నెహల్ వదేరా (9), గ్లెన్ మాక్స్‌వెల్ (1)లు విఫలమయ్యారు. ఛేదనలో సూపర్‌కింగ్స్ ఓపెనర్లు రచిన్ రవీంద్ర (36), డెవాన్ కాన్వే (69) రాణించినా.. ఆశించిన వేగంతో పరుగులు రాబట్టలేదు. రుతురాజ్ గైక్వాడ్ (1) నిరాశపరిచినా.. శివం దూబె (42) ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. ఆఖర్లో ఎం.ఎస్ ధోని (27) మూడు సిక్సర్లతో మెరిసినా.. అప్పటికే మ్యాచ్ పంజాబ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. 20 ఓవర్లలో 5 వికెట్లకు చెన్నై 201 పరుగులు చేసింది.

ఐపీఎల్ 2025 పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	వి	ఓ	పా
1 ఢిల్లీ	03	03	00	06
2 గుజరాత్	04	03	01	06
3 బెంగళూర్	04	03	01	06
4 పంజాబ్	04	03	01	06
5 లక్నో	05	03	02	06
6 కోల్‌కత	05	02	03	04
7 రాజస్థాన్	04	02	02	04
8 ముంబయి	05	01	04	02
9 చెన్నై	05	01	04	02
10 హైదరాబాద్	05	01	04	02

మ్యా : మ్యాచులు, వి : విజయాలు, ఓ : ఓటములు, పా : పాయింట్లు

అనిశ్చితిలో క్లాసెన్ కెరీర్?



జొహనెస్‌బర్గ్ : వైట్‌బాల్ ఫార్మాట్‌లో అగ్రశ్రేణి ఆటగాడు, దక్షిణాఫ్రికా స్టార్ క్రికెటర్ హెన్రిచ్ క్లాసెన్ అంతర్జాతీయ కెరీర్ అనిశ్చితిలో పడింది. 18 మందితో సెంట్రల్ కాంట్రాక్టు జాబితాను క్రికెట్ దక్షిణాఫ్రికా (సీఎస్ఏ) విడుదల చేయగా.. అందులో క్లాసెన్‌కు చోటు లభించలేదు. 2024 జనవరిలో టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన క్లాసెన్ ప్రస్తుతం వన్డే, టీ20లు ఆడుతూ.. టీ20 లీగ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నాడు. వైట్‌బాల్ ఫార్మాట్‌లోనే డెవిడ్ మిల్లర్, వాన్‌డర్ డుసెన్ హైబ్రిడ్ కాంట్రాక్టును అంగీకరించారు. దీంతో జాతీయ జట్టు తరఫున ఐసీసీ, ఇతర కీలక ద్వైపాక్షిక సిరీస్‌ల్లోనే ఆడతారు. 'క్లాసెన్ కాంట్రాక్టు, భవిష్యత్‌పై చర్చలు కొనసాగుతున్నాయి. త్వరలోనే తుది నిర్ణయం వెల్లడిస్తామని' క్రికెట్ దక్షిణఫ్రికా ఓ ప్రకటనలో తెలిపింది.

నవచిత్రం

'లెనిన్'గా అఖిల్



అఖిల్

టాలీవుడ్‌లో మరో ప్రతిష్టాత్మక చిత్రం రూపుదిద్దుకుంటోంది. అఖిల్ హీరోగా అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్ మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'వినరో భాగ్యము విష్ణు కథ' చిత్రంతో దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్న మురళీకిశోర్ అబ్బూరు ఈచిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.
అక్కినేని అఖిల్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఆయన నటించబోయే ఈ 6వ చిత్రానికి 'లెనిన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ని ప్రకటించారు. 'ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది కాదు' అనేది ట్యాగ్ లైన్. ఈ సినిమాలో ప్రేమకి ఉన్న ప్రాధాన్యతను సంపూర్ణంగా చెప్పే ట్యాగ్ లైన్ ఇది. అలాగే టైటిల్ గ్లింప్స్‌ని కూడా రిలీజ్ చేశారు. అఖిల్ సరసన శ్రీలీల నటిస్తున్న విషయం గ్లింప్స్‌లో రివీల్ అయింది. 'పుట్టేటప్పుడు ఊపిరి ఉంటుంది రా, పేరు ఉండదు. పోయేటప్పుడు ఊపిరి ఉండదు, పేరు మాత్రమే ఉంటుంది' అని రాయలసీమ స్లాంగ్‌లో అఖిల్ చెప్పిన డైలాగ్ సినిమాలో ఎమోషన్ ఏ రేంజ్‌లో ఉంటుందో చెప్పకనే చెప్పింది. యాక్షన్ కమర్షియల్ ఎంటర్టైనర్‌కి ఉండాల్సిన పక్కా డైలాగులు ఉన్నాయనే ఫీల్‌ని టైటిల్ గ్లింప్స్ క్రియేట్ చేసింది.



అల్లు అర్జున్, అట్లీ


అట్లీ దర్శకత్వంలో భారీ చిత్రం

అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించనున్న అత్యంత భారీ పాన్ ఇండియా సినిమా ప్రకటన అధికారికంగా వచ్చేసింది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న తొలి తెలుగు సినిమా ఇది. మంగళవారం అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా సన్‌పిక్చర్స్ సంస్థ ఈ ప్రకటనను విడుదల చేసింది. కళానిధి మారన్ సమర్పణలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న అంతర్జాతీయ ప్రాజెక్ట్ ఇది.
లాస్ ఏంజెల్స్‌లోని ఓ స్టూడియోలో ప్రత్యేకంగా హీరో అల్లు అర్జున్, హాలీవుడ్ టెక్నీషియన్స్, దర్శకుడు అట్లీలపై చిత్రీకరించిన ఓ ప్రత్యేక వీడియో ద్వారా ఈ అనౌన్స్‌మెంట్‌ను చేసి అందరిని సర్‌ప్రైజ్ చేశారు.
భారతీయ విలువలతో కూడిన కథనంతో ఓ భారీ ఎమోషనల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే ఈ చిత్రంలో అద్భుతమైన గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్, హాలీవుడ్ స్థాయి మేకింగ్ ఉండబోతుందని అర్థమవుతోంది.
ఈ సినిమా షూటింగ్ ఈ సంవత్సరం చివర్లో ప్రారంభమవుతుందని మేకర్స్ వెల్లడించారు. నటీనటులు, సాంకేతిక బృందం, విడుదల తేదీ వంటి వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు.

బంధాల నేపథ్యంలో 'చెరసాల'

రామ్ ప్రకాష్ గున్నం హీరోగా నటిస్తూ, తెరకెక్కించిన చిత్రం 'చెరసాల'. శ్రీజిత్, నిష్కల, రమ్య ముఖ్య పాత్రలు పోషించారు. ఎస్ రాయ్ క్రియేషన్స్ బ్యానర్ పై కథి అంజమ్మ సమర్పణలో కథి అంజమ్మ, శికార దీన్ని నిర్మించారు. ఈ మూవీ ఈనెల 11న రాబోతోంది.
ఈ సందర్భంగా డైరెక్టర్, హీరో రామ్ ప్రకాష్ గున్నం మాట్లాడుతూ, 'మంచి కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రాబోతోంది. కథ చెప్పిన వెంటనే నిర్మాతలు అంగీకరించారు. శ్రీజిత్, నిష్కల అద్భుతంగా నటించారు. ఓ బంధం ఎలా ఉండాలి?, రిలేషన్ షిప్‌లో ఎలా ఉండాలి?, ఎలా ఉండకూడదు అనే పాయింట్స్‌ను ఇందులో చూపించాను. మంచి ఎమోషన్స్‌తో పాటు చక్కని వినోదం కూడా ఉంటుంది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది. మా సినిమాను అందరూ చూసి ఆదరించండి' అని తెలిపారు.
'సినిమా అద్భుతంగా వచ్చింది. నేను కన్నడలో ఇది వరకు సినిమాలు చేశాను. నన్ను నమ్మి మా దర్శకుడు నాకు అవకాశం ఇచ్చారు. ఇలాంటి మంచి చిత్రాలు మరిన్ని రావాలి' అని హీరో శ్రీజిత్ చెప్పారు.





'డియర్ ఉమ' రిలీజ్‌కి రెడీ

సుమయ రెడ్డి హీరోయిన్‌గా, నిర్మాతగా, రచయితగా తెరకెక్కించిన 'డియర్ ఉమ' చిత్రం ఈనెల 18న విడుదల కానుంది. పృథ్వీ అంబర్ హీరోగా నటించిన ఈ మూవీకి లైన్ ప్రొడ్యూసర్‌గా నగేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నితిన్ రెడ్డి వ్యవహరించారు. సాయి రాజేష్ మహాదేవ్ స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు.
తాజాగా ఈ చిత్ర టీజర్‌ను దర్శకుడు శివ నిర్వాణ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'టీజర్ ఎంతో బాగుంది. ప్రేమతో పాటుగా అంతర్లీనంగా మంచి సందేశాన్నిచ్చే ఫీల్ గుడ్ ఎంటర్టైనర్‌లా ఈ సినిమా ఉండటం అభినందనీయం' అని అన్నారు.
హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమతో పాటు ఇందులో సమాజాన్ని మేల్కొలిపే చక్కటి సందేశాన్ని ఇవ్వడం, అలాగే హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను లవ్, ఫ్యామిలీ, యాక్షన్ డ్రామా ఇలా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కించారని టీజర్ చూస్తే అర్థమవుతోంది.

వర్సిటీల్లో పోస్టుల భర్తీకి పాత పద్ధతినే అనుసరించాలి

లెక్చరర్‌గా అనుభవం అనే అంశాన్ని ఎత్తేయాలి

- నేరుగా నియామకాలు చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రం లోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తెలిపింది. పాత పద్ధతిని అనుసరించి పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చాలా కాలం నుంచి రాష్ట్రంలోని వర్సిటీల్లో అధ్యాపకుల నియామకాలు జరగలేదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో చివరిసారిగా నియామాలు జరిగాయని వివరించారు. అయితే ఈ సారి నిర్వహించే నియామకాల్లో మూడు దశల్లో ఉంటుందని ఉన్నత విద్యామండలి ప్రకటించిందని పేర్కొన్నారు. మొదటి దశలో విద్యార్హతల స్కోర్ ఆధారంగా 50 మార్కులు, రెండో దశలో అనుభవం తదితర అంశాలకు 30 మార్కులు, మూడో దశలో ఇంటర్వ్యూ కోసం 20 మార్కులుంటాయని ప్రకటించిందని వివరించారు. రెండో దశలో కేటాయించిన 30 మార్కుల్లో ఏదైనా డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకుని గా లేదా ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ కళాశాలలు, ప్రయివేట్ డిగ్రీ కళాశాలల్లో బోధించిన అనుభవం 10 ఏండ్లు ఉంటే 10 మార్కులు, ఏడాదికి ఒక మార్కు ఆధారంగా 10 మార్కులు, పీడీఎఫ్ ఉంటే ఐదు మార్కులు, నెట్, సెట్ లేదా ఎంఫిల్ ఉంటే ఐదు మార్కులు అని ప్రకటించారని తెలిపారు. దీనిలో ప్రధానంగా ప్రభుత్వం అనుభవం అనే అంశాన్ని చేర్చడంపై పునరాలోచన చేయాలని కోరారు. బోధన, పరిశోధనలపై మక్కువతో పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న నూతన అభ్యర్థులకు ఈ నిబంధన అడ్డంకిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేటాయించిన 30 మార్కుల్లో 15 కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. అంటే 15 మార్కులకు మాత్రమే పోటీ పడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ అధ్యాపక వృత్తికి డోర్ స్టెప్ అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు కోసం బోధన అనుభవానికి అధిక మార్కులు కేటాయించడం సహజ న్యాయ సూత్రానికి వ్యతిరేకమని విమర్శించారు. స్క్రూటినీ అనేది మెరిట్ ఆధారంగా జరగాలనీ, కానీ, అనుభవం పేరుతో స్క్రూటినీ మొత్తం 80 మార్కులకు కాకుండా 30 మార్కులకు కుదించడం సరైంది కాదని తెలిపారు. జేఆర్ఎఫ్, ఇతర ఫెలోషిప్‌లు తీసుకుంటున్న వారికి బోధించే అనుభవం సాధారణంగా ఉండబోదని వివరించారు. ఫెలోషిప్‌లు పొందుతూ బోధన చేయడం కుదరదని పేర్కొన్నారు. కావున ఉన్నత విద్యా మండలి ఈ నిర్ణయం తీసుకోవడం అంటేనే న్యాయ పరమైన చిక్కులు నోటిఫికేషన్‌లోనే సృష్టించినట్టు అవుతుందని తెలిపారు. యూజీసీ నిబంధనల ప్రకారం పీజీలో 55 శాతం మార్కులుంటే సరిపోతుందని పేర్కొన్నారు. కానీ డిగ్రీ మార్కులు కూడా పరిగణనలోకి తీసుకోవడం వల్ల నష్టం జరుగుతుందని తెలిపారు. యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కి ఈ నిబంధనలను జారీ చేశారని విమర్శించారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి జేఆర్ఎఫ్ వారికి ఒకే మార్కులు కేటాయించారని తెలిపారు. ఈ నిర్ణయం కూడా సరైంది కాదని పేర్కొన్నారు. గతంలో కేవలం అకడమిక్ రికార్డ్ అండ్ రీసెర్చ్ పర్ఫార్మెన్స్ స్కోర్, ఇంటర్వ్యూ ఆధారంగా మార్కులుండేవని గుర్తు చేశారు. కానీ కొత్తగా అనుభవం ఉండాలని చేర్చడం మూలంగా నిజమైన అభ్యర్థులు నష్ట పోతారని తెలిపారు. ప్రభుత్వం కావాలనే న్యాయ పరమైన చిక్కులు సృష్టించేలా ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. అనుభవం అనే అంశాన్ని తొలగించి నిజమైన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉన్నత విద్యామండలి ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జీటీ గోపాలరావు, యర్రా శ్రీకాంత్‌ల మృతి తీరని లోటు

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్
- ఎస్వీకేలో సీఐటీయూ ఆధ్వర్యంలో సంతాప సభ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏఐడీఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి జీటీ.గోపాలరావు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్‌ల అకాల మరణం కార్మికోద్యమానికి తీరని లోటు అని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ వాపోయారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. జీటీ. గోపాలరావు, యర్రా శ్రీకాంత్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యర్రా శ్రీకాంత్ చిన్న వయస్సులో ఆకస్మికంగా గుండెపోటుతో మరణించడం బాధాకరమన్నారు.ఆయన మృతి సీఐటీయూ, ఖమ్మం జిల్లా ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ఖమ్మం పట్టణంలో అనేక యూనియన్లు నిర్మించి, కార్మిక సమస్యలపై పని చేయడమే కాకుండా, నివాస ప్రాంత సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడారని గుర్తుచేశారు. జీటీ. గోపాలరావు రక్షణరంగ ఉద్యోగుల సమస్యలపై నికరంగా పోరాడటమే కాకుండా, పాలక పార్టీల విధానాలకు వ్యతిరేకంగా తలపెట్టిన అన్ని ఉద్యమాల్లోనూ చురుకైన పాత్ర పోషించారని గుర్తుచేశారు. శ్రామిక ప్రజల హక్కుల కోసం వామపక్ష ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారనీ, వామపక్ష సిద్ధాంతానికి కట్టుబడి తుది శ్వాస వరకు నికరంగా కార్మికుల పక్షాన పోరాడారని కొనియాడారు. ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఎస్వీ.రమ, పి. జయలక్ష్మి, వీఎస్.రావు, జె. మల్లికార్జున్, బీరం మల్లేష్, ఎ.జె. రమేష్, కె.ఈశ్వర్‌రావు, ముత్యంరావు, రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, ఎం.పద్మశ్రీ, బి. మధు, ఎం. వెంకటేష్, కూరపాటి రమేష్, పి. శ్రీకాంత్, గోపాలస్వామి, కాసు మాధవి, కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, ఆర్. కోటంరాజు, పి. సుధాకర్‌లతో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

టాటా మోటార్స్ గ్లోబల్ అమ్మకాలు డీలా

మార్చి త్రైమాసికంలో 3 శాతం పతనం



ముంబయి : ఆర్థిక వ్యవస్థల పనితీరుకు అద్దం పట్టే వాహన అమ్మకాలు ప్రతికూలతను ఎదుర్కొంటున్నాయి. దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ గ్లోబల్ అమ్మకాలు పడిపోవడం కలవరానికి గురి చేస్తోన్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) జనవరి నుంచి మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 3 శాతం తగ్గుదలతో మొత్తంగా 3,66,177 యూనిట్లను విక్రయించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ప్రపంచ వ్యాప్తంగా 3,77,432 యూనిట్ల అమ్మకాలు చేసింది. గడిచిన క్యూ4లో తన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ జాగ్వర్ లాండ్ రోవర్ (జెఎల్ఆర్) విక్రయాలు స్వల్పంగా పెరిగినప్పటికీ.. స్థూల అమ్మకాలు ఆశాజనకంగా లేకపోవడం విశేషం. 2024 మార్చి త్రైమాసికంలో టాటా మోటార్స్ వాణిజ్య వాహన అమ్మకాలు కూడా 3 శాతం తగ్గి 1,07,765 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. ప్యాసింజర్ వాహన విక్రయాలు 6 శాతం క్షీణించి 1,46,999 యూనిట్లకు పరిమితం కాగా.. జెఎల్ఆర్ అమ్మకాలు మాత్రం 1 శాతం పెరిగి 1,11,413 యూనిట్లుగా నమోదయ్యాయి. బ్రిటన్‌లో తయారయ్యే తన జెఎల్ఆర్ కార్లను అమెరికాకు ఎగుమతి చేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఇటీవల ఆ కంపెనీ తెలిపింది.. ట్రంప్ తమ దేశంలోకి దిగుమతయ్యే వాహనాలపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. 2024 మార్చి వరకు 12 నెలల కాలంలో జెఎల్ఆర్ మొత్తంగా 4.30 లక్షల కార్లను విక్రయించింది. ఇందులో నాలుగో వంతు అమెరికాలో అమ్మకాలు చేసింది.

సంపన్నులకు ఎలీట్ ప్లస్ సేవింగ్స్ ఖాతా

బంధన్ బ్యాంక్ వెల్లడి



ముంబయి : సంపన్న ఇన్వెస్టర్ల కోసం కొత్తగా ఎలీట్ ప్లస్ సేవింగ్స్ అకౌంట్‌ను ప్రారంభించి నట్లు బంధన్ బ్యాంక్ వెల్లడించిం ది. దీనిని ఆ బ్యాంక్ సిబిఒ రాజీందర్ కుమార్, సీఓఓ రతన్ కుమార్, సీఈఓ పార్థ ప్రతిమ్ సేన్ గుప్తా ఆవిష్కరించగా.. ప్రముఖ క్రికెటర్ సౌరవ్ గంగూలీ తొలి ఖాతాదారుడిగా చేరారు. ఈ ఎకౌంట్ ద్వారా ఖాతాదారులు మరింత మెరుగైన సేవలను పొందవచ్చని పేర్కొంది. సినిమా టికెట్లు, ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్, గోల్ఫ్ సెషన్స్, అపరిమిత ఉచిత లావాదేవీల్లాంటి ప్రత్యేక ప్రయోజనాలు అందుకోవచ్చని వెల్లడించింది. రూ. 15 లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా, రూ. 3 లక్షల వరకు పర్చేజ్ ప్రొటెక్షన్‌తో కూడుకున్న మెరుగైన డెబిట్ ఇన్సూరెన్స్ కవరేజీ సహా ఎక్స్‌క్లూజివ్ వోచర్లు, మైల్‌స్టోన్ ఆఫర్లను పొందవచ్చని పార్థ ప్రతిమ్ పేర్కొన్నారు.

సంపద సృష్టిలో మహిళలకు సవాళ్లు

ఎడెల్వీస్ లైఫ్ సీడీఓ

ముంబయి : ప్రస్తుత తరములోని మహిళలు 50 శాతం మంది సంపద సృష్టిలో సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఎడెల్వీస్ లైఫ్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ (సీడీఓ) అనూప్ సేథ్ పేర్కొన్నారు. ఆదాయాలను పెంచుకునే వివిధ ఆర్థిక సాధనాల గురించి అవగాహన లోపించిందని తమ అధ్యయనంలో తేలిందన్నారు. 35-54 ఏళ్ల మధ్య వయస్సున్న ప్రస్తుత శాండ్విచ్ జనరేషన్ పెరుగుతున్న పిల్లలకు ఆసర అందిస్తూ వృద్ధులవుతున్నారన్నారు. ఆర్థిక విద్యతోనే చాలామంది మహిళలు తమ సొంత ఆర్థిక భవిష్యత్తును క్రియాశీలకంగా నిర్వహించుకోగలరన్నారు. 61 శాతం మహిళలు ఆర్థిక భద్రత ఉన్నప్పటికీ తరచూ డబ్బు లేదని దిగులు పడుతూ ఉంటున్నారన్నారు. తమ పొదుపు, పెట్టుబడులు భవిష్యత్తు కొరకు సరిపోవని 64 శాతం మంది భావిస్తున్నారన్నారు.

మార్కెట్లకు ఉపశమనం

ముంబయి : భారీ నష్టాల నుంచి మార్కెట్లకు ఉపశమనం లభించింది. ట్రంప్ టారిఫ్ భయాలతో ఇటీవల వరుస నష్టాలను చవి చూస్తోన్న దలాల్ స్ట్రీట్ మంగళవారం లాభాలను నమోదు చేసింది. ఆర్‌బిఐ వడ్డీ రేట్లను తగ్గించొచ్చనే అంచనాలకు తోడు భారీగా తగ్గిన షేర్ల విలువల నేపథ్యంలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలోనే బీఎస్ఈ సెన్సెక్స్ 1089 పాయింట్లు పెరిగి 74,227కు చేరింది. సెన్సెక్స్ ఓ దశలో 1600 పాయింట్లకు పైగా ర్యాలీ చేసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 374 పాయింట్ల లాభంతో 22,536 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్ గ్రిడ్ మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి.

ఇక ఆరు ఎయిర్ బ్యాగ్‌లతో మారుతి గ్రాండ్ విటార

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తన గ్రాండ్ విటారను ఆరు ఎయిర్ బ్యాగ్‌లతో అందుబాటులోకి తెచ్చినట్టు ప్రకటించింది. మరిన్ని భద్రత ఫీచర్లు, పరికరాలతో విడుదల చేసినట్లు ఆ సంస్థ మంగళవారం వెల్లడించింది. దీని ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.11.42 లక్షలుగా నిర్ణయించింది.

జేబీఎల్ నుంచి ట్యూన్ సిరీస్2 ఆవిష్కరణ

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ జేబీఎల్ కొత్తగా ట్యూన్ సిరీస్2ను ఆవిష్కరించింది. సుపీరియర్ సౌండ్, బ్లూటూత్ 5.3,ఎల్ఈ ఆడియో టెక్నాలజీతో అసాధారణ కనెక్టివిటీ ఫీచర్లతో అందిస్తోన్నట్టు ఆ సంస్థ పేర్కొంది. ఏప్రిల్ 17 నుంచి అందుబాటులో ఉంటాయని పేర్కొంది. వీటి ధరలు రూ.9,499గా ప్రారంభమవుతాయని తెలిపింది.

లెక్సస్ అమ్మకాల్లో 19 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల కంపెనీ లెక్సస్ ఇండియా గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25 అమ్మకాల్లో 19 శాతం వృద్ధిని సాధించినట్లు వెల్లడించింది. ఇంతక్రితం ఏడాది విక్రయాల్లో 17 శాతం పెరుగుదల నమోదు చేసినట్లు పేర్కొంది. ఈ కంపెనీ ప్రధానంగా ఎన్ఎక్స్, ఎల్ఎం, ఆర్ఎక్స్ మోడళ్లను భారత్‌లోయ విక్రయిస్తోంది. దేశంలో లగ్జరీ ఆటోమోటివ్ రంగంలో లెక్సస్ ఇండియా బ్రాండ్‌కు పెరుగుతున్న ఆదరణకు తమ విక్రయాలే నిదర్శనమని ఆ కంపెనీ పేర్కొంది.

నేషనల్ మార్ట్ లక్కీడ్రా విజేతల ఎంపిక

హైదరాబాద్ : ప్రముఖ రిటైల్ చెయిన్ నేషనల్ మార్ట్ ఇండియా ప్రకటించిన ఫెస్టివ్ ధమాకా లక్కీ డ్రాను ప్రకటించింది. తన నాగారం స్టోర్‌లో ఏర్పాటు చేసిన ఈ డ్రాలో మొత్తం 222 బహుమతులు ప్రదానం చేశారు. మెగా బహుమతిగా సరికొత్త కారును అందించినట్టు ఆ సంస్థ తెలిపింది. 13 మంది లక్కీ కస్టమర్లకు రిఫ్రిజిరేటర్లు, మరో 13 మంది విజేతలకు ఏసీలను అందించినట్టు నేషనల్ మార్ట్ వ్యవస్థాపకుడు యష్ అగర్వాల్ తెలిపారు.

చిన్న వ్యాపారులకు పూనావాల ఫిన్‌కార్ప్ రుణాలు

ముంబయి : సైరస్ పూనావాలా గ్రూప్ ప్రమోట్ చేస్తున్న ఎన్‌బిఎఫ్‌సి సంస్థ పూనావాలా ఫిన్‌కార్ప్ లిమిటెడ్ (పీఎఫ్ఎల్) కొత్తగా షాప్‌కీపర్ లోన్ బిజినెస్‌ను ఆవిష్కరించింది. చిన్న రిటైలర్లు, కిరాణా దుకాణాలు ఎదుర్కొనే కీలక ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆ సంస్థ ఎండీ, సీఈఓ అరవింద్ కపిల్ తెలిపారు. ఈ రుణాలు వారి నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు తోడ్పాటును అందిస్తాయన్నారు. తొలి దశలో 44 ప్రాంతాల్లో ఈ రుణాలను జారీ చేస్తామన్నారు.

తుదికంటా పోరాడతాం

అదనంగా 50శాతం టారిఫ్‌లు విధిస్తాంటూ అమెరికా బెదిరింపులపై చైనా స్పష్టీకరణ



బీజింగ్ : ఇరు దేశాల ప్రయోజనాలను, అలాగే అంతర్జాతీయ సమాజం ప్రయోజనాలను పట్టించుకోకుండా అమెరికా టారిఫ్ యుద్ధాన్ని లేదా వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించాలని పట్టుబడితే చైనా కూడా తుదికంటా పోరాడుతుందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ మంగళవారం చెప్పారు. అమెరికా చర్యకు దీటుగా చైనా తీసుకుంటున్న ప్రతీకార చర్యలను తక్షణమే ఉపసంహరించుకోని పక్షంలో చైనాపై అదనంగా 50శాతం టారిఫ్‌లు విధిస్తామంటూ ట్రంప్ బెదిరించడంపై అడిగిన ప్రశ్నకు లిన్ పై మేరకు స్పందించారు. అమెరికా ప్రారంభించిన ఈ టారిఫ్ చర్యలు అన్ని దేశాల చట్టబద్ధమైన హక్కులను, ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయని, డబ్ల్యుటిఓ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని, బహుళపక్ష వాణిజ్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తున్నాయని, అంతర్జాతీయ ఆర్థిక సుస్థిరతను దెబ్బ తీస్తున్నాయని లిన్ విమర్శించారు. ఈ వైఖరిని చైనా తీవ్రంగా ఖండిస్తోందని పునరుద్ఘాటించారు. సమస్యలను రెచ్చగొట్టాలని మేం అనుకోవడం లేదు, అలాగే సమస్యలు ఎదురైతే భయపడం కూడా అని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులు, ఒత్తిళ్ళు వంటివి చైనా దగ్గర పని చేయవన్నారు. చైనా సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాలు దెబ్బ తింటుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు.

ఇయు చీఫ్‌కు చైనా ప్రధాని ఫోన్ కాల్

యురోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌తో మంగళవారం చైనా ప్రధాని లీ కియాంగ్ ఫోన్‌లో మాట్లాడారని సిసిటివి న్యూస్ తెలిపింది. ఈ ఏడాదితో చైనా-ఇయు దౌత్య సంబంధాలకు 50ఏళ్ళు పూర్తయినట్లు లీ తెలిపారు. ఇయుతో రాజకీయ పరస్పర విశ్వాసాన్ని పెంచుకోవాలని చైనా భావిస్తోందన్నారు. అలాగే ఆచరణాత్మక సహకారాన్ని విస్తరించుకోవాలని కోరుకంటున్నా మన్నారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా పరస్పర ఆందోళనలను పరిష్కరించుకోవాలన్నారు. లేయన్ కూడా స్పందిస్తూ, సుస్థిరతను కొనసాగించాలంటే ఇయు-చైనా సంబంధాలు చాలా కీలకమని వ్యాఖ్యానించారు. బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను పరిరక్షించడానికి ఇయు, చైనాలు కట్టుబడి వున్నాయన్నారు.



అణు కార్యక్రమంపై ఇరాన్‌తో ప్రత్యక్ష చర్చలు

వాషింగ్టన్ : అణు కార్యక్రమంపై అమెరికా, ఇరాన్‌లు ప్రత్యక్ష చర్చలు ప్రారంభించనున్నాయని అధ్యక్షులు ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఇరాన్‌తో నేరుగా చర్చలు జరపనున్నామని, శనివారం ప్రారంభం కానున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌తో బేటీ కానున్నామని, ఏమి జరుగుతుందో వేచి చూద్దామని అన్నారు. ఇరు దేశాలు ఒప్పందం చేసుకోవడం ఉత్తమం అని అందరూ అంగీకరిస్తున్నారని తాను భావిస్తున్నానని అన్నారు. ఓవల్ కార్యాలయంలో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూతో చర్చల సందర్భంగా మీడియాతో మాట్లాడారు. అణు కార్యక్రమంపై ప్రత్యక్ష చర్చలు జరపాలని లేదా బాంబుదాడులు ఎదుర్కోవలసి ఉంటుందని ఇటీవల ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. అమెరికాతో ప్రత్యక్ష చర్చలు అర్థం లేనివని ఇరాన్ వెల్లడించింది. అయితే పరోక్ష చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపింది.

పలు కారణాలతో విదేశీ విద్యార్థుల వీసాల రద్దు

ఆందోళనలో అమెరికా కాలేజీ యాజమాన్యాలు

వాషింగ్టన్ : హార్వర్డ్, టఫ్ట్స్, స్టాన్‌ఫోర్డ్ సహా ప్రధాన కాలేజీల్లో విదేశీ విద్యార్థులకు జారీ చేసే విద్యార్థి వీసాలను అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు రద్దు చేశారు. కారును వేగంగా నడపడంతో సహా పలు కారణాలతో ఇలా వీసాలు రద్దు చేయడం కాలేజీ క్యాంపస్ యాజమాన్యాల్లో ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ రికార్డులను అప్‌డేట్ చేసిన తర్వాత కళాశాలలు ఈ విషయాన్ని గుర్తించాయి. ఈ తాజా పరిణామం విద్యార్థులు, గ్రాడ్యుయేట్లు ఇద్దరినీ ప్రభావితం చేయనున్నాయని యాజమాన్యాలు పేర్కొన్నాయి. కాగా ఈ పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నామని అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ ప్రభుత్వ సంబంధాల సీనియ ర్ డైరెక్టర్ షెవ్ దలాల్-ధేని తెలిపారు. గత నెలలో 300 లేదా అంతకంటే ఎక్కువ వీసాలు రద్దు చేయబడ్డాయని విదేశాంగ కార్యద ర్శి మార్కో రూబియో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇలా వీసాల రద్దుతో పలువురు విద్యార్థులు బాధితులుగా మారుతున్నారు. టఫ్ట్స్ యూనివర్శిటీలో పిహెచ్‌డి చేస్తున్న టర్కీకి చెందిన రుమేసా ఓజ్‌టర్క్‌ను గత నెల వీధిలో నడుచుకుంటూ వెళుతుండగా ఫెడరల్ ఏజెంట్లు అదుపులోకి తీసుకున్నారు. పాలస్తీనా అనుకూల ప్రదర్శనలో పాల్గొన్న తర్వాత కొలంబియా యూనివర్శిటీకి చెందిన మహమూద్ ఖలీల్ వీసా రద్దయింది. ప్రస్తుతం రుమేసా, ఖలీల్‌లు ఇద్దరూ ఇమ్మిగ్రేషన్ జైలులో ఉన్నారు. డ్రైవింగ్ ఉల్లంఘనల పేరుతో కూడా వీసాలను రద్దు చేస్తున్నట్లు కొందరు విద్యార్థులు ఫెడరల్ కోర్టును ఆశ్రయించారు. ఇటీవల కాలిఫోర్నియాలో శాంతాక్రాజ్, స్టాన్‌ఫో ర్డ్‌తో సహా పలు క్యాంపస్‌లకు చెందిన 12మందికి పైగా విద్యార్థుల వీసాలు రద్దయ్యాయని స్థానిక మీడియా సోమవారం ప్రకటించింది. తమ యూనివర్శిటీలో చదువుతున్న ఆరుగురు విద్యార్థుల వీసాలు రద్దయ్యాయని స్టాన్‌ఫోర్డ్ గతవారం వెల్లడించింది. ముగ్గురు విద్యార్థులు, ఇద్దరు గ్రాడ్యుయేట్ల వీసాలు రద్దయ్యాయని హార్వర్డ్ యూనివర్శిటీ ప్రకటించింది.

చరిత్ర సృష్టించిన 'హార్ట్ ల్యాంప్'

బుకర్ ప్రైజ్ షార్ట్‌లిస్ట్‌కు ఎంపికైన తొలి కన్నడ పుస్తకంగా రికార్డు



న్యూఢిల్లీ : కన్నడ రచయిత్రి బాను ముస్తాక్ కథల సంకలనం హార్ట్ ల్యాంప్ కొత్త చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ కోసం షార్ట్‌లిస్ట్‌కు ఎంపికైన తొలి కన్నడ భాష పుసక్తంగా రికార్డులెక్కింది. 1990 నుంచి 2023 మధ్య బాను రచించిన 12 చిన్న కథల సంకలనం హార్ట్ ల్యాంప్‌ను దీపా భస్తి ఇంగ్లీష్‌లోకి అనువదించారు. 2025 అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ షార్ట్‌లిస్ట్‌ను మంగళవారం ప్రకటించారు. ఇందులో ఆరు పుస్తకాలకు స్థానం దక్కగా, వీటిల్లో హార్ట్‌ల్యాంప్ ఒకటి. ఈ షార్ట్‌లిస్ట్ గురించి బుకర్ ప్రైజ్ ఫౌండేషన్ మంగళవారం ఒక ప్రకటనద్వారా వెల్లడించింది. ఎంపికైన ఆరు పుస్తకాలు కూడా మానవ మనుగడ, స్వీయ సంరక్షణ గురించి పుస్తకాలని ప్రశంసించింది. విపత్తు, అణచివేత, నిర్లప్తత, నిరాశావాదాన్ని ఎదుర్కొంటునే మన అజేయమైన ప్రవృతి గురించి, మానవ స్ఫూర్తిని, మెరుగైన జీవితాన్ని గడపాలనే ప్రేరణను పంచుకునే పుస్తకాలని తెలిపింది. హార్ట్‌ల్యాంప్‌లోని కథలు గురించి చెబుతూ ఇవి ఇంగ్లీష్‌లో కొత్తగా ప్రచురించబడినప్పటికీ, ఇవి కొన్ని దశాబ్దాలు నుంచి ఉన్నాయని తెలిపింది.

కాగా, భారతీయ భాషల్లో ఇప్పటి వరకూ హిందీ పుస్తకం (2022లో తంబ్ ఆఫ్ సాండ్, రచన : గీతాంజిలి శ్రీ) మాత్రమే బుకర్ ప్రైజ్‌ను గెలుచుకుంది. 2023లో పెరుమాళ్ మురుగున్ రచించిన తమిళ నవల ఫైర్ షార్ట్ లిస్ట్‌కు ఎంపికయింది. అలాగే, మంగళవారం ప్రకటించిన బుకర్ ప్రైజ్ షార్ట్ లిస్ట్ జాబితా : ఆన్ ది కాలిక్యులేషన్ ఆఫ్ వాల్యూమ్ (పుస్తకం 1, డానిష్), స్మాల్ బోట్ (ఫ్రెంచ్), అండర్ ది ఐ ఆఫ్ ది బిగ్ బర్డ్ (జపాన్), పెరఫెక్షన్ (ఇటాలియన్), హార్ట్ ల్యాంప్ (కన్నడ), ఎ లెపర్డ్ -స్కిన్ హాట్ (ఫ్రెంచ్).

'జనగణమన'ను ప్రయివేటు విద్యాసంస్థల పాఠ్యపుస్తకాల్లోనూ ముద్రించాలి

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి రాజభాను చంద్రప్రకాశ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ గీతం జనగణమనను ప్రయివేటు పాఠశాలలు, కాలేజీల స్థాయి పాఠ్యపుస్తకాల్లోనూ ముద్రించాలని టీఎస్‌జీహెచ్‌ఎంఏ మాజీ అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ని మంగళవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతిజ్ఞలో మార్పులు చేయాలని సూచించారు. ప్రతిజ్ఞ ఆంగ్ల అనువాదంలో కూడా ఇండియాకు బదులుగా భారత్ అని మార్చాలని తెలిపారు. కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో జాతీయ గీతాలాపన తప్పనిసరి చేయాలని పేర్కొన్నారు. ప్రతిజ్ఞ చివరిలో జై హింద్ పదాలను ముద్రించాలని విజ్ఞప్తి చేశారు. భారతరాజ్యాంగం పట్ల విధేయత చూపుతాననీ, దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని కాపాడతాననీ, పర్యావరణాన్ని పరిరక్షిస్తానని అనే పదాలను కూడా ప్రతిజ్ఞలో పొందుపర్చాలని సూచించారు. ప్రతిజ్ఞ మూలంలో (1962) లేని పదాలు "జంతువుల పట్ల దయ కలిగి ఉంటాను" అనే పదాలను 2010 అనంతరం ముద్రించిన పాఠ్యపుస్తకాల్లో చేర్చడం చట్టబద్ధతను పరిశీలించాలని తెలిపారు. ఈ ప్రతిపాదనలపై బండి సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాజుల రవీందర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగపూర్‌లో అగ్ని ప్రమాదం

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడికి గాయాలు
- బయలుదేరిన జనసేన నేత



సింగపూర్ : సింగపూర్‌లోని ఒక స్కూల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ (7) గాయపడ్డాడు. సింగపూర్‌లో చదువుకుంటున్న మార్క్ శంకర్ మంగళవారం స్కూల్లో వుండగా ఈ ప్రమాదం జరిగింది. కాళ్లకు, చేతులు గాయలవడంతో పాటూ ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లిపోవడంతో బాలుడిని ఆస్పత్రిలో చేర్చారని, అక్కడ చికిత్స అందుతోందని జనసేన పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం అల్లూరి సీతారామ రాజు జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తున్న పవన్ కల్యాణ్ ఇక్కడ పర్యటన ముగించుకుని సింగపూర్ బయలుదేరారు.

కాగా, అగ్ని ప్రమాదం కచ్చితంగా ఎక్కడ జరిగిందనే సమాచారం తెలియరాలేదు. కానీ సింగపూర్ సివిల్ డిఫెన్స్ ఫోర్స్ (ఎస్‌సిడిఎఫ్)అధికారిక ఫేస్‌బుక్ పేజ్ ప్రజలకు అందించిన సమాచారం మేరకు సింగపూర్ కాలమానం ప్రకారం ఉదయం 9.45 గంటల సమయంలో రివర్ వ్యాలీ రోడ్‌లోని స్కూల్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలియచేసింది. మూడంతస్తుల షాప్‌హౌస్‌లో రెండు, మూడు అంతస్తుల్లో మంటలు ఎగిసిపడడం వీడియోలో కనిపిస్తోంది.

మూడవ అంతస్తు వెలుపల చిట్టచివరి అంచున అనేకమంది నిలబడి వుండడం కనిపిస్తోంది. నిర్మాణ కార్మికులతో సహా కొంతమంది ప్రజలు నిచ్చెన, పరంజాలను ఉపయోగించి ఆ అంతస్తుల్లో చిక్కుకుపోయిన చిన్నారులను బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఫేస్‌బుక్ పోస్టు పేర్కొంది. 30నిముషాల వ్యవధిలోనే మూడు వాటర్ జెట్‌లతో మంటలను ఆర్పివేశారని ఎస్‌సిడిఎఫ్ తెలిపింది. నలుగురు పెద్దవారిని, 15మంది చిన్నారులను ఆస్పత్రికి తరలించారు. సింగపూర్ వార్తా సంస్థ ది స్ట్రెయిట్ టైమ్స్ అందించిన కథనం ప్రకారం టమోటా కుకింగ్ స్కూల్ ఈ ప్రమాదంలో దెబ్బతింది. సమ్మర్ కేంప్ సందర్భంగా పిల్లలకు కుకింగ్ తరగతులను ఈ స్కూలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రానికి వన్నె తెచ్చేలా మిస్ వరల్డ్ పోటీలు

పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సభర్వాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణకు వన్నె తెచ్చేలా మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సభర్వాల్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని టూరిస్టు ప్లాజాలో స్వాగత ఏర్పాటపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 7 నుంచి 31 వరకు జరగనున్న 72వ మిస్ వరల్డ్ పోటీల్లో 120 దేశాలకు చెందిన మోడల్స్ పాల్గొంటారని తెలిపారు. వెల్కమ్ డిన్నర్‌ను చౌహముల్లా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈవెంట్ ప్రారంభం నుంచి చివరి వరకు పర్యాటక ప్రత్యేకతలు చాటేలా కార్యక్రమాలు రూపొందించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్యాలెస్‌లో ఫోటో షూటింగ్ కోసం సీటింగ్ ఏర్పాట్లు, లైవ్ మ్యూజిక్ కాంటెస్ట్, సూఫీ మ్యూజిక్, కవ్వాలీ సంగీత ప్రదర్శన, తెలంగాణ సాంస్క తి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా 20 నిమిషాలు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించాలని చెప్పారు. ఈ సమీక్షలో టూరిజం డైరెక్టర్ హనుమంతు, యూత్ సర్వీసెస్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ కిషన్‌రావు, సెట్విన్ ఎండీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ వేదన

2023లో ప్రపంచంలోనే అత్యధిక ప్రసవ మరణాలలో భారత్‌కు రెండవస్థానం



న్యూఢిల్లీ : 2023లో రెండవ అత్యధిక ప్రసవ మరణాలతో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో నిలిచినట్టు యూఎన్ నివేదిక తెలిపింది. అంటే రోజుకి 52 మంది ప్రసవం సమయంలో మరణించారని తెలిపింది. 19,000 ప్రసవ మరణాలతో భారత్, కాంగోలు రెండవస్థానంలో నిలవగా నైజీరియా మొదటి స్థానంలో ఉన్నట్టు నివేదిక తెలిపింది.

'2000-2003లో ప్రసూతి మరణాల స్థితి' అనే శీర్షికతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ),యూనిసెఫ్, ఐరాస పాపులేషన్ ఫండ, ప్రపంచ బ్యాంక్ (డబ్ల్యూబీ) యూఎన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ అఫైర్స్ (జనాభా విభాగం) సంయుక్తంగా ఈ నివేదికను రూపొందించాయి. ప్రసవం లేదా గర్భధారణ సమయంలో వచ్చే సమస్యలతో ప్రసవమరణాలు జరుగుతున్నాయని నివేదిక వెల్లడించింది. ప్రసవం సమయంలో అధిక రక్తస్రావం, ఇతర వ్యాధులను నివారించే మందులు అందుబాటులో లేకపోవడం, అసురక్షిత గర్భసావాల కారణంగా ప్రసూతి మరణాలు పెరుగుతున్నాయని స్పష్టం చేసింది. 2023లో మూడు వంతుల కంటే ఎక్కువగా (28.7 శాతం), సుమారు 75,000 మరణాలతో నైజీరియా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపింది. 10,000 కంటే అధిక ప్రసూతి మరణాలు నమోదైన మొదటి మూడు దేశాలు భారత్, కాంగో (19,000), పాకిస్థాన్ (11,000)లుగా ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రసూతి మరణాలలో భారత్, కాంగోలు 7.2 శాతం వాటా కలిగి ఉండగా, పాకిస్థాన్ 4.1 శాతం వాటా క లిగి ఉంది. నివేదిక ప్రకారం.. 2023లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రసూతి మరణాలలో ఈ నాలుగు దేశాలు సుమారు సగం (47శాతం) వాటా కలిగి ఉన్నాయి. భారత్‌తో సమానమైన జనాభా కలిగిన చైనాలో 2023లో 1,400 ప్రసూతి మరణాలు నమోదయ్యాయని తెలిపింది.

కేరళలో మెరుగైన శ్రద్ధ

1947లో భారత్‌లో ప్రసూతి మరణాల రేటు 1,00,000 జననాలకు 2,000గా ఉండేది. కానీ ప్రస్తుతం అది 97కి చేరుకుంది. అయితే కేరళ ఈ అంశంలో మెరుగైన శ్రద్ధ చూపుతోంది. ఇక్కడ లక్షకు 19 మంది మహిళలు మరణిస్తున్నారు. ఈ రాష్ట్రంలో శిశుమరణాల రేటు కూడా తక్కువగానే ఉంది. 1970 గణాంకాల ప్రకారం, శిశుమరణాల రేటు వెయ్యికి 56గా ఉంది. ఇప్పుడు ఆ సంఖ్య ఆరుగా ఉంది.



అమల్లోకి వక్ఫ్ సవరణ చట్టం..

- కేంద్రం నోటిఫికేషన్ జారీ
- 16న సుప్రీంకోర్టులో విచారణకు స్వీకారం
- కేవియట్ దాఖలు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం, 2025 అమల్లోకి వచ్చింది. ఈ మేరకు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం (ఏప్రిల్ 8) నుంచే ఈ చట్టం అమల్లోకి తీసుకొస్తున్నట్టు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇటీవల పార్లమెంట్ ఉభయ సభల నుంచి ఈ బిల్లు పాస్ అవ్వగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో వక్ఫ్(సవరణ) బిల్లు చట్టంగా మారింది. ఈ నేపథ్యంలో నేటి నుంచే అమల్లోకి తీసుకొస్తున్నట్టు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

మరోవైపు కేంద్రం తీసుకొచ్చిన కొత్త వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ముస్లిం సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై విపక్ష పార్టీల ఎంపీలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మొత్తం 15 పిటిషన్లు దాఖలు కాగా.. వీటిపై సర్వోన్నత న్యాయస్థానం ఏప్రిల్ 16న విచారణ జరపనుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం కేవియట్‌ను దాఖలు చేసింది. తమ అభిప్రాయం తెలుసుకోకుండా ఎలాంటి ఆదేశాలూ జారీ చేయొద్దని కోరింది.

ఖైదీల సమస్యలపై రాష్ట్రాలకు ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఉన్న జైళ్లలో ఖైదీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. మహిళా ఖైదీలు, వారి పిల్లలకు కూడా జైళ్లలో కనీస సౌకర్యాలు లేవని, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు లేకపోవడం, జైళ్లలో రద్దీ కూడా ఆందోళన కలిగిస్తోందని కమిషన్ తన నోటీసుల్లో పేర్కొంది. తమ ఆందోళనలపై నాలుగు వారాల్లోగా వివరణాత్మక నివేదికను సమర్పించాలని ఆదేశించింది. జైళ్లలో ఖైదీల సమస్యలను సుమోటాగా స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సి ప్రత్యేక పరిశీలకులను విచారణకు పంపింది. వారు ఇచ్చిన

ఈనెల 11న ఏఐకేఎస్ వ్యవస్థాపక దినోత్సవం

- గ్రామ, గ్రామాన జెండా ఎగురేయాలి : పోస్టర్ ఆవిష్కరణలో టీ. సాగర్ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 89వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈనెల 11న గ్రామ, గ్రామాన నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు.అన్ని గ్రామాల్లో రైతుసంఘం జెండా ఎగురవేయాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ జిల్లా, మండల కేంద్రాల్లో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్ల నాయకులను ఆహ్వానించి సదస్సులు నిర్వహించాలన్నారు. అప్పటి దోపిడీ వలస, భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా పెరుగుతున్న పోరాటాల నేపథ్యంలో 1936 ఏప్రిల్ 11న లక్నోలో స్థాపించారని గుర్తు చేశారు. నేడు కిసాన్ సభ 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 1,46,88,354 సభ్యత్వంతో భారతదేశంలో అతిపెద్ద రైతు సంఘం అని తెలిపారు. ఐక్య రైతు ఉద్యమం, రైతు కార్మికుల ఐక్యతను నిర్మించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోందన్నారు. 'ప్రత్యామ్నాయం కోసం పోరాడుదాం...సంఘటితంగా ముందుకు సాగుదాం' అనే నినాదాలతో మహిళా రైతులు, యువ రైతుల గరిష్ట సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, రాష్ట్ర నాయకులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో లారీ బీభత్సం

- ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు


(ఫైల్)

నవతెలంగాణ-మియాపూర్

మియాపూర్‌లో ఓ లారీ బీభత్సం సృష్టించిన ఘటనలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. మియాపూర్ ట్రాఫిక్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మెట్రో స్టేషన్ పిల్లర్ నెంబర్ 600 యూ-టర్న్ వద్ద నో ఎంట్రీ డ్యూటీల కోసం సోమవారం రాత్రి కానిస్టేబుళ్లు రాజ వర్ధన్, వికేందర్, సింహాచలం(45) విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం మోమిన్‌పేటకు చెందిన లారీ డ్రైవర్ కె. శ్రీనివాస్.. లారీపై సోమవారం రాత్రి 10:25 గంటల సమయంలో కూకట్‌పల్లి నుంచి మియాపూర్‌కు వస్తున్నాడు. మియాపూర్ మెట్రో స్టేషన్‌కు చేరుకునే సమయంలో పిల్లర్ నంబర్ 600 వద్ద డ్రైవర్ వాహనాన్ని వేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతో లారీ అదుపు తప్పి అక్కడే ఉన్న ట్రాఫిక్ గొడుగును ఢీకొట్టింది. దాంతో అది ఎగిరి ట్రాఫిక్ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు సింహాచలం, రాజ వర్ధన్, వికేందర్‌పై పడింది. ఈ ఘటనలో సింహాచలం తలకు తీవ్ర గాయమైంది. మరో కానిస్టేబుల్ రాజవర్ధన్ కుడి భుజంలో ఫ్రాక్చర్ కాగా, వికేందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని వెంటనే మదీనాగూడలోని శ్రీకర ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. కానిస్టేబుల్ సింహాచలం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మియాపూర్ పోలీసులు తెలిపారు.

సిరిసిల్లలో కత్తిపోట్ల కలకలం

- దారి వివాదంలో బాబాయి కుటుంబంపై యువకుడి దాడి
- బాలునితోపాటు నిండు గర్భిణికి తీవ్ర గాయాలు
- సిరిసిల్ల ప్రధాన ఆస్పత్రికి తరలింపు
- బాలుని పరిస్థితి విషమం


(ఫైల్)

నవతెలంగాణ - సిరిసిల్ల

సిరిసిల్లలో కత్తిపోట్లు కలకలం రేపాయి. దారి వివాదంలో సొంత బాబాయి కుటుంబంపై యువకుడు కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో మూడేండ్ల బాలునితోపాటు నిండు గర్భిణికి తీవ్ర గాయాలయ్యాయి. బాలుని పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం శాంతినగర్‌కు చెందిన కలికోట వెంకటేష్‌కు తన అన్న కొడుకు పృథ్వీకి మధ్య కొన్ని రోజులుగా దారి విషయంలో వివాదం జరుగుతోంది. మంగళవారం సాయంత్రం పృథ్వీ మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి వెంకటేష్‌పై కత్తులతో దాడికి దిగారు. వెంకటేష్‌కు స్వల్ప గాయాలు కాగా, అడ్డు వచ్చిన ఆయన భార్య నిండు గర్భిణి ఏంజెల్, మూడేండ్ల బాలుడు శివనేత్రపై కూడా విచక్షణారహితంగా కత్తులతో దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు వెంటనే సిరిసిల్ల ప్రధాన ఆస్పత్రికి తరలించారు. బాలుని పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కరీంనగర్ ప్రతిమ ఆస్పత్రికి తీసుకెళ్లారు. గతంలో పృథ్వీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని, వాళ్లు పట్టించుకొని ఉంటే ఇలాంటి ఘటన జరిగేది కాదని వెంకటేష్ వాపోయాడు.

పి4 అమలుకు సొసైటీ

- రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు వ్యవస్థ
- స్టేట్ చైర్మన్‌గా చంద్రబాబు, డిప్యూటీ చైర్మన్‌గా పవన్‌కల్యాణ్

ఆగస్టు 15 కల్లా 15 లక్షల బంగారు కుటుంబాల దత్తత : సమీక్షలో ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి : జీరో పావర్టీ-పి4 అమలుకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రభుత్వం సొసైటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. పి4పై మంగళవారం సచివాలయంలో సిఎం సమీక్ష నిర్వహించారు. ఈ వ్యవస్థ పటిష్టత కోసం స్టేట్ లెవెల్ సొసైటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. స్టేట్ లెవెల్ సొసైటీ ఛైర్మన్‌గా సిఎం, వైస్ ఛైర్మన్‌గా డిప్యూటీ సిఎం వ్యవహరించనున్నారు. సిఇఒ, డైరెక్టర్ వారికి అనుసంధానంగా కాల్‌సెంటర్, టెక్‌టీమ్, ప్రోగ్రాం టీమ్, వింగ్‌టీమ్ ఉండనున్నాయి. జిల్లా చాప్టర్‌కు జిల్లా మంత్రి ఛైర్మన్‌గా, గ్రామ, వార్డు స్థాయిలో సెక్రటేరియట్ చాప్టర్‌కు పంచాయతీ కార్యదర్శి, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు ఉంటారన్నారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి జిల్లా కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలు మార్గదర్శులను గుర్తించాల్సిన బాధ్యత వీరిదేనన్నారు. దాతలు ఎవరెవరు? ఎంతెంత మొత్తం ఇచ్చారు? ఇంకెంత సాయం 'బంగారు కుటుంబాలకు' అవసరమవుతుంది అనే విషయాలన్నీ వెబ్‌సైట్‌లో పొందుపరచడంతో పాటు పారదర్శకంగా ఉంటుందని సిఎం పేర్కొన్నారు. దాతలు ముందుగా పి4 ప్లాట్‌ఫామ్ ద్వారా లాగిన్ అవ్వడంతో ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆగస్టు నాటికి ఈ నమోదు ప్రక్రియ పూర్తి చేసి కార్యరూపం దాల్చేలా చూడాలని అధికారులకు సిఎం నిర్దేశించారు. వచ్చే ఉగాది నాటికల్లా పి4 కార్యక్రమం ద్వారా ఏడాది కాలంలో ఏం సాధించామనే దానిపై వార్షిక ప్రగతి నివేదిక విడుదల చేయాలని సిఎం తెలిపారు. ఇందుకోసం 'మిలాప్', 'డోనేట్‌కార్ట్,' 'రంగ్‌దే' సంస్థలు షేయర్లుగా పి4లో భాగస్వాములు అవుతున్నాయని సిఎం తెలిపారు. ఆగస్టు 15 కల్లా 5 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మార్గదర్శి, బంగారు కుటుంబాల నమోదు చేడుతున్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

15 నుంచి 'ఇంటింటికి మన మిత్ర'

రెవెన్యూ, పోలీస్, మున్సిపల్‌శాఖల్లోనే అత్యధిక ఫిర్యాదులు అందుతున్నాయని, మొత్తం ఫిర్యాదుల్లో 90 శాతం ఆ శాఖలకు సంబంధించినవేనని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)ను వినియోగించుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. గ్రీవెన్స్‌లలో వస్తున్న ఫిర్యాదులు, పరిష్కారాలపై సచివాలయంలో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు ఫిర్యాదులకు సంబంధించిన స్థితిని తెలిపేలా సమాచారం అందించాలన్నారు. పరిష్కరించగలిగే వినతుల విషయంలో ఫిర్యాదుదారుకు ఎందుకు పరిష్కరించలేకపోతున్నామనే విషయాన్ని సమగ్రంగా తెలియజేయాలని సిఎం పేర్కొన్నారు. ఆధార్ నెంబర్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబరు తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా గ్రీవెన్స్ నమోదుచేయాలని, దీని ద్వారా నకిలీ ఫిర్యాదులు అరికట్టవచ్చని సిఎం అన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కదారి పట్టించేలా వ్యవస్థను దుర్వినియోగం చేసేలా ఒకే విషయంపై అదే పనిగా ఎవరైనా ఫిర్యాదు చేస్తూ ఉంటే అటువంటి వారి వివరాలు సేకరించి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వినతులు పరిష్కరించిన తర్వాత ఎవరైతే గ్రీవెన్స్ దరఖాస్తు చేశారో వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని అధికారులకు సూచించారు. తనకు నేరుగా వచ్చే గ్రీవెన్స్‌లను ఆయా జిల్లాల కలెక్టర్లు స్వయంగా ఫిర్యాదుదారునితో సంప్రదించి ఫాలో అప్ చేయడం ద్వారా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గత ప్రభుత్వం రీ సర్వేలో నిబంధనలు ఉల్లంఘించడంతో భూ సంబంధిత ఫిర్యాదులు పెరిగినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఫిర్యాదుల్లో ముఖ్యంగా రెవెన్యూ రికార్డుల్లో భూ యజమాని పేరు మారిపోవడం, పట్టాదారు పాస్ పుస్తకాల్లో పేర్లు సవరణ, రీసర్వేలో విస్తీర్ణంలో తేడాలు వంటివి ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. పోలీస్‌శాఖకు సంబంధించి ఆస్తి తగాదాలు, సైబర్‌క్రైమ్, వైవాహిక సమస్యలు, భూ సంబంధిత తగాదాలు, ఆర్థిక నేరాలతో ముడిపడిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని సిఎం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. మున్సిపల్ శాఖలో ఎక్కువగా ఆస్తుల ఆక్రమణ, నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టడం, అనధికార నిర్మాణాలు, ఆస్తిపన్నులు వంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నట్లు అధికారులు వివరించారు.

ప్రతి ఒక్కరి ఫోన్‌లో మనమిత్ర నెంబరు 9552300009

వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా ప్రభుత్వం ఈ నెల 15 నుంచి ఇంటింటికీ మనమిత్ర కార్యక్రమం ప్రత్యేక డ్రైవ్ చేపట్టనుంది. ఈ కార్యక్రమం పర్యవేక్షణ బాధ్యతలను ఆయా జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం అప్పజెప్పింది. సచివాలయ సిబ్బందితో ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించడంతోపాటు ప్రతిఒక్కరి మొబైల్‌లో మనమిత్ర నెంబరు ఉండేలా చేయాల్సి ఉంది. మనమిత్ర నెంబరు 9552300009ను ప్రతిఒక్కరూ సేవ్ చేసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే డిజిటల్ సర్టిఫికెట్లకు చట్టబద్ధత కూడా ఉందని ఐటి, ఆర్‌టిజిఎస్ శాఖలు వెల్లడించాయి.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

తప్పు చేసిన ఏ పోలీసునూ వదిలిపెట్టం : జగన్ లింగమయ్య కుటుంబానికి పరామర్శ



అనంతపురం : టిడిపి కూటమి పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో పది రోజుల క్రితం హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. హెలికాప్టర్‌లో బెంగళూరు నుంచి నేరుగా పాపిరెడ్డిపల్లి గ్రామానికి జగన్ చేరుకున్నారు. లింగమయ్య ఇంటి వద్దకెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో టిడిపికి బలం లేకున్నా తమవైపు తిప్పుకునేందుకు అనేక అప్రజాస్వామిక విధానాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుసరించారని విమర్శించారు. విశాఖపట్నం, తిరుపతి, రామకుప్పం, అత్తిలి తదితర ప్రాంతాల్లో ఇటువంటి ప్రయత్నాలు జరిగాయన్నారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలోనూ ఎంపిటిసి సభ్యులు ఎనిమిది మంది వైసిపి వాళ్లుంటే వారందరినీ భయపెట్టి టిడిపిలో చేర్చుకునేందుకు వివిధ రకాలుగా ఇక్కడి ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆయన కుమారుడు శ్రీరామ్ ప్రయత్నించారని, దీనికి స్థానిక ఎస్ఐ సుధాకర్ మద్దతుగా వ్యవహరించారని విమర్శించారు. వారి ప్రలోభాలకు లొంగకుండా వైసిపి ఎంపిటిసి సభ్యులు గట్టిగా నిలబడ్డారన్నారు. అందుకు వారిని పోలీసు స్టేషన్‌లో బైండోవర్ చేశారని, వారికి మద్దతుగా వెళ్లిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు ఉషశ్రీచరణ్‌పైనా కేసులు నమోదు చేశారని తెలిపారు. తమ పార్టీకి మద్దతుగా నిలిచిన కురుబ లింగమయ్యను 20 మంది టిడిపి మద్దతుదారులు హత్యగా కేసులు మాత్రం ఇద్దరిపైనే పెట్టారని విమర్శించారు. ఇదే రకంగా నంద్యాల, మహానంది, పెద్దకురపాడుల్లోనూ వైసిపి నాయకులపై టిడిపి వారు దాడులు

చేశారని చెప్పారు. మరికొంత మందిని తప్పుడు కేసు పెట్టి జైళ్లలో పెడుతున్నారన్నారు. పోసాని కృష్ణమురళి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నందిగామ సురేష్, వల్లభనేని వంశీ తదితర నాయకులను జైళ్లలో పెట్టారని వివరించారు. అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు ఇదే తీరున వ్యవహరిస్తే తాము అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

రోడ్డు మార్గంలో తిరుగు ప్రయాణం

బెంగళూరు నుంచి పాపిరెడ్డిపల్లి గ్రామం సమీపం వరకు హెలికాప్టర్‌లో జగన్ వచ్చారు. ఆ సమయంలో అక్కడికి పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు చేరుకుని హెలికాప్టర్‌ను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా అక్కడ కొంత గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ విరిగిపోయింది. దీంతో ఆ హెలికాప్టర్‌లో విఐపిని తీసుకెళ్లలేమని పైలట్లు చెప్పడంతో జగన్ రోడ్డు మార్గంలో బెంగళూరుకు వెళ్లారు. భద్రతాపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీసులు వైఫల్యం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వైసిపి నాయకులు విమర్శించారు.

రాజేంద్రనగర్ డైరీ ఫామ్ చౌరస్తాలో అగ్నిప్రమాదం



నవతెలంగాణ-రాజేంద్రనగర్

విద్యుత్ స్తంభంపై విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి అంటుకొని రాజేంద్రనగర్ డైరీ ఫామ్ చౌరస్తాలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డైరీ ఫామ్ చౌరస్తా వద్ద సాయంత్రం ఒక స్తంభంపై రెండు విద్యుత్ తీగలు ఒకదానితో ఒకటి అంటుకొని ఉండటంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అధికారులు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సుమారు గంటపాటు మంటలు అలాగే చెలరేగాయి. తర్వాత విద్యుత్ అధికారులు మరమ్మతులు నిర్వహించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ ఘటనతో కొద్దిసేపు అక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు సకాలంలో అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

హనుమకొండలో బస్సు బోల్తా..

15 మంది ప్రయాణికులకు గాయాలు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టు రింగ్ రోడ్డు బ్రిడ్జి వద్ద మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఒంగోలు నుంచి ఆదిలాబాద్ వెళ్లే లహరి బస్సుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు సమాచారం.

'ఆయనో మూర్ఖుడు'

ట్రంప్ సలహాదారుడిపై మండిపడ్డ మస్క్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలపై ప్రపంచ దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోన్న వేళ మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ టారిఫ్‌లపై ఇప్పటికే అసంతృప్తిని వ్యక్తం చేసిన ఎలన్ మస్క్.. ట్రంప్ వాణిజ్య సలహాదారుడు పీటర్ నవారోపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆయనో మూర్ఖుడంటూ మండిపడ్డారు. వైట్‌హౌస్ సీనియర్ అడ్వైజర్ పీటర్ నవారో మీడియాతో మాట్లాడుతూ.. ఎలన్ మస్క్ కార్ల కంపెనీపై తీవ్ర విమర్శలు చేశారు. అది కార్ల తయారీ కంపెనీ కాదని, కేవలం కూర్పు చేసేదంటూ ఆరోపించారు. బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్, టైర్లు వంటి విడిభాగాలను జపాన్, చైనా నుంచి తీసుకువచ్చి.. కేవలం అసెంబ్లింగ్ చేస్తారని అన్నారు. చౌకగా లభించే విదేశీ విడిభాగాలే ఆయనకు (మస్క్‌కు) కావాలని నవారో పేర్కొన్నారు.దీనిపై ఎలన్ మస్క్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. నవారో మూర్ఖుడు అంటూ తీవ్రంగా స్పందించారు. అమెరికాలో తయారయ్యే కార్లలో టెస్లాదే అగ్రభాగమని చెప్పారు. అంతకుముందు ట్రంప్ టారిఫ్ విధానంపై ఎలన్ మస్క్ అసంతృప్తి చేసినట్టు వార్తలు వచ్చాయి. చైనా టారిఫ్‌లపై వెనక్కి తగ్గాలని అధ్యక్షుడికి సూచించారని, అయితే, ఆ చర్చలు విఫలమైనట్లు తెలిసింది. ఈ క్రమంలోనే తాజాగా ట్రంప్ వాణిజ్య సలహాదారుడిపై డోజ్ సారథి ఘాటు వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

చెత్త రహిత కేరళ

అడుగులు వేస్తున్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం
నేటి నుంచి 4 రోజులపాటు సదస్సు

తిరువనంతపురం : కేరళను చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు ఆ రాష్ట్ర వామపక్ష ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తిరువనంతపురాన్ని ఇప్పటికే చెత్త రహిత నగరంగా చేస్తోంది. రాష్ట్రం మొత్తాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. నవ కేరళం యాక్షన్ ప్లాన్-2లో భాగంగా, 'వ్యర్థ రహిత నవ కేరళం' ప్రజా ప్రస్థానం కింద రాష్ట్రం ఇప్పటికే చెత్త నిర్వహణలో ప్రశంసనీయమైన పురోగతిని సాధించింది. వేస్ట్ మేనేజ్‌మెంట్ రంగంలో కేరళ సాధించిన అద్భుతమైన విజయాలను గుర్తించి నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా వృత్తి (పరిశుభ్ర) 2025 - క్లీన్ కేరళ కాన్‌క్లేవ్ అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం ప్రారంభించనున్నారు. ఈ సదస్సు కేరళ సుస్థిరాభివృద్ధిలో భాగంగా వినూత్న వ్యర్థాల నిర్వహణ పద్ధతులు, వాతావరణ స్థితిగతులు, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంగా నిర్వహిస్తోంది. స్టేక్ హోల్డర్లను ఈ పరివర్తన మిషన్‌లో భాగం చేస్తుంది. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు కేరళ రాజధాని అయిన తిరువనంతపురంలోని కనకకున్ను ప్యాలెస్‌లో ఈ సమ్మేళనం జరగనుంది. రాష్ట్రంలో మొత్తం 1,034 స్థానిక సంస్థల్లో వ్యర్థ రహిత ప్రాంతాలుగా మార్చనుంది. ఈ కార్యక్రమాన్ని కేరళ ప్రభుత్వం, స్థానిక సంస్థల శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న సుచిత్వ మిషన్ సమన్వయం చేస్తోంది. హరిత కేరళ మిషన్, కేరళ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్, క్లీన్ కేరళ కంపెనీ లిమిటెడ్, కుటుంబశ్రీ, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ మిషన్, కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్, అమృత్, స్మార్ట్ సిటీ తిరువనంతపురం, ఇంపాక్ట్ కేరళ, కేరళ వాటర్ అథారిటీ, కేరళ స్టేట్ పొల్యూషన్‌లో ప్రైవేట్ పార్ట్‌నర్‌తో సహా వివిధ ఏజెన్సీలు పాల్గొంటాయి. కేరళ వ్యర్థ పదార్థాల నిర్వహణ నమూనాలు, సాధించిన విజయాలను ఈ సదస్సులో ప్రదర్శిస్తారు. వినూత్న సాంకేతికతలు, ఆలోచనలు, జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ అభ్యాసాలను అర్థం చేసుకునేలా వేదిక ఉంటుంది.

మరో మహమ్మారి అనివార్యం

డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ హెచ్చరిక



జెనీవా: ప్రపంచానికి మరో మహమ్మారి ముప్పు పొంచి ఉందని, అది అనివార్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయేసస్ ఉద్ఘాటించారు. అది సైద్ధాంతిక ముప్పు కాదని, అటువంటి వ్యాధులు మళ్లీ సంభవించే ప్రమాదం ఉందన్నారు. అయితే, ఎప్పుడనేది కచ్చితంగా చెప్పలేనప్పటికీ సంసిద్ధతతో ఉండాలని పిలుపునిచ్చారు.డబ్ల్యూహెచ్‌వో పాండమిక్ అగ్రిమెంట్‌పై జెనీవాలో నిర్వహించిన 13వ పున్ణప్రారంభ సమావేశాల్లో ప్రారంభోపన్యాసం చేసిన టెడ్రోస్.. కోవిడ్-19 మహమ్మారి వల్ల ప్రపంచం ఎదుర్కొన్న పర్యవసానాలను గుర్తుచేశారు. పరిస్థితులు చక్కబడే వరకు మరో మహమ్మారి ఎదురు చూడదన్న ఆయన.. అది ఎప్పుడైనా సంభవించవచ్చున్నారు. 20ఏండ్లు అంతకంటే ఎక్కువ లేదా రేపే జరగవచ్చని చెప్పారు. ఏదేమైనా అది కచ్చితంగా జరిగి తీరుతుందని, అందుకు సిద్ధంగా ఉండాలన్నారు."కోవిడ్-19 మహమ్మారి సృష్టించిన విలయాన్ని అందరం చూశాం. అధికారికంగా 70లక్షల మంది చనిపోయినప్పటికీ.. వాస్తవానికి ఆ సంఖ్య 2కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నాం. ప్రాణ నష్టానికి తోడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుంచి 10 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఆర్థిక నష్టాన్ని కలిగించింది" అని టెడ్రోస్ పేర్కొన్నారు. మహమ్మారి ఒప్పందంపై ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం రావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.